# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 1 - సంచిక 3 డిసెంబరు 2022 వెల : రూ.15

ఒక ఘన విజయం.. రెండు పరాజయాలు

వైరుధ్యాల జీవితాల్లోకి అడుగు పెడుతున్నాం

అణగారిన వర్గాలకు అంకితమైన జీవితం

హిందూ రాజ్యంపై అంబేద్కర్

అంబేద్కర్.. బుద్ధ అండ్ హిజ్ ధమ్మ

సీజేఐ చంద్రచూడ్.. న్యాయవ్యవస్థ

ఎనిమిదేళ్ల మోదీ పాలన.. జనంపై రణం.. దేశానికి రుణం

కొత్త స్త్రీలు వస్తున్నారు జాగ్రత్త

తరగని మార్క్స్ ప్రాధాన్యత

ఆమె విప్లవానికి మనసిచ్చింది

కొత్త చూపునిచ్చే మార్క్స్ అధ్యయన పద్ధతి

సర్వభాషలకు 'జనని' సంస్కృతం కాదు!

ఫాసిజం అంటే..

గురజాడకు కొత్త సమస్య

'అసత్యమే వారి ఇలవేలుపు'

పెదాలు దాటని మాటలు

మోలీ టిక్స్.. కార్టూన్లు

కొత్త పుస్తకాలు స్వీకారం

డిసెంబరు 2022

# దారి దీపం మాసపత్రిక

సంపుటి : 1 - సంచిక : 3


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణ మూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. ఒక ఘన విజయం.. రెండు పరాజయాలు 3
2. వైరుధ్యాల జీవితాల్లోకి అడుగు పెడుతున్నాం 4
3. అణగారిన వర్గాల కోసం అంకితమైన జీవితం 11
4. హిందూ రాజ్యాన్ని అంబేద్కర్ అతి పెద్ద ప్రమాదంగా ఎందుకు భావించారు? 12
5. అంబేద్కర్.. బుద్ధ అండ్ హిజ్ ధమ్మ 13
6. సీజేఐ చంద్రచూడ్.. న్యాయవ్యవస్థ పరిణామాలు 17
7. ఎనిమిదేళ్ల మోదీ పాలన.. జనంపై రణం.. దేశానికి రుణం 19
8. కొత్త స్త్రీలు వస్తున్నారు జాగ్రత్త 21
9. ఈనాటికీ తరగని మార్క్స్ ప్రాధాన్యత 23
10. ఆమె విప్లవానికి మనసిచ్చింది 30
11. కొత్త చూపునిచ్చే మార్క్స్ అధ్యయన పద్ధతి 32
12. సర్వభాషలకు 'జనని' సంస్కృతం కాదు! 33
13. ఫాసిజం.. మౌలికంగా ఒక భావనా శక్తి 36
14. గురజాడకు ఒక కొత్త సమస్య వచ్చిపడింది 37
15. 'అసత్యమే వారి ఇలవేలుపు' 39
16. పెదాలు దాటని మాటలు 41
17. మోలీ టిక్స్.. కార్టూన్లు 43
18. కొత్త పుస్తకాలు స్వీకారం.. 44




దారి దీపం మాసపత్రిక
వివరాలకు సంప్రదించండి
డా॥ బి.రమేష్ చంద్రబాబు,
34-15-1,
దొడ్డిపట్ల వారి తోట వీధి,
తణుకు - 534211,
ప.గో.జిల్లా, ఏపీ
ఫోన్ : 93971 14495

### గాంధీ మార్గం

నిన్ను స్తుతించే వారికంటే.. నిన్ను కఠినంగా విమర్శించే వారి వల్లనే నువ్వు అధికంగా మంచిని పొందగలవు.




సంపాదకీయం

# ఒక ఘన విజయం.. రెండు పరాజయాలు

గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ శాసనసభలకు, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు, ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఈ ఫలితాలు ఏకపక్షంగా లేవు. మిశ్రమంగా ఉన్నాయి. గుజరాత్‌లో మోదీ ఘన విజయం సాధిస్తే, హిమాచల్‌ప్రదేశ్‌లో చుక్కెదురైంది. మోదీ బొమ్మతో తన పటాలం ప్రచారం సాగించినా పరాజయం తప్పలేదు. ఇలా కీలకమైన మూడు ఎన్నికల్లో మోదీ హవాకు ఒక ఘన విజయం, రెండు పరాజయాలు సిద్ధించాయి. గుజరాత్‌లో మోదీ విజయపరంపరను కీర్తిస్తూ మీడియా ఈ మిశ్రమ ఫలితాలను తేలికగా కొట్టిపారేస్తున్నాయి. గుజరాత్ ఫలితాల చుట్టూ విశ్లేషణలు, చర్చలు, వ్యాఖ్యానాలు గుప్పిస్తూ మిగిలిన ఫలితాలను తెరవెనకకు నెట్టివేస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఫలితాన్ని సంప్రదాయబద్ధంగా అక్కడి ఓటర్లు ఐదేళ్లకు ప్రభుత్వాలను మార్చే రివాజుగా జరిగిందంటున్నారు. ఇక ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌ను ప్రస్తావిస్తున్న దానిని స్థానిక ఎన్నికగా చూపెడుతున్నారు. నిజానికి అది కార్పొరేషన్ ఎన్నికే అయినా ఒక రాష్ట్రం ఎన్నిక. హిమాచల్‌ప్రదేశ్‌లో నాలుగు లోక్‌సభ స్థానాలుంటే అక్కడ ఏడు ఉన్నాయి. హిమాచల్‌కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నారు. ఈ మూడు ఎన్నికలకు వున్న ప్రత్యేక ఏమిటంటే అన్నింటా బీజేపీ అధికారంలో ఉంది. అందులో రెండింటిలో ఓటమి పాలైంది. అలాగే ఐదు రాష్ట్రాలలో ఒక పార్లమెంట్‌కు ఆరు శాసనసభా స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలు అన్నింటిలోనూ బీజేపీ పోటీ చేసింది. కేవలం రెండు శాసనసభా స్థానాలలోనే గెలిచింది. మోదీ ప్రభంజనానికి వున్న పరిమితులను ఈ మిశ్రమ ఫలితాలు వ్యక్తీకరిస్తున్నాయి. గుజరాత్‌లో డబుల్ ఇంజన్ సర్కార్‌ల పాలనపై ప్రజలలో అసంతృప్తి ఉంది. పెరిగిన ధరలో నిరుద్యోగ తీవ్రత, అస్తవ్యస్థ ఆర్థిక విధానాల వల్ల దిగజారిన జీవన స్థితి మీద వ్యతిరేకత ఉంది. ఈ అసంతృప్తిని అధిగమించే శక్తులు ఈ ఎన్నికలలో పనిచేశాయి. 2002లో గోద్రా సంఘటన తర్వాత జరిగిన మారణకాండతో ప్రారంభమైన మెజారిటీ మతవాదం ప్రజలలో బాగా వేళ్లూనుకుంది. అది మత విద్వేషంగా చాలా మందిలో రూపుదిద్దుకుంది. ఈ ఎన్నికల ప్రచారంలో గోద్రా సంఘటన, ఆర్టికల్ 370, బాబ్రీ మసీదు స్థానంలో రామాలయ నిర్మాణం యూనిఫాం సివిల్ కోడ్‌లు బీజేపీ ప్రచార అస్త్రాలుగా బీజేపీ వినియోగించగలిగింది. పది శాతం ముస్లిం సమూహం వున్న గుజరాత్ బీజేపీ ఒక్క సీటు కూడా ఆ సమూహానికి కేటాయించకుండా తన మెజారిటీ జాతీయ వాదాన్ని చాటి చెప్పింది. దీనికితోడు గుజరాత్‌లో కుల సమీకరణలను తనకు అనుకూలంగా మల్చుకోగలిగింది. తమ పాలనపట్లగల వ్యతిరేకత నుంచి తప్పించుకోవడానికి 40 మంది సిటింగ్ సభ్యులకు సీట్లు కేటాయించకుండా కొత్త ముఖాలను ప్రవేశపెట్టింది. ఇక ప్రచార హోరు చెప్పనక్కర్లేదు. మోదీ, షాలు అక్కడే మకాం వేశారు. కార్పెట్ బాంబింగ్ తరహా ప్రచారం చేశారు. మోదీ స్వయంగా 100 కిలోమీటర్లు రోడ్ షో చేశారు. ఇలా ప్రజల కళ్లకు మతం గంతలు కట్టారు. కులం చట్రం బిగించారు. ప్రచారం హోరుతో ప్రజల్లో వున్న భావోద్వేగాలలో ముంచెత్తారు. ఇలా ప్రజల జీవన సమస్యలను, పాలనా అసమర్థతలను తెర లోపలికి తోసి విజయ ఢంకా మోగించారు. ఈ మెజారిటీ మతవాదల్ని కుల సమీకరణల ఇంజనీరింగ్‌లతో కూడిన గుజరాత్ నమూనాను ఢిల్లీ ప్రజలు తోసిపుచ్చారు. అక్కడ మోదీ తరహా మాటల మాంత్రికునికంటే చేతల ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మోదీ, షాల బృందం ఎన్నికల ప్రచారాన్ని ఉధృతంగానే సాగించారు. అయితే అక్కడ హిందూ మెజారిటీవాదాన్ని ప్రజలకు ఎక్కించడానికి అవసరమైన ముస్లిం బూచి లేదు. ఎన్నికల విజయాలు తెచ్చి పెట్టే ఆధిపత్య కులాలు, రాజకీయ పాత్ర లేదు. వారు ఎంత ప్రయత్నించినా గుజరాత్ నమూనా ఈ రాష్ట్రంలో చెల్లుబాటు కాలేదు. ప్రజల నిత్య జీవన సమస్యలే ఓటర్లను ప్రభావితం చేశాయి. వాటి ఆధారంగా సాగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం వారిని ఆకట్టుకోగలిగింది. ఈ ఎన్నికల ఫలితాలు మోదీ నమూనా ఎన్నికల తంత్రానికి గల పరిమితులను వెల్లడించింది. దేశంలోని బహుళ స్వభావాన్ని వ్యక్తీకరించింది. అయితే మోదీ ముందుకు తెస్తున్న భావ జాలం, మెజారిటీ జాతీయవాదం, ఫాసిస్టు పోకడలు కేవలం ఒకటి రెండు ఎన్నికల పరాజయాలతో సమసిపోయేది కాదు. ప్రజలు ఒకసారి ఆ భావజాలానికి గురైతే దానిని వదలించుకోవడానికి దీర్ఘకాలం పడుతుంది. ఈ భావజాలాన్ని ఓడించినప్పుడే మోదీకి నిజమైన ఓటమి కలుగుతుంది.

డీవీవీఎస్ వర్మ, సంపాదకులు,
85006 78977



# వైరుధ్యాల జీవితాల్లోకి అడుగు పెడుతున్నాం

**రాజ్యాంగ ముసాయిదా పూర్తయిన సందర్భంగా 25-11-1949న డా బి.ఆర్. అంబేడ్కర్ చారిత్రాత్మక ప్రసంగం**

## అధ్యకా !

1946 డిసెంబర్ 9న మొట్టమొదటగా సమావేశమైన నాటి నుంచి ఈ రాజ్యాంగ రచనా సభ నేటికి 2 సంవత్సరాల 11 నెలల 17 రోజులపాటు చర్చించింది. ఈ కాలంలో 11 సమావేశాలు జరిగాయి. మొదటి ఆరు సమావేశాల్లో ఆబ్జెక్టివ్స్ రిజల్యూషన్ (ఆశయాల తీర్మానం), ప్రాథమిక హక్కులు, యూనియన్ (కేంద్ర రాజ్యాంగం, యూనియన్ అధికారాలు, ప్రొవిన్షియల్ (రాష్ట్రాల) రాజ్యాంగం, మైనార్టీలు, షెడ్యూల్ ఏరియాలు, షెడ్యూలు తెగలపై వివిధ కమిటీల నివేదికలు చర్చించాం. ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు సమావేశాల్లో ముసాయిదా రాజ్యాంగం గురించి చర్చించాం. ఈ 11 సమావేశాలు 165 రోజులు జరిగాయి. ఇందులో 114 రోజులు మనం ముసాయిదా రాజ్యాంగం గురించి మాట్లాడుకున్నాం. 29 ఆగస్టు 1947న ఈ రాజ్యాంగ రచనా సభ డ్రాఫ్టింగ్ కమిటీని ఎన్నుకొంది. డ్రాఫ్టింగ్ కమిటీ మొదటి సమావేశం ఆగస్టు 30న జరిగింది. 141 రోజులపాటు రాజ్యాంగ ముసాయిదా తయారు చేసేందుకు కృషి సల్పింది. రాజ్యాంగ సలహాదారు రూపొందించిన 243 ఆర్టికల్స్, 13 షెడ్యూళ్ల ప్రతిపై డ్రాఫ్ట్ కమిటీ కసరత్తు చేసింది. రాజ్యాంగ సభకు 315 ఆర్టికల్స్, 8 షెడ్యూల్స్ తొలి రాజ్యాంగ ముసాయిదాను సమర్పించింది. మొత్తం 7,635 సవరణలు ముందుంచగా అందులో 2.473 సవరణలు సభలో చర్చించాం. రాజ్యాంగ రచనకు మా కమిటీ ఎక్కువ సమయం తీసుకుందనీ, ప్రజాధనం వృథా అవుతోందనీ విమర్శలు వస్తున్నందున నేను ఈ వాస్తవాలను వెల్లడించాల్సి వస్తోంది. రోమ్ తగలబడుతోంటే నీరో ఫిడేలు వాయిస్తున్నట్టుందన్న పై విమర్శలో సత్యమేమైనా వుందా? ఇక, ఇతర దేశాల రాజ్యాంగ రచనకు ఆయా దేశాల రాజ్యాంగ రచనా సభలు తీసుకున్న సమయాన్ని లెక్కిద్దాం. అమెరికాలో 25 మే 1787న మొదలు పెట్టి నాలుగు నెలల కాలంలో అంటే 17 సెప్టెంబర్ 1787కల్లా రాజ్యాంగ రచన ముగించారు. కెనడాలో 10 అక్టోబర్ 1864న మొదలై మార్చి 1867కు రాజ్యాంగ చట్టం చేశారు. ఇందుకు పట్టిన కాలం 2 సంవత్సరాల 5 నెలలు. మార్చి 1891లో ప్రారంభిస్తే 9 జులై 1900 నాటికి, అంటే 9 సంవత్సరాలకు గానీ ఆస్ట్రేలియా రాజ్యాంగం రూపొందలేదు. 1908లో ప్రారంభించి ఒక సంవత్సర కాల శ్రమతో 1909, 20 సెప్టెంబరు నాటికి దక్షిణాఫ్రికా తన రాజ్యాంగాన్ని రచించుకొంది. అమెరికా, దక్షిణాఫ్రికా రాజ్యాంగాల రూపకల్పన కంటే అధిక సమయం తీసుకున్నప్పటికీ, మనం కెనడా, ఆస్ట్రేలియా రాజ్యాంగాల రచనాకాలంతో పోల్చుకుంటే తక్కువ సమయం తీసుకున్నట్టే లెక్క. సమయంతో పోల్చే సందర్భంలో కూడా రెండు అంశాలను మనం పరిగణనలోకి తీసుకోవాలి. అందులో ఒక అంశం: అమెరికా, కెనడా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల రాజ్యాంగాలు మన దేశ రాజ్యాంగం కన్నా చిన్నవి. మన రాజ్యాంగంలో 395 ఆర్టికల్స్ వుండగా అమెరికా రాజ్యాంగంలో కేవలం 7 ఆర్టికల్స్ మాత్రమే వున్నాయి. అందులో మొదటి 4 ఆర్టికల్స్‌లో 21 సెక్షన్స్ మాత్రం వుంటాయి. కెనడా రాజ్యాంగం 147 ఆర్టికల్స్, ఆస్ట్రేలియా రాజ్యాంగం 128 ఆర్టికల్స్, దక్షిణా ఫ్రికా రాజ్యాంగం 153 ఆర్టికల్స్ కలిగివున్నాయి. రెండో అంశం కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా, దక్షిణాఫ్రికా రాజ్యాంగ రచనా కర్తలు సవరణల సమస్యను ఎదుర్కొనలేదు. ఆ రాజ్యాంగాలు ప్రతిపాదించగానే ఎటువంటి సవరణల సమస్యలు లేకుండా

యథాతథంగా ఆమోదించారు. మరోవైపు మన రాజ్యాంగం 2,473 సవరణల చర్చను ఎదుర్కోవలసివచ్చింది. అందువల్ల రాజ్యాంగ రచన ఆలస్యమైందన్న ఆరోపణ అసంబద్ధమైనది. ఇంత త్వరగా రాజ్యాంగ రచన పూర్తయినందుకు ఈ సభ తనను తాను అభినందించుకోవాలి.

డ్రాఫ్టింగ్ కమిటీ రచనా నాణ్యత విషయం గురించి వస్తే, నజీరుద్దీన్ అహ్మద్ అభిప్రాయంలో నాసిరకం, తక్కువస్థాయి. ఈ అభిప్రాయం కలిగి వుండే హక్కు ఆయనకుంది. డ్రాఫ్టింగ్ కమిటీకంటే తనకెక్కువ సామర్థ్యముందని ఆయన అభిప్రాయం. ఈ సభ డ్రాఫ్టింగ్ కమిటీలో ఆయన్నూ ఒక సభ్యునిగా ఎన్నుకొంటే మేం ఆయన్ను సాదరంగా ఆహ్వానించేవాళ్లం. కమిటీలో ఆయన లేకపోవడమన్నది మా తప్పుకాదు. డ్రాఫ్టింగ్ (రచనా) కమిటీని డ్రిఫ్టింగ్ (నీళ్లలో ఎటుబడితే అటు కొట్టుకొనిపోతున్న) కమిటీగా వర్ణించి ఆయన తన అసమ్మతిని తెలిపారు. అయితే నేర్పరితనంతో కూడిన వేగానికి(డ్రిఫ్ట్), నేర్పులేని వేగానికి(డ్రిఫ్ట్) తేడావుంది. పరిస్థితులకనుగుణంగా నేర్పుగానే ఈ కమిటీ కదిలింది. తెలియనిచోట కాక తెలిసిన చోటే చేపలవేట చేసింది. ఎటుబడితే అటు కొట్టుకుపోకుండా అన్వేషణతోనే కొన సాగింది. ఆయనే వుద్దేశ్యంతో ఆ వ్యాఖ్య చేసినా దాన్ని మేం అభినందనగానే స్వీకరిస్తున్నాం. అనవసరమైన సవరణ ప్రతిపాదనలను తొలగించి అవసరమైన ప్రతిపాదనలను కమిటీ స్వీకరించింది. అలా చేయకపోవడం బాధ్యత రాహిత్యం, అగౌరవమైన చర్యే కదా! అలా చేయడం పొరపాటైతే ఆ పొరపాటు సరిదిద్దుకొనేందుకు మాకు అభ్యంతరమేమీ లేదు.

ఒక్క సభ్యుడు మినహా మిగిలిన రాజ్యాంగ సభ అంతా మా కమిటీ పనితీరుపై సంతృప్తికరంగా అభినందనీయంగా వున్నందుకు సంతోషిస్తున్నాం. ఓ వైపు యావత్ సభ, మరోవైపు మా కమిటీ సభ్యుల అభినందనల వెల్లువ నన్ను ముంచెత్తింది. వారికి ఏ విధంగా కృతజ్ఞతలు చెప్పాలన్నా, నాకు సరైన మాటలు దొరకటం లేదు. షెడ్యూల్డు కులాల ప్రయోజనాలు పరిరక్షించే ఏకైక ప్రయోజనంతోనే నేను ఈ సభలో అడుగుపెట్టాను. అత్యంత బాధ్యతాయుతమైన పనులను నాకప్పగిస్తారని ఊహించలేదు. డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యునిగా ఎన్నుకున్నప్పుడు ఆశ్చర్యపడ్డాను. కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. నిజానికి డ్రాఫ్టింగ్ కమిటీలో నాకంటే సమర్థుడైన మిత్రుడు అల్లాడి కుప్పుస్వామి అయ్యర్ వున్నారు. అయినప్పటికీ నామీద నమ్మకం, విశ్వాసం వుంచి దేశానికి సేవ చేసేందుకు నన్ను ఎన్నుకొన్న ఈ సభకు నేనెంతగానో కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను (కరతాళ ధ్వనులు), డ్రాఫ్టింగ్ కమిటీ కోసం ముసాయిదా ప్రతిని తయారుచేసిన రాజ్యాంగ సలహాదారు బి.ఎన్.రావుకు కూడా ఈ అభినందనల్లో వాటా చెందాలి. 141 రోజులపాటు విభిన్న దృక్పథాలను సహనంతో పరిశీలించి వాటిని సర్దుబాటు చేసుకునే సమర్థతతో, నిజాయితీతో నూతన సూత్రాలను ఎప్పటికప్పుడు ఆవిష్కరించిన మా డ్రాఫ్టింగ్ కమిటీలోని సభ్యులకు ఈ అభినందనలు చెందాలి. చీఫ్ డ్రాఫ్ట్స్‌మన్(ముఖ్య రాయసగాడు) ఎన్.ఎన్.ముఖర్జీకి మరింతగా ఈ అభినందనలు చెందాలి. అత్యంత క్లిష్టమైన ప్రతిపాదనలను సులభతరం చేసి లీగల్ సూత్రాల ప్రకారం వాటిని రూపకల్పన చేసిన ఆయన ప్రతిభ అనితరసాధ్యం. ఆయన నిరంతర కృషీవలుడు. ఈ సభ సేకరించుకొన్న విలువైన వ్యక్తి. ఆయన సహాయం లేకుంటే ఈ రాజ్యాంగ రచనకు మరిన్ని సంవత్సరాలు పట్టేది. ముఖర్జీ సిబ్బందిని ఈ సందర్భంగా మనం గుర్తించి గౌరవించాలి. అర్ధరాత్రులు దాటాక వారు చేసిన కష్టతరమైన శ్రమ గురించి నాకు తెలుసు. వారి శ్రమకు, సహకారానికి ధన్యవాదాలు (కరతాళ ధ్వనులు). ఇందులోని సభ్యులు ఒక గుంపుగా కాక, ఎగుడుదిగుడు రాళ్లతో కూడిన ఒక రోడ్డు పక్క కాలిబాటగా కాక, ఎవరికి వారే అన్న తీరున కాక.. వుండటంతో మా శ్రమ తప్పింది. లేకపోతే అయోమయ వాతావరణం నెలకొనేది. సభా కార్యక్రమాలు పద్ధతిగా, క్రమశిక్షణగా నడిపేందుకు కాంగ్రెస్ పార్టీ సహకరించింది. అందువల్ల అభినందనలు ఆ పార్టీకి కూడా చెందాలి. పార్టీ క్రమశిక్షణకు సభ్యులందరూ లొంగివుండకపోతే సభ కార్యకలాపాలు సజావుగా సాగేది కాదు. పార్టీ క్రమశిక్షణ సభ్యులను 'అవును' అని ఆమోదించేవారిగా మలచింది. అదృష్టవశాత్తు తిరుగుబాటుదారులు వున్నారు. వారు కామత్, డా॥ పీఎస్ దేశముఖ్, సిధ్వ, ప్రొ॥ సక్సేనా, పండిట్ ఠాకూర్, దాస్ భార్గవ, ప్రొ॥ కె.టి.షా, పండిట్ హృదయనాథ్ కుంజ్రూలు. వారు లేవనెత్తిన అంశాలు సైద్ధాంతికమైనవి. వారు లేవనెత్తిన అంశాలు నేను అంగీకరించలేదంటే ఆ సలహాలు విలువైనవి కావని మాత్రం అర్థంకాదు. సభ నిర్వహణలో వారందించిన సేవలకు ధన్యవాదాలు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని కేవలం యాంత్రికంగా ఆమోదించడం కాకుండా రాజ్యాంగ మౌలిక ఆదర్శాలను గురించి సవివరంగా పరిశోధించి చర్చించే అవకాశం కలిగింది.

చివరగా సభ కార్యకలాపాలను సజావుగా నిర్వహించిన సభాధ్యక్షులకు కృతజ్ఞతలు. ఈ సందర్భంగా మీరు చూపిన చొరవ, సమన్వయం సభికులెవరూ మర్చిపోలేరు. కొన్ని సందర్భాల్లో డ్రాఫ్టింగ్ కమిటీ సవరణలకు సాంకేతిక అంశాలు అడ్డు వచ్చిన సందర్భాల్లో నేనెంతో ఆందోళనకు గురయ్యాను. అయితే రాజ్యాంగ రచనా పద్ధతిని న్యాయ సాంకేతిక అంశాలు అడ్డుకోనివ్వకుండా సభాధ్యక్షులు చూపిన చొరవకు ధన్యవాదాలు. రాజ్యాంగానికి మద్దతుగా అన్ని అంశాలనూ సవివరంగా నా మిత్రుడు సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, టి.టి. కృష్ణమాచారులు మాట్లాడారు. కాబట్టి ఇక నేను ఆ అంశాల జోలికి

పోను. ఎందుకంటే ఒక రాజ్యాంగం ఎంత మంచిదయినా, అది అమలు చేయాల్సినవారు చెడ్డవారైతే అది చెడుపు చేస్తుంది. అదేవిధంగా ఒక రాజ్యాంగం ఎంత చెడ్డదైనా. దాన్ని అమలు చేసేవారు మంచివారైతే, ఆ రాజ్యాంగం మంచే చేస్తుంది. రాజ్యాంగ ప్రవృత్తిపై పూర్తిగా రాజ్యాంగ ఆచరణ ఆధారపడి వుండదు. రాజ్యం యొక్క ముఖ్య అంగాలైన చట్టసభ వ్యవస్థ, అధికార వ్యవస్థ, న్యాయ వ్యవస్థల గురించి రాజ్యాంగం చెబుతుంది. రాజకీయ పార్టీలు, వ్యక్తులు, వారి కోరికలు, రాజకీయాలవంటి అంశాలపైన రాజ్యం యొక్క ఈ ముఖ్య అంగాల పని తీరు ఆధారపడి వుంటుంది. భారత ప్రజలు, వారి ఆకాంక్షలు. ఆశయాలు ఎలా వుండగలవో ఎవరు చెప్పగలరు? తమ ఆశయాల సాధన కోసం వారు విప్లవ పద్ధతులను అవలంభిస్తారా? ఒకవేళ వారు విప్లవ మార్గం అనుసరిస్తే, రాజ్యాంగం ఎంత మంచిదైనా అది కూలిపోతుందని చెప్పడానికి ప్రవక్తలేం దిగిరావాల్సిన అవసరం లేదు. ప్రజలు, రాజకీయ పార్టీలు అనుసరించే పద్ధతులు, మార్గాల గురించి తెలియకుండా రాజ్యాంగంపై ఎటువంటి తీర్పులూ తీర్చడం వ్యర్థం. ప్రధానంగా కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలు రెండూ రాజ్యాంగాన్ని ఖండించాయి. వారు రాజ్యాంగాన్నెందుకు ఖండిస్తున్నారు? నిజంగా ఈ రాజ్యాంగమంత చెడ్డదా? 'కాదు' అని చెప్పేందుకు నేను సంశయించను. శ్రామికవర్గ నియంతృత్వ సూత్రం ఆధారంగా రాజ్యాంగం కావాలన్నది కమ్యూనిస్టు పార్టీ ఆదర్శం. సోషలిస్టులకు రెండు అంశాలు కావాలి. సోషలిస్టులు అధికారంలోకి రాగానే ఎటువంటి పరిహారమూ చెల్లించకుండా వ్యక్తిగత ఆస్తినంతా జాతిపరం లేదా సమాజపరం చేయాలన్నది సోషలిస్టులు కోరే మొదటి అంశం. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రాథమిక హక్కులు పరిపూర్ణంగా వుండాలనీ, వాటికి ఎటువంటి పరిమితులూ వుండకూడదనీ, అలా వుంటే ఒకవేళ వారు అధికారంలోకి రాలేకపోయినా, ఆ అపరిమిత స్వేచ్ఛనుపయోగించి కేవలం విమర్శించడానికే పరిమితం కాకుండా రాజ్యాన్ని కూలదోయవచ్చన్నది వారు ఆశించే రెండో అంశం. పై కారణాలతో వారు రాజ్యాంగాన్ని ఖండిస్తున్నారు. రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో కేవలం పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతి మాత్రమే ఉన్నతాదర్శ పద్ధతి అని నేను చెప్పబోవడం లేదు. పరిహారమివ్వకుండా వ్యక్తిగత ఆస్తిని స్వాధీనం చేసుకోకూడదనే సూత్రం అత్యంత పవిత్రమైనదనీ, ఆ పద్ధతి నుంచి వైదొలగాల్సిన అవసరం లేదనీ నేను చెప్పలేదు. ప్రాథమిక హక్కులు పరిపూర్ణంగా వుండకూడదనీ, వాటిపై విధించిన పరిమితులు తొలగించకూడదనీ కూడా నేను చెప్పలేదు. నేను చెప్పాలనుకుంటుందల్లా రాజ్యాంగంలో పొందుపరచిన సూత్రాలు ప్రస్తుత తరానికి సంబంధించిన దృక్పథాలు, లేదా, ఒకవేళ ఈ ప్రకటన అతిశయోక్తి అనుకుంటే, ఇవి ఈ రాజ్యాంగ రచనా సభ సభ్యుల అభిప్రాయాలు. ఈ అభిప్రాయాలను రాజ్యాంగంలో చేర్చినందుకు డ్రాఫ్టింగ్ కమిటీని ఎందుకు నిందిస్తారు? రాజ్యాంగ సభ సభ్యులను ఎందుకు నిందించాలి? అమెరికా రాజ్యాంగాన్ని రూపొందించటంలో ముఖ్యపాత్ర వహించిన రాజనీతిజ్ఞుడు థామస్ జెఫర్సన్ వెలిబుచ్చిన బలమైన అభిప్రాయాలు రాజ్యాంగ రూపశిల్పులు విస్మరించరానివి.

ఒక సందర్భంలో జెఫర్సన్ ఇలా అన్నారు: "ఒక హక్కుగా ప్రతీ తరం ఒక ప్రత్యేక జాతిగా ఒకే విధంగా కలిసివుంటుంది. అయితే ఆ తరం మరొక దేశాన్ని.. ప్రజలను చూసే విధంగా తన తరువాతి తరాన్ని చూడకూడదు". మరో సందర్భంలో ఆయనిలా అన్నారు: జాతి కోసం ఏర్పరచిన సంస్థలు ప్రజలకు జవాబుదారీగా వుండాల్సినపుడు ఎట్టి పరిస్థితుల్లో వాటిని కదిలించకూడదనీ, మార్చకూడదనీ, ఎందుకంటే వాటిని నిర్వహించేవారు ప్రజల విశ్వాసం కోసం పనిచేస్తున్నారనీ చెప్పడం అభినందనీయమే. కానీ అది జాతి వ్యతిరేకం. కానీ మన పూజారులూ, లాయర్లూ గత తరం వారు ఈ భూమిపై

> **భారతీయుడు తన దేశం కంటే కులాన్ని అధికంగా గౌరవిస్తాడా? లేక కులం కంటే దేశాన్ని అధికంగా గౌరవిస్తాడా? ఏమో నాకు తెలియదు. కానీ, రాజకీయ పార్టీలు దేశం కంటే తమ కులాన్నే అధికంగా గౌరవిస్తే, మన దేశ స్వాతంత్రం చిక్కుల్లో పడి, రెండోసారి, బహుశా ఎప్పటికీ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోవడం మాత్రం ఖాయం. ఈ పరిస్థితి రాకుండా మనం నిరంతరం జాగరూకతతో వ్యవహరించాలి. చివరి రక్తపుబొట్టు ధారపోసైనా సరే మనం మన స్వాతంత్రాన్ని పరిరక్షించుకోవాలి**

మహోన్నతులనీ, కనుక వారి చట్టాలను శిరసావహించాలనే సిద్ధాంతాన్ని మనపై రుద్దుతారు. వాటిని మార్చరాదంటారు. అదే విధంగా మనమూ చట్టాలు చేసి తరువాతి తరం వారిపై రుద్దుతాము. వాటిని వారు మార్చ వీల్లేదంటాము. దీనర్థం ఏమంటే ఈ భూమి చనిపోయిన వారికే చెందినది కానీ బతికున్నవారికి చెందినది కాదని". జెఫర్సన్ చెప్పింది పాక్షిక సత్యం కాదు. సంపూర్ణ సత్యమని నేనంటాను. నిస్సందేహంగా, ఈ సూత్రాన్నుంచి మన రాజ్యాంగ సభ వైదొలిగితే నిందకేకాదు, ఖండనకు అర్హమౌతుంది. అయితే మనం ఈ సూత్రాన్నుంచి వైదొలగలేదు. ఇందుకోసం మనం రాజ్యాంగ సవరణ నిమిత్తం చేసిన ఆర్టికల్ చూడాలి. కెనడా తరహాలో ఈ రాజ్యాంగమే అంతిమం. ఖచ్చితం అనే ముద్ర వేయకుండా సంయమనం పాటిస్తూ, అమెరికా, ఆస్ట్రేలియాల తరహాలో అసాధారణ విషయాలు, పరిస్థితులు నిర్వహించేందుకు సవరణ వీలు కల్పించే విధంగా అవకాశమిస్తూ, రాజ్యాంగాన్ని సవరించేందుకు సుగమమైన పద్ధతి ఏర్పరచాం. ప్రపంచంలో ఎక్కడైనా మన రాజ్యాం

గ సభ ఏర్పరచిన విధంగా సులభతరమైన రాజ్యాంగ సవరణ విధానం వుందేమో చూపాలని నేను విమర్శకులకు సవాలు విసురుతున్నాను. రాజ్యాంగంలోని ఒక అంశాన్ని నేను ప్రస్తావించదలచుకున్నాను. కేంద్రీకృత రాజ్యంగా తీర్చిదిద్దామనీ, రాష్ట్రాలను మునిసిపాలిటీల స్థాయికి దిగజార్చామనీ తీవ్రమైన ఫిర్యాదు చేశారు. ఈ విమర్శ సరైనది కాదు. ఇది వాస్తవాన్ని వక్రీకరించడమే. రాజ్యాంగం ఏం ఆశిస్తుందో తెలుసుకోవడంలో విఫలం చెందడమే. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఏ ప్రాథమిక సూత్రంపై ఆధారపడి ఏర్పడతాయో అర్థం చేసుకోగలగాలి. సమాఖ్య సిద్ధాంతం ప్రాథమిక సూత్రమేమంటే, చట్ట సభలు – అధికార వ్యవస్థలు కేంద్ర, రాష్ట్రాల మధ్య కేవలం చట్టాల ద్వారా విభజించబడవు. అవి రాజ్యాంగాన్ని బట్టి తమ వ్యవస్థల అధికారాన్ని పంచుకుంటాయి. రాజ్యాంగం చేసిందదే. మన రాజ్యాంగం ప్రకారం ఏ రాష్ట్రమూ తన చట్టసభల, అధికార వ్యవస్థల కోసం కేంద్రంపై ఆధారపడదు. ఈ వ్యవహారంలో కేంద్రమూ, రాష్ట్రాలూ సమానంగానే వుంటాయి. ఇటువంటి రాజ్యాంగాన్ని కేంద్రీకృత వ్యవస్థ ప్రోత్సహించలేదని ఎలా అనగలరు? అయితే రాజ్యాంగం కేంద్రానికి అత్యధికంగా

**మన దేశంలో ప్రజాస్వామ్యం చాలా కాలం నుండీ లేకపోవడం వల్ల ప్రజా స్వామ్య భావన కొత్తగా వచ్చినట్లు భావించి, మన దేశంలాంటి దేశంలో ఈ ప్రజాస్వామ్యం నియంతృత్వంగా మారే ప్రమాదం వుంది. కొత్తగా జన్మించిన ఈ ప్రజాస్వామ్య శిశువు తన రూపాన్ని కోల్పోయి నియంతృత్వానికి చోటిచ్చే పరిస్థితి వుంది. ఏ మాత్రం పొరపాటు జరిగినా నియంతృత్వం వచ్చే ప్రమాదమే అత్యధికంగా కనబడుతోంది.**

చట్టసభల, అధికార వ్యవస్థల పనితీరుకు ఆస్కారమిచ్చిందనీ, ఇది ఇతర సమాఖ్య రాజ్యాంగాలిచ్చిన అధికారాలకంటే అధికమనీ అనిపించవచ్చు. అవశేష అధికారాలు (రెసిడ్యుయరీ పవర్స్) కేంద్రానికే ఇచ్చారనీ, రాష్ట్రాలకు ఇవ్వలేదని కూడా అనిపించవచ్చు. అయితే సమాఖ్య స్వభావసారం ఇదికాదు. సమాఖ్య స్వభావసారంలో ముఖ్యమైన విషయమేమంటే, ఇంతకు ముందు నేను చెప్పినట్లు కేంద్రమూ, రాజ్యాంగ విభాగాలలో చట్టసభల, అధికార వ్యవస్థల విభజన. ఈ సూత్రం మన రాజ్యాంగంలో పొందుపరచబడింది. ఇందులో ఏ సందేహమూ లేదు. అందువల్ల కేంద్ర పెత్తనంలో రాష్ట్రాలున్నాయన్నది అపోహ మాత్రమే. ఈ విభజన రేఖను కేంద్రం అతిక్రమించలేదు. అదే విధంగా న్యాయ వ్యవస్థ కూడా. ఎందుకంటే ఈ విధంగా ఒక మంచి వాక్యముంది – అదేమంటే: “కోర్టులు మార్చగలవు కానీ అవి ప్రత్యామ్నాయం కాలేవు. అవి ఇంతకు ముందటి వ్యాఖ్యానాలను తిరగ రాయగలవు. కొత్త చర్చ చేయగలవు. నూతన దృక్పథాలను ప్రవేశపెట్టగలవు. చిన్న కేసులను వేరు చేయగల గీతలను మార్చగలవు, అయితే దాటి పోరాని అడ్డుగోడలు కోర్టులకూ వున్నాయి, ప్రత్యేకించి ఇవ్వబడ్డ అధికారాలను తిరిగి అటూ ఇటూ కేటాయించి మార్చేందుకు వాటికి వీలుండదు, ఒకరికి సంపూర్తిగా కేటాయించిన అధికారాలను మరొకరికి కోర్టులు బదలాయించలేవు”.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రీకృత రాజ్య వ్యవస్థ అన్న మొదటి చర్చ వీగిపోయింది. రాష్ట్రాలపై కేంద్ర పెత్తనం అనేది రెండో ఆరోపణ. ఈ ఆరోపణ పరిశీలించ దగ్గది. కేంద్రానికి ఇటువంటి అధికారాలిచ్చామని రాజ్యాంగాన్ని ఖండించే ముందు కొన్ని అంశాలను గమనంలో వుంచుకోవాలి. మొదటిది. ఈ అధికారాలు రాజ్యాంగంలో సాధారణ స్వభావంగా పొందు పర్చిన అధికారాలు కావు. ఎమర్జెన్సీ (అత్యవసర) కాలంలోనే ఉపయోగించే అధికారాలివి. ఇక గుర్తుంచుకోవాల్సిన రెండో అంశం: అత్యవసర సమయాల్లో కేంద్రానికి ఇటువంటి అధికారాలుండటాన్ని మనం నివారించగలమా? అత్యవసర సమయంలో కూడా కేంద్రానికి ఇటువంటి అధికారాలుండటం అంగీకరించనివారు ఈ విషయంలో సమస్య ప్రాతిపదిక ఏమిటో స్పష్టమైన అవగాహన కలిగివుండాలి. ఈ సమస్య గురించి 1935 డిసెంబర్ “రౌండ్ టేబుల్” పత్రికలో ఒక రచయిత ఇలా స్పష్టంగా వివరించారు. “హక్కులు, అధికారాల సమ్మిళితంగా రాజకీయ వ్యవస్థలుంటాయి. ఇక్కడ ప్రశ్నేమంటే ఎవరి హక్కులు, అధికారాలు, అవి ఎంతవరకూ, ఏ స్థాయి వరకూ.. పౌరుడు విధేయంగా రుణపడి వుండవల్సిందేనా? సాధారణ పరిస్థితులలో ప్రశ్న తలెత్తదు. ఒక వ్యక్తి ఒక చోట ఒక అధికారానికి లొంగి. మరోచోట నియమిత పద్ధతుల్లో మరో అధికారం వద్ద తన పని తాను చేసుకుంటూ వుంటాడు. సంక్షోభ సమయంలో, ఎవరి అధికారం కోసం వారి హక్కుల సంఘర్షణ తలెత్తవచ్చు అప్పుడు నిజమైన (అంతిమ) విధేయతను విభజించలేమని స్పష్టంగా.. తెలుస్తుంది. చట్టాలను న్యాయపరంగా వ్యాఖ్యానించి విధేయత సమస్యను నిర్ధారించి నిర్ణయించలేం. వాస్తవాలకు పరిమితమై చట్టం వ్యవహరించాలి. లేకపోతే చట్టం భ్రష్టుపడుతుంది. లాంఛనాలన్నీ తొలగించివేస్తే చివరకు మిగిలే ప్రశ్నేమిటంటే, పౌరుని అవశేష విధేయతను శాసించే అధికారమేమిటని? కేంద్రమా? లేక అందులో భాగమైన రాష్ట్రమా?” అసలు సమస్యకు ఆయువుపట్టేమిటన్న ప్రశ్నకు మనమిచ్చే సమాధానమే ఈ సమస్యకు పరిష్కారం. అత్యవసర సమయంలో పౌరుని అవశేష విధేయత కేంద్రంపట్టే వుండాలనీ, రాష్ట్రాలపట్ల కాదనీ అత్యధిక ప్రజల అభిప్రాయంగా వుంటుందనటంలో ఎటువంటి సందేహమూ లేదు. ఎందుకంటే ఏకీకృత

లక్ష్యంతో దేశ ఆసక్తుల కోసం పనిచేయగలిగేది కేంద్రమే కాబట్టి. అందువల్లే అత్యవసర సమయాల్లో కేంద్రానికి కొన్ని విశేష అధికారాలు ఇవ్వడంలో అర్థముంది. ఈ అత్యవసర సమయ అధికారాలు రాష్ట్రాలపై విధించే బాధ్యత ఏమిటి? వారి రాష్ట్ర ప్రాంతీయ ఆసక్తులను పరిగణనలోకి తీసుకుంటూనే, మొత్తంగా జాతి అభిప్రాయాలనూ, అసక్తులనూ పరిగణించాల్సి వస్తుంది. అంతకంటే మరేం వుండబోదు. ఈ సమస్యను అర్థం చేసుకోలేని వారే ఆరోపణలు చేస్తారు. నా మస్తిష్కం ఈ దేశ భవిష్యత్తు గురించి ఆలోచిస్తోంది. అందువల్ల నా భావాలను వెలిబుచ్చేందుకు నేను ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నాను. 26 జనవరి, 1950 నుంచీ భారతదేశం స్వతంత్ర దేశం కాబోతోంది. (కరతాళ ధ్వనులు) ఈ దేశ స్వాతంత్ర్యం భవిష్యత్లో ఎలా వుం డబోతుంది? ఏం కాబోతుంది? స్వతంత్రాన్ని ఈ దేశం నిలబెట్టు కోగలుగుతుందా? లేక తిరిగి స్వతంత్రం కోల్పోతుందా? నా మదిలో మెదిలిన తొలి ప్రశ్న ఇదే. మన దేశం ఇంతకుముందు స్వతంత్ర దేశం కాదని కాదు. ఒకప్పుడు వున్న స్వాతంత్ర్యాన్ని మన దేశం కోల్పోయింది. రెండోసారి కూడా ఈ దేశం స్వతంత్రాన్ని కోల్పోతుందా? ఈ ప్రశ్నే నన్ను భవిష్యత్తు పట్ల ఉద్యోగంగా అశీలింన చేసేట్లు చేసింది. గతంలో దేశం స్వాతంత్రం కోల్పోయిందన్న వాస్తవమే కాక ఆ స్వాతంత్రం కొందరు వ్యక్తుల శీలంలేని వ్యక్తిత్వం, ద్రోహాల కారణంగా జరిగిందన్న వాస్తవం నన్ను చలింపజేస్తోంది. మహ్మద్ బిన్ కాసిం సింద్‌లపై దండయాత్ర చేసినపుడు దహర్ రాజు సేనాధిపతులు కాసిం ప్రతినిధులిచ్చిన లంచాలు మరిగి రాజుకు ద్రోహం చేశారు. జయచంద్రుడు మహ్మద్ ఘోరీని స్వయంగా ఆహ్వానించి పృథ్వీరాజును ఓడించేందుకు తానూ, సోలంకి రాజులు సహాయపడుతామని వాగ్దానం చేశాడు. హిందువుల కోసం శివాజీ పోరాడుతున్న సమయంలో ఇతర మరాఠా రాజులు మొగల్ చక్రవర్తుల సరసన చేరారు. బ్రిటీషు వారు సిక్కులపై దండెత్తినప్పుడు వారి సేనాధిపతి గులాబ్ చంద్ ఉలుకూ పలుకూ లేకుండా చూస్తూ వుండిపోయాడు. 1857లో దేశంలో బ్రిటీషు వ్యతిరేక స్వతంత్ర సమరం మొదలైనప్పుడు సిక్కులు మౌనప్రేక్షకులుగా చూస్తూ నిలబడ్డారు. చరిత్ర మరలా దానంతటదే పునరావృతమౌతుందా? ఈ ఆలోచన నన్ను ఉద్విగ్నుణ్ణి చేస్తోంది. మన పురాతన కులాలూ, వర్గాలూవంటి శత్రువులతోపాటు ఇప్పుడు భిన్న, వ్యతిరేక రాజకీయ ఆసక్తులు కలిగిన రాజకీయ పార్టీలు తోడవడంతో, ఆ వాస్తవ పరిస్థితులను గమనించి నాలో ఉద్విగ్నత మరింత బలపడుతోంది. భారతీయుడు తన దేశం కంటే కులాన్ని అధికంగా గౌరవిస్తాడా? లేక కులం కంటే దేశాన్ని అధికంగా గౌరవిస్తాడా? ఏమో నాకు తెలియదు. కానీ, రాజకీయ పార్టీలు దేశం కంటే తమ కులాన్నే అధికంగా గౌరవిస్తే, మన దేశ స్వాతంత్రం చిక్కుల్లో పడి, రెండోసారి, బహుశా ఎప్పటికీ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోడం మాత్రం ఖాయం. ఈ పరిస్థితి రాకుండా మనం నిరంతరం జాగరూకతతో వ్యవహరించాలి. చివరి రక్తపుబొట్టు ధారపోసైనా సరే మనం మన స్వాతంత్రాన్ని పరిరక్షించుకోవాలి.

26 జనవరి, 1950 నుంచీ ఇండియా ప్రజాస్వామ్య దేశం అవుతోందంటే అర్థం. ఈ దేశంలో ప్రజల చేత, ప్రజల వలన, ప్రజల కొరకు ప్రభుత్వం ఏర్పడబోతోందని అర్థం. ఈ ఆలోచనే మరలా నా మస్తిష్కంలోకి వస్తోంది. ఈ దేశ ప్రజాస్వామ్య రాజ్యాంగానికి ఏం కాబోతోంది? ఈ రాజ్యాంగాన్ని దేశం నిలబెట్టుకుంటుందా లేక కోల్పోతుందా? ఇది నాకు వెనువెంబడి వచ్చిన రెండో ఆలోచన. ఈ ఆలోచన మొదటి ఆలోచన వలే నన్ను ఉద్విగ్నభరితుణ్ణి చేస్తోంది. భారత దేశానికి ప్రజాస్వామ్యం గురించి ఇంతకుముందు చరిత్రలో తెలియదని కాదు. ఒకప్పుడు మన దేశం నిండా గణతంత్ర రాజ్యాలుండేవి. ఏకచ్ఛత్రాధిపత్య రాజ్యాలున్నప్పటికీ అవి కూడా ఎన్నికలతోనో లేదా అతి కొద్దిగానో వున్న రాజ్యాలు. అవి పరిపూర్ణమైన రాజ్యాలు కావు, పార్లమెంట్ గురించి పార్లమెంటరీ సంప్రదాయాల గురించి చరిత్రలో ఈ దేశానికి తెలియదని కాదు. బౌద్ధ బిక్కు

**'ఏ వ్యక్తీ తన గౌరవాన్ని కోల్పోయి, ఏ స్త్రీ తన శీలాన్ని కోల్పోయి. ఏ దేశమూ తన స్వాతంత్రాన్ని కోల్పోయి కృతజ్ఞతలు చెల్లించకూడదు. ఈ హెచ్చరిక ఇతర దేశం కన్నా భారతదేశానికి ఎంతగానో అవసరం. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని విధంగా భారతదేశ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన విపరీతంగా రాజ్యమేలుతున్నాయి. మతంలో భక్తి ఆత్మకు మోక్షం కలిగించవచ్చు. కానీ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన దిగజారుడుతనానికి, నియంతృత్వానికి దారి తీస్తుంది.**

సంఘాల అధ్యయనాలు తెలిపేదేమంటే దేశ చరిత్రలో కేవలం పార్లమెంటే కాదు (నిజానికి బౌద్ధ సంఘాలే వాటంతటకవి పార్లమెంట్లు), నేడు ఆధునిక కాలంలో అనుసరిస్తున్న పార్లమెంటరీ సంప్రదాయ పద్ధతులన్నీ అనాడు వుండేవి. సీటింగ్ అరేంజ్‌మెంట్, మోషన్స్, రిజల్యూషన్స్, కోరం, విప్. బాలట్ ఓటింగ్, సెన్సూర్ మోషన్, రెగ్యులరైజేషన్, రెస్ జుడికటా, ఓట్ కౌంటింగ్... వంటి నేటి పార్లమెంటరీ పద్ధతులను ఆనాడు బౌద్ధ సంఘాలు పాటించి చూపాయి. ఈ పార్లమెంటరీ పద్ధతులన్నింటినీ బుద్ధుడే తన భిక్కు సంఘాలలో ప్రవేశపెట్టాడు. ఆనాడు దేశంలో వున్న గణతంత్రాల అసెంబ్లీల నుంచి ఆయన ఈ పార్లమెంటరీ పద్ధతుల సూత్రాలను అరువు తెచ్చుకున్నాడు. ఇటువంటి గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను భారతదేశం కోల్పోయింది. మరలా రెండోసారి కోల్పోతుందా? ఏమో? మన దేశం

లో ప్రజాస్వామ్యం చాలా కాలం నుండీ లేకపోవడంవల్ల ప్రజా స్వామ్య భావన కొత్తగా వచ్చినట్లు భావించి, మన దేశంలాంటి దేశంలో ఈ ప్రజాస్వామ్యం నియంతృత్వంగా మారే ప్రమాదం వుంది. కొత్తగా జన్మించిన ఈ ప్రజాస్వామ్య శిశువు తన రూపాన్ని కోల్పోయి నియంతృత్వానికి చోటిచ్చే పరిస్థితి కూడా వుంది. ఏ మాత్రం పొరపాటు జరిగినా నియంతృత్వం వచ్చే ప్రమాదమే అత్యధికంగా కనబడుతోంది. ప్రజాస్వామ్యం కేవలం ఒక రూపంగానే కాక ఒక వాస్తవంగా వుండాలంటే మనం ఏం చేయాలి? మొదటగా, మన సాంఘిక, ఆర్థికలక్ష్యాలు సాధించాలంటే మనం రాజ్యాంగబద్ధ పద్ధతులకు కట్టుబడి వుండాలన్నది నా తీర్పు. రక్తపాత విప్లవ పద్ధతులను మనం వదులుకోవాలి. పౌర సహాయ నిరాకరణ, సత్యాగ్రహ పద్ధతులను

**మన సమాజంలో సమానత్వం లేదు. భారత సాంఘిక రంగంలో నిచ్చెన మెట్ల అసమానత్వ వ్యవస్థ వుంది. ఇందువల్ల కొందరు అధికులుగా, మిగిలిన వారు అల్పులుగా గుర్తించబడుతున్నారు. ఆర్థికరంగంలో అనంతైశ్వర్యాలతో కొందరు తులతూగుతుంటే బహుజనులు పేదరికంలో మగ్గిపోతున్నారు. 1950 జనవరి 26 నుంచీ మనం వైరుధ్యాల జీవితంలోకి అడుగిడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం వుంటుంది కానీ సాంఘిక ఆర్థిక రంగాలలో అసమానత్వం వుంటుంది.**

వదిలేయాలి. అయితే, సాంఘిక ఆర్థిక లక్ష్యాలను చేరుకునేందుకు రాజ్యాంగబద్ధ పద్ధతులు అందుబాటులో లేకపోతే రాజ్యాంగేతర పద్ధతులకు సర్వత్రా మద్దతు లభిస్తుంది. నిజానికి రాజ్యాంగ బద్ధ పద్ధతులు అందుబాటులో వున్నట్లయితే రాజ్యాంగేతర పద్ధతులకు మద్దతు లభించదు. రాజ్యాంగేతర పద్ధతులను మనం 'అరాచక వ్యాకరణం' (Grammer of anarchy)గా భావించాలి. వీటిని త్వరగా వదిలించుకోవాలి. అప్పుడే మనకు క్షేమం.

మనం పాటించాల్సిన రెండో అంశం జాన్ స్టువర్ట్ మిల్ చేసిన హెచ్చరిక. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సినవారు ఆయన చెప్పినట్టు "తమ స్వాతంత్ర్యాన్ని ఎటువంటి గొప్ప వ్యక్తి పాదాల వద్ద వుంచకూడదు. అదే విధంగా నమ్మకూడదు. అధికారమివ్వకూడదు. అందువల్ల ఆ వ్యక్తి సంస్థలను/ వ్యవస్థలను మార్చివేసే అవకాశముంది". దేశానికి జీవితాంతం సేవ చేసిన గొప్ప వ్యక్తికి కృతజ్ఞతలు చెల్లించడంలో తప్పులేదు. కృతజ్ఞతాస్తుతికి కూడా ఒక స్థాయి వరకూ మాత్రమే. డేనియల్ ఓ కన్నెల్ చెప్పినట్టు 'ఏ వ్యక్తీ తన గౌరవాన్ని కోల్పోయి, ఏ స్త్రీ తన శీలాన్ని కోల్పోయి. ఏ దేశమూ తన స్వాతంత్రాన్ని కోల్పోయి కృతజ్ఞతలు చెల్లించకూడదు. ఈ హెచ్చరిక ఏ ఇతర దేశం కన్నా భారతదేశం వంటి దేశానికి ఎంతగానో అవసరం, ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనివిధంగా భారతదేశ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన విపరీతంగా రాజ్యమేలుతున్నాయి. మతంలో భక్తి ఆత్మకు మోక్షం కలిగించవచ్చు. కానీ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన దిగజారుడుతనానికి, నియంతృత్వానికి దారి తీస్తుంది. కేవలం రాజకీయ ప్రజాస్వామ్యంతోనే సంతృప్తి చెందరాదన్నది మూడో అంశం. మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని మనం సామాజిక ప్రజాస్వామ్యంగా పరివర్తన చెందించుకోగలగాలి. సామాజిక ప్రజాస్వామ్య పునాది లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం మనజాలదు. సామాజిక ప్రజాస్వామ్యమంటే ఏమిటి? జీవితాదర్శాలుగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను గుర్తించి జీవన విధానంగా మార్చుకునేదే సామాజిక ప్రజాస్వామ్యం. ఈ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సూత్రాలు మూడూ విడదీయరాని అంశాలు. ఈ 'త్రిత్వ' అంశాలు ఒకదానితో ఒకటి పెనవేసుకున్నవి. వాటిని ఒకదానితో ఒకటి విడదీస్తే ప్రజాస్వామ్యం ఓడిపోతుంది. స్వేచ్ఛను సమానత్వం నుంచీ, సమానత్వాన్ని సౌభ్రాతృత్వం నుంచి, అదేవిధంగా స్వేచ్ఛా సమానత్వాలను సౌభ్రాతృత్వం నుంచీ విడదీయకూడదు. సమానత్వం లేని స్వేచ్ఛ బహుజనంపై అల్పజనుల ఆధిక్యతను స్థిరీకరిస్తుంది. సౌభ్రాతృత్వంలేని స్వేచ్ఛ, సమానత్వాలు తమ సహజ గుణాలు కోల్పోతాయి. అప్పుడు వాటిని అమలుచేసేందుకు ఒక పోలీస్ కానిస్టేబుల్ అవసరమవుతాడు. భారత సమాజంలో రెండు అంశాలు పూర్తిగా లేవని మనం ముందుగా గుర్తించాలి. మొదటిది, మన సమాజంలో సమానత్వం లేదు. భారత సాంఘిక రంగంలో నిచ్చెన మెట్ల అసమానత్వ వ్యవస్థ వుంది. ఇందువల్ల కొందరు అధికులుగా, మిగిలినవారు అల్పులుగా గుర్తించబడుతున్నారు. ఆర్థికరంగంలో అనంతైశ్వర్యాలతో కొందరు తులతూగుతుంటే బహుజనులు పేదరికంలో మగ్గిపోతున్నారు. 1950 జనవరి 26 నుంచీ మనం వైరుధ్యాల జీవితంలోకి అడుగిడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం వుంటుంది కానీ సాంఘిక ఆర్థిక రంగాలలో అసమానత్వం వుంటుంది. రాజకీయాల్లో ఒక మనిషికి ఒక ఓటు. ఒక ఓటుకు ఒక విలువ అనే సూత్రాన్ని గుర్తిస్తున్నాం. కానీ మన సాంఘిక ఆర్థిక నిర్మాణ రీత్యా మన సాంఘిక ఆర్థిక జీవితంలో ఒక మనిషికి ఒక విలువ అనే సూత్రాన్ని మనం నిరాకరిస్తూనే వుంటాం. ఈ వైరుధ్యాల జీవిత జీవనాన్ని సునం ఎంతకాలం కొనసాగిస్తాం? సాంఘిక ఆర్థిక జీవితంలో అసమానత్వాన్ని ఇంకా ఎంతకాలం మనం కొనసాగిస్తాం? ఇలా అసమానః కొనసా వడం ద్వారా మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తాం. సాధ్యమైనంత రగా మనం ఈ వైరుధ్యాన్ని పోగొట్టాలి లేకుంటే ఎంతో కష్టపడి ప్రజాస్వామ్యాన్ని అసమ సభ రూపకల్పన చేసిన రాజకీయ దుతున్న ప్రజలు పేలి చేస్తారు.. తృత్వ సూత్రాన్ని కూడా గుర్తించాలన్న అవసరాన్ని మనం గుర్తిస్తున్నాం. అంటే

ఏమిటి? భారతీయులమందరమూ ఒక్కటే అన్న భావనే సాంఘిక జీవితంలో ఐక్యత, సంఘీభావాన్ని ఈ సౌభ్రాతృత్వ సూత్రం కలిగిస్తుంది. ఈ భావన కలిగించడం అత్యంత కష్టతరమైన అంశం. ఈ భావన సాధించడం ఎంత కష్టమైనదో తెలిపేందుకు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా గురించి జేమ్స్ తన 'అమెరికన్ కామన్వెల్త్‌లో చెప్పిన కథ నుంచి మనం తెలుసుకోవచ్చు. జేమ్స్ మాటల్లోనే చెప్పాలంటే ఆ కథ ఇలా వుంది. 'కొన్నేళ్ల క్రితం అమెరికన్ ప్రొటెస్టంట్ ఎపిస్కోపల్ చర్చి 300 ఏళ్ల సమావేశం జరిగింది. ప్రార్థనలో కొన్ని అంశాలను మార్చాలని ఆ సమావేశం నిర్ణయించింది. ప్రార్థనలో ఒక వాక్యం చేర్చాలని న్యూ ఇంగ్లాండుకు చెందిన ప్రసిద్ధ క్రైస్తవ మత బోధకుడు ప్రతిపాదించగా సమావేశం ఆమోదించింది. ఆ వాక్యం "ఓ దేవుడా, మా జాతి(నేషన్)ని ఆశీర్వదించు". మరుసటిరోజు ఆ వాక్యాన్ని ప్రార్థనలో ప్రస్తావించినపుడు 'జాతి' అనే పదాన్ని భక్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. అందువల్ల ఆ పదాన్ని తీసివేసి "ఓ దేవుడా, యునైటెడ్ స్టేట్స్‌ను ఆశీర్వదించు" అని ప్రార్థనా వాక్యాన్ని మార్చారు. ఆ సమయంలో అమెరికా ప్రజలు తామంతా ఒకే 'జాతి' అని అంగీకరించడానికి సిద్ధంగా లేరు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ప్రజలే తమను ఒక జాతిగా అంగీకరించడానికి సిద్ధంగా లేకపోతే, ఇక భారతదేశంలో ఆ పదాన్ని అంగీకరించడం ఇంకెంత కష్టమో ఒకసారి ఆలోచించండి. రాజకీయ స్పృహ కలిగిన భారతీయులు "భారత ప్రజలు" అనే పదాన్ని నిరసించి "భారత జాతి" అనే పదాన్ని కోరుకున్న విషయం నాకు తెలుసు. మనమంతా ఒకే జాతి అని భావించడం ద్వారా మనం ఒక పెద్ద భ్రమలో వున్నాం. వేల కులాలుగా విభజనకు గురైన ప్రజలు ఒకే జాతిగా ఎలా మనగలరు? సామాజికంగా, మానసికపరంగా మనమింకా ఒకే జాతిగా మారలేదన్న వాస్తవాన్ని మనం ఎంత తొందరగా గుర్తిస్తే అంత మంచిది. అప్పుడే మనం ఒక జాతిగా రూపొందాలన్న స్పృహ కలిగి ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెడతాం. కానీ, యునైటెడ్ స్టేట్స్ కంటే కూడా మన దేశంలో ఈ వాస్తవాన్ని గుర్తించడం చాలా కష్టం. అమెరికాలో కులం లేదు. ఇండియాలో కులాలున్నా కులాలు జాతి వ్యతిరేకం. ఎందుకంటే మొదటగా అవి సామాజిక జీవితంలో విడివిడిగా వుండేందుకు ప్రజలను ప్రోత్సహిస్తాయి. రుణాలు జాతి వ్యతిరేకం, ఎందుకంటే అవి అసూయనూ, పరస్పర విద్వేషాన్నీ కలిగిస్తాయి. మనం ఒక వాస్తవ జాతిగా, రూపొందాలంటే మనం ఈ అడ్డంకుల్ని అధిగమించాలి. ఒక జాతి ఏర్పడినపుడే సౌభ్రాతృత్వం సాధ్యమౌతుంది. సౌభ్రాతృత్వం లేని స్వేచ్ఛ, సమానత్వం గోడకు వేసిన సున్నంలాంటివి. మనముందు భవిష్యత్‌లో మనకెదురయ్యే సవాళ్లివి. ఈ విషయాలు చాలా మందికి రుచించకపోవచ్చు. ఈ దేశంలో రాజకీయాధికారం చాలా కాలంగా అల్పజనుల గుత్తాధికారంగా వుండి, బహుజనులను బరువులు



**రాజ్యాంగ ముసాయిదా ప్రతిని డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్‌కు అందజేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్**

మోసే పశువుల్లా చూసింది. వారిని వధించింది. ఈ గుత్తాధిపత్యం బహుజనుల అభివృద్ధి అవకాశాలను దెబ్బ తీయటమే కాక వారి జీవితాన్ని, జీవనసారాన్నీ పిండి పీల్చి పిప్పి చేసింది. ఈ పీడిత వర్గాలు పాలితులుగా వుండి అలిసిపోయారు. వారు తమను తామే పాలించుకోవాలన్న ఆతృతతో వున్నారు. పీడిత వర్గ ప్రజల్లో వస్తున్న ఈ స్వీయ స్పృహ వర్గ పోరాటం లేదా వర్గ యుద్ధానికి దారి తీయకముందే మనం మేల్కోవాలి. అటువంటి ఒకరోజు వచ్చినవాడు మహా ప్రళయం సంభవిస్తుంది. అబ్రహాం లింకన్ చెప్పినట్టు చీలిపోయిన ఏ ఇల్లూ (సభ) మనజాలదు. ఎక్కువ కాలం నిలబడలేదు. అందువల్ల పీడితవర్గ ప్రజల ఆకాంక్షలను ఎంత త్వరగా మనం గుర్తించగలిగితే ఈ దేశానికి, దేశ స్వాతంత్రానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు అంత మంచిది. సమస్త జీవన రంగాల్లో సమానత్వం, సౌభ్రాతృత్వం సాధించినప్పుడు అది సాధ్యం. అందువల్లే నేను స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం గురించి నొక్కి చెబుతున్నాను. స్వాతంత్ర్యం సంతోషకరమే. కానీ ఈ స్వాతంత్రం మనపై అనేక బాధ్యతలుంచింది. ఇక ఇప్పటి నుంచీ జరిగే తప్పులకు మనం బ్రిటీషువారిని బాధ్యులు చేసి నిందించలేం. ఇప్పటి నుంచి జరిగే తప్పులకు మనమే బాధ్యులమౌతాం. తప్పు పరిస్థితులు ఏర్పడే పెద్ద ప్రమాదం పొంచివుంది. కాలం వేగంగా మారుతోంది. మన ప్రజలు వినూత్న భావజాలాలతో కదులుతున్నారు. ప్రజల చేత ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారు. ప్రజల కొరకు ప్రభుత్వం కావాలంటున్నారు. ప్రజల చేత, ప్రజల వలన ప్రభుత్వం అనే అంశాల గురించి వారికంత ఆసక్తిలేదు. ప్రజలు ప్రజల చేత ప్రభుత్వం బదులు ప్రజల కొరకు ప్రభుత్వం కోరుకుంటారు. రాజ్యాంగ ముసాయిదా ప్రతిని ప్రజల చేత, ప్రజల కొరకు, జల వలన ప్రభుత్వం అనే రాజ్యాంగంలో మనం. రాజ్యాంగాన్ని కాపాడాలంటే మన మార్గంలో ఎదురయ్యే దుష్ట శక్తులను గుర్తించాలి. అలా చేయడమే దేశ సేవ. ఇంతకంటే వేరు మార్గం లేదు. ❑

**(దుర్గం సుబ్బారావు, కొమ్ముపాల శ్రీనివాస్ సంపాదకత్వంలో వెలువడిన వ్యాసాల సంకలనం నుంచి..)**

# అణగారిన వర్గాల కోసం అంకితమైన జీవితం

డాక్టర్ సిద్ధార్థ్, బీబీసీ

ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగానికి పితామహుడైన అంబేద్కర్ ఒక న్యాయవేత్త, ఆధ్యాత్మిక నాయకుడు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఎనలేని కృషి చేసిన ఆయన తన జీవితం, రచనల ద్వారా నేటికీ ఎందరికో స్ఫూర్తినిస్తున్నారు. నేటి భారత రాజకీయాలపైనా ఆయన ప్రభావం ఎంతగానో ఉంది. ఆయన ప్రయాణం ఎలా సాగిందో చూద్దాం. 1891 ఏప్రిల్ 14న మధ్య ప్రదేశ్‌లోని మౌ(ప్రస్తుతం అంబేద్కర్ నగర్)లో రామ్‌జీ మలోజీ సక్పాల్, భీమాబాయిల దంపతులకు అంబేద్కర్ జన్మించారు. ఆయన తండ్రి రామ్‌జీ ఒక మిలిటరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. 1904లో వారి కుటుంబం బొంబాయికి మారింది. 1906లో రామ్‌బాయితో వివాహమైం ది. అప్పుడు అంబేద్కర్‌కు 15 ఏళ్లు, రమాబాయికి తొమ్మిదేళ్లు మాత్రమే. అయితే, పెళ్లి ఆయన చదువుకు అడ్డురాలేదు. 1907లో అంబేడ్కర్ మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. ఆ తర్వాత ఏడాది ముంబయిలోని ఎల్ఫిన్‌స్టన్ కళాశాలలో చేరారు. ఆ కళాశాలలో చేరిన తొలి దళిత విద్యార్థి అంబేద్కర్ మాత్రమే. 1912లో బాంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ

DEGREES OF DR.B.R. AMBEDKAR

| Sr. No. | Degree | Year | University |
|---|---|---|---|
| 1 | Elementary | 1902 | Satara School, MH. |
| 2 | Matriculation | 1907 | Elphinstone High School. |
| 3 | Inter (English) | 1909 | Elphinstone College Bombay & |
| 4 | B.A. (Ecoph, sc) | 1913 | University of Bombay. |
| 5 | M.A (Eco-Soci History-Anthro-Poli) | 1915 | Columbia University, New York |
| 6 | PhD | 1917 | Columbia University. |
| 7 | M.Sc. | June 1921 | London School of Economics |
| 8 | Bar-at-Law | 30/9/1920 | Gray's Inn, London |
| (1922-1923 Spent some time in reading economics in the University of Bonn in Germany) | | | |
| 9 | D.Sc | Nov 1923 | London School of Economics |
| 10 | L.L.D. | 5/6 1952 | Columbia University |
| 11 | D.Litt. | 12/1 1953 | Osmania University, Hybad, India |
| 12 | No.1 Scholar In World | 13/9 2015 | Columbia University, New York. |



పట్టా అందుకున్నారు. తర్వాత బరోడా రాజ్యంలో ప్రభుత్వం ఉద్యోగం పొందారు. 1913లో బరోడా మహారాజు సాయాజీ రావ్ గైక్వాడ్ ప్రభుత్వం ఉపకార వేతనంతో అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య అభ్యసించేందుకు అంబేద్కర్ వెళ్లారు. మూడేళ్లపాటు బరోడా ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఇచ్చింది. 1913లో ఎంఏ పట్టా అందు కున్నారు. 'భారతదేశంలో కులాలు' అనే అంశంపై 1916లో కొలంబియా విశ్వవిద్యాలయానికి ఒక వ్యాసాన్ని సమర్పించారు. అదే ఏడాది లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో చేరారు. బరోడా ప్రభుత్వం ఇస్తున్న స్కాలర్‌షిప్ కాలపరిమితి పూర్తవ్వడంతో 1917లో భారత్ రావాల్సి వచ్చింది. 1918లో ముంబయిలోని ఒక కళాశాలలో ప్రొఫెసర్‌గా చేరారు. అక్కడ వివక్ష ఎదురైంది. 1920లో ఛత్రపతి షాహు మహారాజ్, కొల్హాపూర్ మహారాజా సాయంతో 'మూక్‌నాయక్' అనే వార పత్రికను ప్రారంభించారు. 1923లో బొంబాయి(ముంబయి)లో న్యాయవాదిగా పనిచేయ డం ప్రారంభించారు. 1927లో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా నామినేట్ అయ్యారు. 1930లో మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు లండన్ వెళ్ళారు. 1935 నుంచి 1938 వరకు లా కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 1936లో ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించారు. 1942 నుంచి 1946 వరకు వైస్రాయి కౌన్సిల్‌లో లేబర్ మెంబర్‌గా ఉన్నారు. 1947లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దేశ మొదటి న్యాయశాఖమంత్రిగా, రాజ్యాంగ ముసాయిదా కమిటీకి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అంబేద్కర్ నేతృత్వంలో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. 1956 డిసెంబర్ 6న దిల్లీలోని అలీపూర్ రోడ్డులో ఉన్న నివాసంలో అంబేద్కర్ తుదిశ్వాస విడిచారు. వీపీ సింగ్ ప్రభుత్వం 1990లో అంబేద్కర్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారత రత్న'ను ప్రకటించింది. ❑

# హిందూ రాజ్యాన్ని అంబేద్కర్ అతి పెద్ద ప్రమాదంగా ఎందుకు భావించారు?

భారతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలనే కల ఇటీవలి కాలానిదేమీ కాదు. కాకపోతే అది ఈ మధ్య కాలంలో ఎక్కువ ప్రాచుర్యం పొందింది. సంఘ్(ఆర్ఎస్ఎస్) అనుబంధ సంఘాలు జాతీయగీతం, బీఫ్, గోరక్షణ, రామమందిరం వంటి వాటిపై చూపుతున్న దూకుడు ధోరణి దానికే ముందస్తు సంకేతాలు. గోహత్యను నిషేధించే చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వాదిస్తున్నారు. రిజర్వేషన్లపై పునస్సమీక్ష చేయాలనే ప్రకటన ఆయన గతంలో చేసి ఉన్నారు. హిందూ సంస్కృతిని భారతదేశమంతటా ఆదర్శ జీవన నియమావళిగా మార్చాలనేది సంఘ్ ప్రకటిత లక్ష్యం. మహిళలకు డ్రెస్ కోడ్, లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా క్యాంపెయిన్ వంటి వాటిని వారు నడిపిస్తూనే ఉన్నారు. నిజానికి ఇస్లామ్ ఆధారిత ప్రత్యేక దేశం, హిందూ దేశం రెండు డిమాండ్లూ కవల పిల్లల్లాగే పుట్టాయి. ఇవి రెండూ పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి.

## మత ఆధారిత దేశం

వాస్తవం ఏంటంటే హిందూ మెజారిటీ పాలనా భయం నీడలోనే పాకిస్తాన్ కావాలనే డిమాండ్ పుట్టి, పెరిగి పెద్దదైంది. డాక్టర్ అంబేద్కర్ 1940 లో మత ఆధారిత పాకిస్తాన్ దేశం కోసం చేస్తున్న డిమాండ్ సందర్భంగా హెచ్చరిక చేస్తూ ఇలా అన్నారు – "ఒకవేళ హిందూ దేశం ఏర్పడినట్టయితే అది దేశానికి భారీ ప్రమాదం అవుతుందనడంలో అనుమానం లేదు. హిందువులు చెప్పేది ఏమైనా కావొచ్చు కానీ, హిందుత్వ అనేది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్న భావనలకు ప్రమాదకరం. అలా చూసినపుడు ఇది ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం అనుగుణమైంది కాదు. ఎట్టి పరిస్థితిలోనైనా సరే హిందూ రాజ్యం ఏర్పాటును వ్యతిరేకించాలి." 81 ఏళ్ల క్రితం అంబేద్కర్ ఏ ప్రమాదం గురించి హెచ్చరించారో, అది నేడు భారతదేశం ముంగిట్లోకి శక్తిమంతంగా వచ్చి నిలుచుంది. రాజ్యాంగంలో మార్పేమీ జరగనప్పటికీ, లాంఛనంగా మనది ఇంకా లౌకికవాద దేశమే అయినప్పటికీ, వాస్తవిక జీవితంలో మాత్రం హిందుత్వవాద శక్తులు సమాజం, సంస్కృతులతోపాటు అధికార పీఠంపైనా బలమైన పట్టు సాధించాయి.

## 'హిందువులకే ఎక్కువ ప్రమాదకరం'

ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే, భారత్‌ను హిందూ దేశంగా మారిపోకుండా అడ్డుకోవాలని అంబేద్కర్ భావించారు. ఎందుకంటే హిందూ జీవన నియమావళి స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు పూర్తిగా విరుద్ధమైందన్నారు. హిందూ రాజ్యాన్ని ఆయన వ్యతిరేకించడానికి కారణం ముస్లింల పట్ల హిందువులు కలిగి ఉన్న ద్వేషానికే పరిమితం కాదు. వాస్తవం ఏంటంటే, 'హిందూ రాజ్యం ముస్లిం లకన్నా, హిందువులకే ఎక్కువ ప్రమాదకరం' అని, హిందూ రాజ్యం దళితులకూ, మహిళలకూ వ్యతిరేకమైందని భావించారు. కుల వ్యవస్థను నిలబెట్టి ఉంచడానికి అనివార్యమైన షరతు మహిళలు కులాంతర వివాహాలు చేసుకోకుండా అడ్డుకోవడమే అని చెప్పారు.

> 'హిందూ రాజ్యం ముస్లింలకన్నా, హిందువులకే ఎక్కువ ప్రమాదకరమని, హిందూ రాజ్యం దళితులకూ, మహిళలకూ వ్యతిరేకమైందని భావించారు. కుల వ్యవస్థను నిలబెట్టి ఉంచడానికి అనివార్యమైన షరతు మహిళలు కులాంతర వివాహాలు చేసుకోకుండా వారిని అడ్డుకోవడమే అని ఆయన స్పష్టంగా చెప్పారు.

## హిందుత్వ, ప్రజాస్వామ్యం

ఈ పరిస్థితిని అడ్డుకునేందుకే ఆయన హిందూ కోడ్ బిల్లును ప్రవేశ పెట్టారు. హిందూ రాజ్యాన్ని ఆయన పెను ప్రమాదంగా భావించడం వెనుక కుల వ్యవస్థ నుంచి తలెత్తిన అసమానత్వం ఒక పెద్ద కారణం. అది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం వంటి విలువకు గొడ్డలిపెట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అసమానత్వం ఇలా ఉండడం వల్ల వాస్తవిక స్వాతంత్ర్యం మనుగడలో ఉండలేదు. సమానత్వం, స్వాతంత్ర్యం వంటివి లేనప్పుడు సామాజిక సౌభ్రాతృత్వాన్ని ఊహించనేలేం. కులవాద అసమానత్వం హిందుత్వకు ప్రాణం వంటిది. ఈ అంశం ఆధారంగానే ఆయన "హిందుత్వ, ప్రజాస్వామ్యం రెండు పరస్పర విరుద్ధమైన అంశాలు" అనే నిర్ధారణకు వచ్చారు. కులపరమైన అసమానత్వం విషయంలోనైనా, దీనిని నిలిపి ఉంచడం కోసం మహిళలు వర్ణానికీ, కులానికీ ఆవల జీవిత భాగస్వామిని ఎంచుకోకుండా వారిని నియంత్రించే విషయంలోనైనా హిందువుల్లో మౌలికమైన మార్పేమీ రాలేదు. మొత్తంగా చూస్తే, హిందువులు దేన్నైనా వదులుకుంటారు కానీ తమ మూలాధారమైన కులాన్ని మాత్రం వదులుకోరు. దీనిని నిర్మూలించకుండా ప్రజాస్వామిక సమాజాన్ని ఊహించను కూడా ఊహించలేమని అంబేద్కర్ ఆనాడే భావించారు. ❑

# అంబేద్కర్..

# బుద్ధ అండ్ హిజ్ ధమ్మ

- టి.రవిచంద్, ఎంఏ

**వెలుగు చూడని.. అంబేద్కర్ రాసిన అరుదైన పీఠిక**

2500 సంవత్సరాలకు పైగా చరిత్ర గలిగిన బౌద్ధ ధర్మం దాదాపు భారతదేశంలో భౌతికంగా అంతరించిందనే చెప్పాలి. అటువంటి తరుణంలో 1956 సంవత్సరం అక్టోబర్ మాసంలో డాక్టర్ అంబేద్కర్ నాగపూరులో కొన్ని లక్షల మంది అనుచరుల తో బౌద్ధ ధర్మ దీక్ష (స్వీకారం) తీసుకున్నారు. డాక్టర్ అంబేద్కర్ బౌద్ధ ధర్మ స్వీకారం ఆధునిక భారతదేశంలోని మతోద్యమాల చరిత్రలో అత్యంత ముఖ్యమైన సంఘటనగా పరిగణించబడు తుంది. డ్రైవర్ లింగ్ లాంటి అమెరికన్ బౌద్ధ పండితులు డాక్టర్ అంబేద్కర్ ధర్మ స్వీకారానికి అంతర్జాతీయ ప్రాముఖ్యతనిస్తు న్నారు. ఆయన బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడమే కాకుండా, ఆ ధర్మాన్ని అంగీకరించే వారికి బైబిలు వంటి గ్రంథాన్ని అందించిన ఘనత కూడా ప్రపంచంలో ఆయనకే దక్కింది. బౌద్ధానికి సంబం ధించిన సాహిత్యం ఒక మహా సముద్రం వంటిది. బౌద్ధంపై ఆసక్తి గలవారు ఆ సాహిత్యాన్నంతా అధ్యయనం చేయడం అసాధ్యం. అందువల్ల బుద్ధుడి జీవితానికి, ఆయన సిద్ధాంతానికి సంబంధించి అనేక సమస్యలు తలెత్తాయి. వాటిని శాస్త్రీయంగా పరిష్కరించాడనికి ప్రయత్నించిన పండితులు బహుకొద్ది మంది మాత్రమే ఉన్నారు. అటువంటి వారిలో ప్రముఖంగా పేర్కొనవల సిన, ఆధునిక భారతీయ పండితులు ఐదుగురు ఉన్నారు. వారు – ధర్మానంద కోశాంబి, రాహుల్ సాంకృత్యాయన్, ఆనంద్ కౌసల్యాయన్, ప్రొఫెసర్ పి.లక్ష్మీనరసు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్. ఈ ఐదుగురు బౌద్ధ పండితులు బుద్ధుడి జీవితాన్ని, సిద్ధాంతాన్ని



**పీఠికాంతంలో అంబేద్కర్ ఈ గ్రంథ రచన పూర్తి చేయడానికి ప్రధాన కారణంగా అంబేద్కర్ తన రెండవ భార్య, ఆమె బంధువు డాక్టర్ మల్వాంకర్లను పేర్కొన్నారు. అంతేకాదు ఈ గ్రంథరచన ప్రారంభించే నాటికి తన ఆరోగ్యం ఎంతగా క్షీణించింది. ఆ దశలో వృత్తి రీత్యా డాక్టరైన తన భార్య ఏ విధంగా ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో తోడ్పడిందీ, ఆమెతోబాటు డాక్టర్ మల్వాంకర్‌కి ఎంత రుణపడి వుందీ ఆయన సంక్షిప్తంగా వివరించారు.**

శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేసి ఆయన జీవితానికి, సిద్ధాంతానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన సమస్యల్ని పరిష్కరించగలిగారు. సామాన్యులకు అందుబాటులో లేని బౌద్ధ ధర్మ సాహిత్యాన్ని ప్రజలకు సన్నిహితంగా తీసుకెళ్ళారు. వీరిలో ధర్మానంద కోశాంబి మరాఠీ భాషలో రచించిన 'భగవాన్ బుద్ధ" (తెలుగు అనువాదం – పుట్టపర్తి నారాయణాచార్యులు), ప్రొఫెసర్ పోకల లక్ష్మీనరసు ఆంగ్లంలో రచించిన "ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం' (బౌద్ధ ధర్మసారం), డాక్టర్ అంబేద్కర్ ఆంగ్లంలో రచించబడిన "బుద్ధ అండ్ హిజ్ ధమ్మ" (తెలుగు అనువాదం! డాక్టర్ యెండ్లూరి) బుద్ధుడు, బౌద్ధ ధర్మంపై వెలువడిన మూడు ఉత్తమ గ్రంథాలు. పై రెండు గ్రంథాలు పండితులకే పరిమితం కాగా, అంబేద్కర్ గ్రంథం అటు పండితులకు, ఇటు సామాన్యులకు ఉత్తమ అధ్యయన గ్రంథమైనది. బౌద్ధ ధర్మానికి, తత్వశాస్త్రానికి సంబంధించిన త్రిపిటకాల్ని చదివి, ఆధునిక హేతువాద, మానవవాద, దృక్పథంతో వాటిని పరిశీలించి "బుద్ధుడు – ఆయన ధమ్మం" (Buddha and His Dhamma) రచించారు. బౌద్ధ ధర్మానికి, దర్శనానికి సంబం ధించిన అనేక సమస్యల్ని తనదైన ప్రత్యేక దృక్పథంతో అధ్యయనంచేసి పరిష్కరించడానికి ప్రయత్నించారు. అంబేద్కర్ రచనల్లో కుల నిర్మూలన" అత్యంత ప్రాధాన్యతగల గ్రంథం "బుద్ధ అండ్ హిజ్ ధమ్మ" దీనిని తెలుగులో "బుద్ధుడు – ఆయన ధర్మం" అని అనువదిస్తుంటాము. "ధమ్మ" అనేది పాలీభాషా పదం. దీనికి సమానార్థకమైన ఆంగ్ల భాషాపదం లేదు. సాధార ణంగా "ధమ్మ" అనే మాటను "ధర్మ" అని సంస్కృతీకరిస్తుం టాం. సంస్కృతంలో ధర్మ అనే పదానికి ఏడెనిమిది అర్థాలు

ఉన్నాయి. (చూ: ట్రెవర్లింగ్ డిక్షనరీ ఆఫ్ బుద్ధిజం). వీటిలో ఏ పదం కూడ బుద్ధుడు ఉద్దేశించిన అర్థాన్ని అందించదు. అందుకే తన గ్రంథానికి పెట్టిన పేరులో కూడా అంబేద్కర్ పాలీ "ధమ్మ"నే ఉపయోగించారు. లోకాయత గ్రంథరచయిత చటోపాధ్యాయ "దేవుడు లేని మతం" (Religion without God) అని బౌద్ధ ధర్మాన్ని వివరించడానికి ప్రయత్నించారు. అసలు బౌద్ధంలోనే "ధర్మ" అనే పదానికి సందర్భానుసారంగా అనేక అర్థాలున్నాయి. బౌద్ధులు ధర్మాన్ని సామాజిక ధర్మం, నీతి, న్యాయం అర్థాలలోనే కాకుండ, ధర్మం అనే మాటను తాత్విక పరంగా కూడ ప్రయోగించారు. ఈ ఒక్క పదం పైన రష్యన్ బౌద్ధ పండితుడు షెర్ బట్స్కీ The central conception of Buddhism (బౌద్ధంలో కీలక భావన) అనే పరిశోధక గ్రంథాన్ని 1922లో వెలువరించాడు. ఇది బౌద్ధంలోని ధర్మంపై ఒక అద్భుత గ్రంథం. బౌద్ధంలోని కీలక పదమైన ధర్మ పదాన్ని అర్థం చేసుకుంటే బౌద్ధ ధర్మాన్ని అర్థం చేసుకున్నట్లే! నిజానికి తాత్వికంగా ధర్మ పదాన్ని వివరిస్తే "అది భౌతిక, మానసిక పరిణామాలలోని అంతర్గతమైన సూత్ర సముదాయం"గా చెప్పాలి. అంబేద్కర్ తాత్వికంగాకంటే సామాజిక ధర్మం అనే అర్థం వచ్చే విధంగా ధమ్మ పదాన్ని ఉపయోగించారు. బౌద్ధ ధర్మాన్ని ఒక జీవన విధానంగా రూపొందించుకోవాలనుకొనే వారికి సహాయకారిగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో ఈ గ్రంథ రచన చేశారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనయి ఈ గ్రంథ రచన చేశారు అంబేద్కర్. దీనిలో ఆయన బౌద్ధానికి సంబంధించిన నాలుగు ప్రధాన సమస్యల్ని చర్చించి ప్రతిభావంతంగా పరిష్కరించారు. బుద్ధుడు పరివ్రాజకుడుగా ఎందుకు మారాడు, నాలుగు ఆర్య సూత్రాలు (సత్యాలు), ఆత్మ, కర్మ, పునర్జన్మలకు సంబంధించిన సమస్య. ఇక నాల్గవ సమస్య బుద్ధుడు భిక్షు సంఘాలను ఎందుకు స్థాపించాడు. వీటిని అంబేద్కర్ పరిశీలించిన తీరు విశిష్టమైనది. ఈ నాలుగు సమస్యల్ని శాస్త్రీయంగా చారిత్రక దృష్టితో పరిశీలించి పరిష్కరించడం వల్ల అంబేద్కర్‌కి ఆధునిక బౌద్ధ వ్యాఖ్యాతల్లో ప్రముఖ స్థానం లభించింది. బుద్ధుడి జీవితానికి, సిద్ధాంతానికి సంబంధించిన సమగ్ర చిత్రణ ఈ గ్రంథంలో మనకు లభిస్తుంది. క్రైస్తవులకు క్రీస్తు జీవితానికి, బోధలకు సంబంధించి క్రొత్త నిబంధన గ్రంథం (NewTestment) ఎంత ముఖ్యమైనదో, బౌద్ధులకు అంత ముఖ్యమైనది. అంబే ద్కర్ 'బుద్ధుడు–ఆయన ధర్మం'. అంబేద్కర్ చనిపోయే ముందు రోజున (డిశంబర్ 5, 1956) ఈ గ్రంథానికి తుది రూపం ఇచ్చారు. ప్రపంచంలో వున్న బౌద్ధులందరికి ఉపయోగపడాలనే తలంపుతో ఆయన ఈ గ్రంథ రచన చేశారు. ఈ గ్రంథం వెలువడిన తర్వాత అంతర్జాతీయంగా అనేక వేదికలపై, పత్రికల్లో చర్చనీయాంశమైంది. ఆయన కృషిని అభినందించిన వారున్నారుబీ అభిశంసించిన వారూ ఉన్నారు. అది అంబేద్కర్ వ్యాఖ్యానం అని సరిపెట్టుకున్న వారూ ఉన్నారు. 1956 సంవత్సరం అక్టోబర్ 14న లక్షలాది మంది అనుచరులతో ఆయన బౌద్ధ ధర్మం స్వీకరించినప్పుడు ఎటువంటి అనుకూల, ప్రతికూల ప్రతిస్పందన వచ్చిందో, ఆయన మరణానంతరం 1957లో వెలువడిన ఈ గ్రంథంపై కూడా అటువంటి ప్రతిస్పందన వచ్చింది. అయితే అదే సమయంలో అంబేద్కర్ బౌద్ధ ధర్మ స్వీకారాన్ని సానుభూతితో ఆహ్వానించిన మేధావులు ఉన్నారు. అటువంటివారిలో మహా పండిట్, త్రిపిటకాచార్య రాహుల్ సాంకృత్యాయన్ అంబేద్కర్ బౌద్ధ ధర్మ దీక్షను ఆహ్వానించారు. అభినందించారు (Eleanor Zelliot, The Indian Rediscovery of Buddhism 1856–1956). అదేవిధంగా ప్రముఖ బౌద్ధ పండితుడైన ఆనంద కౌసల్యాయన్ బుద్ధుడు – ఆయన ధమ్మాన్ని హిందీలోకి అనువాదం చేయడమే కాకుండా అంబేద్కర్ అభిప్రాయాలకు ఆధారంగా పాలీ పిటక సాహిత్యం నుండి పాద పీటికల్లో ఆకారాలను ఇచ్చాడు. ఈ విధంగా అంబేద్కర్ బౌద్ధ ధర్మ దీక్ష, ఆయన ఆదర్శంపై రచించిన గ్రంథం ఆధునిక భారత మతోద్యమాల చరిత్రలో ముఖ్య ఘటనలుగా నిలిచిపోయాయి. ఇంతటి చారిత్రక ప్రాధా న్యతను సంతరించుకున్న ఈ గ్రంథ రచనను అంబేద్కర్ 1956 సంవత్సరం ఫిబ్రవరిలో పూర్తి చేశారు. అదే సంవత్సరం మార్చి 15న ఈ గ్రంథానికి ఆయన ఒక పీఠిక (Preface) కూడ రచించారు. ఈ పీఠిక ఈ గ్రంథ రచన నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి బాగా తోడ్పడుతుంది. అంతేకాదు అంబేద్కర్ బాల్య జీవితం, కుటుంబ వాతావరణం, బాల్య జీవితంలో ఆయన్ని ప్రభావితం చేసిన గ్రంథాలు, వాటి వివరాలు, ఈ గ్రంథ రచన పూర్తి చేయడంలో ఆయన ఎదుర్కొన్న సమస్యలు, ఆరోగ్య పరిస్థితి, గ్రంథ రచనలో ఆయనకు భౌతికంగా, మానసికంగా తోడ్పడిన వ్యక్తుల గురించి మనకు తెలుస్తుంది. కాని ఇంత ముఖ్యమైన పీఠికను నేటివరకు "బుద్ధ అండ్ హిజ్ ధమ్మ" తోబాటు కలిపి ప్రచురించలేదు. కారణం తెలియదు. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక రేయింబవళ్ళు కష్టపడి పూర్తి చేసిన ఈ గ్రంథానికి ఆయన స్వయంగా రాసిన పీఠిక లేకుండా వెలువడటం చాలా వెలితిగా కనిపిస్తుంది. ఆయన మరణానంతరం తొలి ముద్రణ 1957లో పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ, బొంబాయి ప్రచురణగా వెలువడింది. అప్పటి నుండి 1991 వరకు నాలుగు పునర్ముద్రణలు ఈ గ్రంథం పొందింది. మరల 1992లో మహారాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్ 11వ వాల్యూమ్ ప్రచురించింది. దీనిలో కూడా ఈ పీఠిక లేదు. అంబేద్కర్ రచించిన అన్ని రచనల్ని వెలువరిస్తున్న బాబాసాహెబ్ అంబేద్కర్ సోర్స్ మెటీరియల్ పబ్లికేషన్స్ కమిటీ దృష్టికి కూడా ఈ పీఠిక రాలేదంటే ఆశ్చర్యంగా ఉంది.

1980లో భగవాన్ దాస్ వెలువరించిన అంబేద్కర్ అరుదైన పీఠిక (Rare Prefaces)ల్లో ఈ పీఠిక ఉంది. ఈ పీఠికను అంబేద్కర్ కార్యదర్శిగా పనిచేసిన శ్రీ నానక్ చంద్ రత్తు 1991లో అంబేద్కర్ పై రచించిన చిన్న పుస్తకం Dr. B.R.Ambedkar : His last days and His Message (డాక్టర్ అంబేద్కర్ : చివరి రోజులు – చివరి సందేశం)లో పేర్కొన్నారు. He had started writing Buddha and His Dhamma in November 1950. He worked very hard, day and night, in bringing the book to completion in February 1956. The Preface to the book was written by him in his own hand on March 15, 1956". (1950 సంవత్సరం నవంబర్‌లో 'బుద్ధుడు–ఆయన ధమ్మం' గ్రంథం రాయడం ప్రారంభించారు. 1956 ఫిబ్రవరి నాటికి గ్రంథరచన పూర్తి చేయడానికి ఆయన రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేశారు. ఈ గ్రంథానికి ప్రవేశికను ఆయన స్వదస్తూరితో మార్చి 15, 1956న రాశారు). డా౹౹ భగవాన్‌దాస్, దనంజయకీర్, నానక్ చంద్ రత్తు, కె.ఎన్. కదమ్ వంటి ప్రముఖ అంబేద్కర్ సాహిత్య పరిశోధకులు, రచయితలు తమ రచనల్లో ఈ పీఠికను ప్రత్యేకంగా పేర్కొన్నా, ఎందుకని అధికారికంగా ఈ పీఠిక "బుద్ధ అండ్ హిజ్ ధమ్మ"తోబాటు ప్రచురింపలేదు? దీనిలో డా? అంబేద్కర్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి కొన్ని ముఖ్యమైన విషయాల్ని ప్రస్తావించారు. ఈ అంశాలు ఆయన జీవితాన్ని, ఉద్యమాన్ని అర్థం చేసుకోవడానికి బాగా తోడ్పడతాయి. ఆయన తన జీవిత చరమదశలో ఎంతో దీక్షతో ఈ గ్రంథరచన పూర్తి చేశారు. డా? అంబేద్కర్ రచనల్లో "కుల నిర్మూలన", "బుద్ధుడు ఆయన ధమ్మం" శాశ్వతంగా నిలిచిపోయే రచనలు. అటువంటి విశిష్ట రచనలకు సంబంధించిన అన్ని విషయాల్ని వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది. ఎంత వివాదాస్పదమయినా, మరెంత ఆమోదయోగ్యం కాకపోయినా ఆయన జీవితానికి సంబంధించిన ఏ విషయాన్ని దాచాల్సిన పనిలేదు. తమకు నచ్చని వాటిని దాచటం, వెలుగులోకి రానీయకపోవడం మన సంస్కృతిలోని ఒకే అవలక్షణం. అటువంటి అశాస్త్రీయ, మానవ వ్యతిరేక సంస్కృతిని ప్రశ్నించే మనం ఆయన జీవితానికి సంబంధించిన ఏ విషయాన్ని దాచాల్సిన అవసరంలేదు. ఈ పీఠిక (Preface) ఈనాటి వరకు వెలుగులోకి రాకపోవడానికి ఒకే ఒక బలీయమైన కారణం కనిపిస్తుంది. పీఠికాంతంలో అంబేద్కర్ ఈ గ్రంథ రచన పూర్తి చేయడానికి ప్రధాన కారణంగా అంబేద్కర్ తన రెండవ భార్య, ఆమె బంధువు డాక్టర్ మల్వంకర్లను పేర్కొన్నారు. అంతేకాదు ఈ గ్రంథరచన ప్రారంభించే నాటికి తన ఆరోగ్యం ఎంతగా క్షీణించింది. ఆ దశలో వృత్తి రీత్యా డాక్టరైన తన భార్య ఏ విధంగా ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో తోడ్పడిందీ, ఆమెతోబాటు డాక్టర్ మల్వంకర్‌కి ఎంత రుణపడి వుందీ ఆయన సంక్షిప్తంగా వివరించారు. ఈ అంశాలు ఆయన అనుచరులకు నచ్చలేదేమో ననిపిస్తుంది. ఎందుకంటే డాక్టర్ అంబేద్కర్ రెండవ వివాహం 'బ్రాహ్మణ' స్త్రీతో జరిగింది. ఆమెతో వివాహం ఆయన సన్నిహితులకు మొదటి నుంచి ఇష్టం లేనట్టు కనిపిస్తుంది. అదే సమయంలో ఆమె ప్రవర్తన సందేహాస్పదంగా ఉండేదనుకునే వారు. ఆయన మరణం సహజ మరణం కాదనే వివాదం నేటికీ ఉంది. కాని పీఠికలోని విషయాన్ని బట్టి చూస్తే డాక్టర్ అంబేద్కర్‌కి ఆమెపై ఎంతో నమ్మకం ఉన్నట్టు కనిపిస్తుంది. పీఠికాంతంలో డాక్టర్ అంబేద్కర్ రాసిన మాటల్ని చూద్దాం: ' When I took up the task of composing the book, I was ill and still ill. During these five years there were ups and downs. At some stage my condition had become so critical that doctor talked of me as dying flame. The successful rekindling of this dying flame is due to the medical skill of my wife and Dr. Malvankar. I am immensely grateful. They alone have helped me to complete the Work(ఈ గ్రంథ రచన ప్రారంభించేనాటికి నేను అనారోగ్యంగా ఉన్నాను. ఒక దశలో నా పరిస్థితి క్లిష్టంగా పరిణమించింది. అప్పుడు నన్ను వైద్యులు ఆరిపోతున్న దీపం అన్నారు. ఆరిపోతున్న ఈ దీపాన్ని తన వైద్య నిపుణతతో నా భార్య, మల్వంకర్లు పునరుజ్జీవింప జేశారు. వారికి నేను ఎంతో రుణపడి ఉన్నాను. ఈ పని పూర్తి చేయడంలో 'వాళ్ళే' నాకు సహకరించారు. ఆయన రాసిన ఈ మాటలు ఆయన సన్నిహిత అనుచరులకు నచ్చలేదనిపిస్తుంది. అందువల్లే ఆయన మరణానంతరం ప్రచురింపబడిన "బుద్ధుడు ఆయన ధర్మం" గ్రంథంలో ఈ పీఠికను చేర్చలేదు. తొలి ముద్రణ సమయంలో ఈ పీఠిక లేదు కాబట్టి తర్వాత వెలువడిన ఏ పునర్ముద్రణలోనూ ఈ పీఠిక లేదు. అయితే 1957 ముద్రణకు తొలిపలుకు రాసిన పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు శ్రీ ఆర్.ఆర్. బోలే మాత్రం ఈ పీఠికలో అంబేద్కర్ తన జీవితానికి సంబంధించి పేర్కొన్న కొన్ని ముఖ్యమైన విషయాల్ని ప్రస్తావించారు. వాటిని అంబేద్కర్ రాసిన పీఠికనుండి సేకరించినవిగా చెప్పలేదు. అంబేద్కర్ రాసిన పీఠికను చదివిన వారెవ్వరయినా, అది ఆయన గ్రంథానికి ఎంత అవసరమో గ్రహించగలరు. ఆయన అనుచరులకు ఆమె ప్రవర్తన, స్వభావంపై ఎంత సందేహం వున్నా, ఈ పీఠికను వెలుగులోకి రాకుండా చేయడం సమర్థనీయం కాదు. వీలయితే అంబేద్కర్ మరణంపై పూర్తి న్యాయ విచారణ జరపమని ప్రభుత్వంపై ఒత్తిడి తేవచ్చు. కేవలం సందేహంతో ఒక వ్యక్తిని, అందులో అంబేద్కర్ నమ్మిన ఆయన భార్యను కించపరచడం ఆయన స్మృతినే కించపరిచి నట్లవుతుంది. ఒకవేళ ఆ విచారణలో ఆమె దోషి అని నిరూపించబడితే అంబేద్కర్‌కు వ్యతిరేకంగా జరిగిన దుర్మార్గమైన కుట్ర వెలుగులోకి వస్తుంది. ఆమె నిర్దోషి అని తేలితే ఆయన మరణానికి

కారణమేమిటో తెలుస్తుంది. అందువల్ల ఇప్పటికయినా మించిపో యింది లేదు. అంబేద్కర్ మరణంపై న్యాయ విచారణ జరిపించ మని కోరవచ్చు. అంబేద్కర్ సన్నిహిత సహచరుడైన శ్రీ శంకరానంద శాస్త్రి "మై మెమరీస్ అండ్ ఎక్స్పీరియన్సెస్ ఆఫ్ బాబా సాహెబ్ అంబేద్కర్" పుస్తకంలో ఈ సంఘటన గురించి ఇలా అన్నారు : It is too difficult to say today whether she became an innocent tool in the hands of the conspirators or deliberately did it. This could have been exposed had there been a judicial enquiry. Even today it can be held. It is not too late. SC, ST, BCs should press for a judicial enquiry (ఆమె కుట్రదారుల చేతుల్లో అమాయకమైన సాధనమైందో, లేక ఉద్దేశ పూర్వకంగా కావలెనని చేసిందో న్యాయ విచారణ జరిగితే వెల్లడవుతుంది. ఇప్పుడయినా విచారణ జరిపించవచ్చు. ఇదేమంత ఆలస్యం కాదు. వెనుకబడిన తరగతులవారు (SC, ST, BC) న్యాయ విచారణకై వత్తిడి తేవాలి). అంబేద్కర్‌కి పూర్వం తమ తమ పరిధుల్లో సనాతన సంప్రదాయాన్ని ప్రశ్నించిన వారిపై ఇటువంటి దాడులు (హత్యలు జరిగాయి. అటువంటి వారిలో ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి (1824-1883)ని సనాతనులు రహస్యంగా పాలలో గాజుపొడి కలిపి హత్య చేశారు. ఈ నాడున్న వర్ణ విభేదాలు ఆదిలో లేవని సనాతన సంప్రదాయాన్ని ప్రశ్నించి, ఆయన ఆర్య సమాజాన్ని స్థాపించారు. వైదిక మతాన్ని అంగీకరిస్తూనే విగ్రహా రాధనను, వర్ణ ధర్మాన్ని ప్రశ్నించిన దయానంద సరస్వతిపైనే దాడి జరిగితే, అసలు పూర్తిగా హిందూ మతాన్ని తిరస్కరించిన అంబేద్కర్‌పై కుట్ర జరిగిందనడంలో సందేహం లేదు. ఆయన అస్పృశ్యతకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నప్పుడే ఆయనపై హత్యా ప్రయత్నాలు జరిగాయి. జీవితాంతం వరకు హిందూమతం కోసం పాటుపడ్డ గాంధీనే హిందూ మతోన్మాదులు హత్య చేశారు. మరి హిందూమతాన్ని ఛాలెంజ్ చేసిన సాంఘిక విప్లవకారుడు అంబేద్కర్‌పై హత్యా ప్రయత్నం జరిగి వుండవచ్చని సందేహించడంలో తప్పులేదు. అయితే ఆ సందేహం అహేతుకంగా ఉండకూడదు. నిరూపిం చాలి. దానికోసం దేశంలోని అంబేద్కర్ వారసులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. వాస్తవ విషయాల్ని వెలికి తీయాలి. అంతవరకు ఏ వాస్తవాన్ని దాచాల్సిన పనిలేదు. ఒకవేళ ఈ కుట్రలో ఆమె (అంబేద్కర్ రెండవ భార్య) భాగస్వామి అయితే, అంబేద్కర్ వంటి అసాధారణ మేధావిని, విప్లవకారుడ్ని సయితం నమ్మకంగా ఎలా వంచించిందో ప్రజలకు తెలుస్తుంది. ఆ వంచన, కుట్ర, మోసం వెలుగులోకి రావాలి. కాని ఆమె చేసిన సేవల్ని చూసి నమ్మి ఆయన రాసిన ఆ నాలుగు మాటల్ని వెలుగులోకి రాకుండ చేయాల్సిన పనిలేదు. ఆమె దోషి అయితే అంబేద్కర్ని సయితం ఎలా వంచించిందో ఈ పీఠిక ద్వారా వెలుగులోకి వస్తుంది. అసలు ఈ పీఠికలో ఈ విషయంతో బాటు ఇంకా కొన్ని ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. అవి కూడ చదివితేనే పాఠకులకు అంబేద్కర్ బౌద్ధ ధర్మ దీక్షకు దోహదం చేసిన చిన్ననాటి పరిస్థితులు తెలుస్తాయి. ఏ విధంగా చూసినా అంబేద్కర్ స్వయంగా రాసిన ఈ పీఠిక (Preface) ఆయన గ్రంథాలలో అత్యుత్తమమైన "బుద్ధుడు - ఆయన ధర్మం" గ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి నేపథ్యంగా ఉపయోగపడు తుంది. అటువంటి పీఠికను నేటి వరకు వెలుగులోకి రానీయకుండ చేయడం సమంజసం కాదు. కనీసం మరో పునర్ముద్రణ సమయంలోనైనా చేరుస్తారని ఆశించవచ్చు. డాక్టర్ భగవాన్‌దాస్ సంకలనం చేసిన అరుదైన అంబేద్కర్ పీఠికల్లో ఈ పీఠిక ఎందుకని ఇంత వరకు వెలుగు చూడలేదో వివరిం చలేదు. అయితే ఈ పీఠిక ప్రతి ఒకటి శ్రీ నానక్ చంద్ రత్తు దగ్గర వుందని, మరొక ప్రతి మిళింద్ ఆర్ట్స్ కళాశాల, ఔరంగా బాద్‌లో చూశానని రాశారు. ఈ పీఠికను డాక్టర్ అంబేద్కర్ స్వయంగా రాశారనడంలో ఎటువంటి సందేహానికి ఆస్కారం లేదు. ఆయన సహచరులు తమకు ఇష్టం లేని ఆయన రచనల్ని వెలుగులోకి రానీయకపోవడం శోచనీయం. ఇవన్నీ దాచేస్తే దాగని సత్యాలు. సమాజాన్ని ప్రభావితం చేసిన అటువంటి మహనీయుల జీవితాలకి సంబంధించిన ఎటువంటి విషయాన్నయినా దాచాల్సిన అవసరం లేదు.

సంప్రదించిన రచనలు :


1. The Buddha and His Dhamma - B.R. Ambedkar, Siddharth Publications, Bombay, Fourth Edition, 1991.

2. The Buddha and His Dhamma, Dr. Babasaheb Ambedkar writings and Speeches, Vol-II, Education Department, Government of Maharashtra, Bo-Ambay, 1992.

3. Rare Prefaces of Dr. Ambedkar, Selected and Edited by Bhagwan Das, Bheem Patrika Publications, Jallundur, 1980.

4. Dr. B.R. Ambedkar: His last days and His Last Message - Nanak ChandRattu, Ambedkar Publications Society, Nellore, 1991.

5.My Memories and Experiences of Dr. Babasaheb B.R. Ambedkar-Shankara-nand Shastri, 1989.


**(మిసిమి పత్రిక ఏప్రిల్ 1994 సంచిక నుంచి)**
**రచయిత నాగార్జున విశ్వ విద్యాలయంలో**
**అప్పుడు అధ్యాపకుడిగా ఉన్నారు.**

# సీజేఐ చంద్రచూడ్.. న్యాయవ్యవస్థ పరిణామాలు



**తెలకపల్లి రవి**
సీనియర్ పాత్రికేయులు

**తొలి కొలీజియం సమావేశంలోనే ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేశారు. దీనిపై తెలంగాణ, గుజరాత్ హైకోర్టులలో న్యాయవాదులు నిరసన తెలిపితే పిలిపించి చర్చలు చేసి కొన్ని మార్పులు చేశారు. తాము సిఫార్సు చేసిన పేర్లను కేంద్రం తొక్కిపట్టడంపై సీజేఐ చంద్రచూడ్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. సుప్రీంకోర్టు వీటి గురించి కేసు విచారణ చేపట్టి కేంద్రానికి నోటీసు ఇచ్చింది. మాజీ సీజేఐపై ఏపీ సీఎం జగన్ గతంలో ఆరోపణలతో లేఖ రాయడం విచారణకు రానుంది.**

భారత ప్రధాన న్యాయమూర్తిగా డివై చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేశాక సుప్రీంకోర్టులో ఇటీవల కొన్ని నూతన పరిణామాలు చూస్తున్నాం. కొలీజియం సిఫార్సులు, కీలక కేసుల పోస్టింగు రిజిస్ట్రేషన్, బదిలీలు, కేంద్ర న్యాయశాఖ స్పందనలు, కొన్ని రాజ్యాంగ కేసుల విచారణ వంటి అన్ని విషయాల్లోనూ కొత్త వాతావరణం కనిపిస్తున్నది. దేశ చరిత్రలోనే అత్యధికంగా ఏడున్నరేళ్లు సీజేఐగా పనిచేసిన వైవి చంద్రచూడ్ కుమారుడైన ప్రస్తుత సీజేఐ రెండేళ్లపైన పదవిలో కొనసాగనుండటం గత పదేండ్లలో ఇదే ప్రథమం. అనేక సందర్భాల్లో స్వతంత్ర విమర్శనాత్మక వైఖరి ప్రదర్శించి సంచలన తీర్పులు ఇచ్చిన సీజేఐ చంద్రచూడ్ పదవీ కాలంపై ముందే చాలా మందిలో ఆశా విశ్వాసాలు వ్యక్తమైనాయి. ఎందుకంటే గత కొన్ని సంవత్సరాలుగా మరీ ముఖ్యంగా ప్రధాని మోడీ హయాంలో న్యాయవ్యవస్థ కేంద్రానికి విధేయంగానూ, అనుకూల రీతిలోనూ వ్యవహరిస్తున్నదనే అభిప్రాయం బలపడింది. అందుకు అనేక ఆధారాలూ ఉన్నాయి. ప్రజల మౌలిక హక్కులకూ లౌకికతత్వానికీ సంబంధించిన కేసులు వెనక్కుపోవడం, దేశద్రోహం రాజద్రోహం వంటి పేర్లతో అనేకమంది అభ్యుదయవాదులను దారుణమైన శిక్షలకు గురిచేయడం, పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 రద్దు, ఎన్నికల బాండ్లు, ఇంకా అనేకానేక మౌలికమైన అంశాల విచారణ ఏండ్ల తరబడి విచారణకు నోచుకోవడం లేదు గాని, ప్రార్థనా స్థలాల వివాదాలు మాత్రం పదేపదే ముందుకొచ్చాయి. న్యాయమూర్తులపైన వివాదాలు ఫిర్యాదులు తీవ్రమయ్యాయి. ఐదేళ్ల కిందట అప్పటి ప్రధాన న్యాయమూర్తిపైనే సహచర సీనియర్లు ధ్వజమెత్తాల్సి వచ్చింది. హైకోర్టులూ అనేకసార్లు భిన్నాభిప్రాయం వెలిబుచ్చాయి. మరో వంక కేంద్రం ఏకపక్ష జోక్యం, వ్యాఖ్యలు, ఒత్తిడి తేవడం కనిపించింది. మాజీ ప్రధాన న్యాయమూర్తిని రాజ్యసభకు పంపడమూ జరిగింది. ఇన్ని పరిణామాల మధ్య సీజేఐగా వచ్చిన జస్టిస్ ఎన్వీ రమణ అత్యధికంగా జడ్జీల నియామకానికే ప్రాధాన్యతనిచ్చారు. పైన చెప్పిన కేసులన్నీ అలాగే వదలి పదవీ విరమణ చేయగా జస్టిస్ యూయూ లలిత్ రెండు మాసాలపాటు ఆ స్థానంలోకి వచ్చారు. ఆయన సుప్రీంలో కేసులు వేగంగా పరిష్కరిస్తానంటూ పెద్దఎత్తున ధర్మాసనాలకు కేటాయిస్తూ వచ్చారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల వంటి ఒకటి రెండు కేసులు మాత్రం పరిష్కారం చేసి దిగిపోయారు. ఆ సందర్భంగా తాను రాజ్యసభ పదవివంటివి తీసుకోను గానీ, పార్లమెంటు ఆమోదించే ట్రైబ్యునళ్లు వంటి వాటిని తీసుకోవడానికి అభ్యంతరం లేదని ప్రకటించారు. ప్రొఫెసర్ సాయిబాబా విడుదలకు హైకోర్టు తీర్పు చెబితే సుప్రీంకోర్టు ఆలస్యం చేసిన తీరుకు తన బాధ్యత లేదని సమర్థించుకున్నారు.

## చంద్రచూడ్ తొలి చర్యలు

సీజేఐగా చంద్రచూడ్‌పై ఆశలుండటానికి కారణముంది. ఆయన ఇచ్చిన తీర్పులు అలాంటివి. 377 అధికరణం స్వలింగ సంపర్కుల కేసు, వివాహేతర సంబంధాలలో మహిళల పట్ల వివక్షత, బాలికలను దత్తత తీసుకోవడం, శబరిమలలో మహిళల ప్రవేశం, అవివాహితల గర్భస్రావ హక్కు, అత్యాచారం కేసుల్లో రెండు వేళ్లతో పరీక్ష రద్దు వంటి అనేక సంచలన తీర్పులు హైకోర్టులోనూ, సుప్రీంకోర్టులోనూ వెలువరించారు. ప్రాథమిక హక్కుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ విషయాల్లో ముందున్నారు. గుజరాత్ మారణకాండపై తీసిన చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ నిలిపివేతను కొట్టివేశారు. ఆదాయ పన్ను శాఖపై వోడాఫోన్ ఫిర్యాదును తోసిపుచ్చారు. మతతత్వపూరితంగా ఓట్లు అడగడానికీ, నిజమైన సమస్యలు చెప్పడానికీ తేడా ఉందని ఒక తీర్పులో స్పష్టంచేశారు. గోప్యత హక్కును సమర్థించే తీర్పునిచ్చారు. ఢిల్లీ పాలన ముఖ్యమంత్రిదే తప్ప లెఫ్టినెంట్ గవర్నర్‌ది కాదని స్పష్టమైన తీర్పునిచ్చారు. ఆధార్ చట్టం చెల్లుబాటును మెజార్టీ తీర్పు ఆమోదిస్తే అది సరైన రీతిలో రాజ్యాంగబద్ధంగా ఆమోదించ లేని జస్టిస్ చంద్రచూడ్ ఒక్కరే మైనార్టీ తీర్పు నిచ్చారు.

సైన్యంలోనూ మహిళా అధికారుల పట్ల వివక్ష చెల్లదన్నారు. ఇలాంటివి చాలానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జస్టిస్ చంద్రచూడ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరవలేదు. తన హయాంలో మరే సీజేఐ విషయంలోనూ మోడీ హాజరు కాకపోవడం జరగలేదు. ఇది పొరబాటనీ, ఆయన విముఖతకు నిదర్శనమనీ వ్యాఖ్యలు వచ్చాయి. కొంతమంది ప్రభుత్వ అనుకూల వ్యాఖ్యాతలు రెండేండ్లపాటు ఉండబోయే సీజేఐ చంద్రచూడ్ తీరును కనిపెట్టి ఉండాలని రాయడం గమనించదగింది. న్యాయశాఖా మంత్రి కిరణ్ రిజిజు ఈ తరుణంలోనే కొలీజియం వ్యవస్థపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణయాధికారం ప్రభుత్వానిదేగాని న్యాయస్థానాలది కాదని చెబుతూ వచ్చారు. కొన్ని సంవత్సరాల తర్వాత న్యాయ కమిషన్‌ను పునర్నిర్మించారు. సంప్రదాయికంగా ప్రమాణ స్వీకారానికి ముందు ఇచ్చిన ఇంటర్వ్యూలలో సామాన్యునికి న్యాయం అందించడం మొదటి ప్రాధాన్యత అన్నారు. జస్టిస్ రమణ హయాంలో జడ్జిలపై విమర్శలను ఆరోపణలను గట్టిగా ఖండిస్తూ వచ్చారు. గాజు ఇండ్లలో వలె భద్రతలేకుండా పోయిందన్నారు. ఇందుకు భిన్నంగా సీజేఐ చంద్రచూడ్ న్యాయమూర్తులు కూడా సోషల్ మీడియా విస్తరణను గుర్తించాలని, విమర్శలకు సిద్ధం కావాలని సూచించారు. కొలిజియం వ్యవస్థ పరిస్థితిని బట్టి వచ్చిందే తప్ప ఉద్దేశపూర్వకమైంది కాదన్నారు. జడ్జిల నియామకం సమయంలో చాలా విషయాలు పరిశీలించాలంటే అందుకు ఒక వేదిక తప్పదనీ, అయితే నియామకాలు మాత్రం పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. న్యాయమూర్తులు వ్యక్తిగతంగా తీర్పరుల్లా జడ్జిమెంటల్‌గా వ్యవహరించరాదనీ, వాస్తవాలను బట్టి నిర్ణయించాలని స్పష్టంచేశారు.

బాధ్యతలు చేపట్టిన వెంటనే సీజేఐ చంద్రచూడ్ కేసులను నమోదు చేసి ధర్మాసనాల ముందుకు తెచ్చే విషయంలో పారదర్శకమైన ప్రకటన చేశారు. కేసుల భారం తగ్గించేందుకు అంతకుముందు జరిగిన దానికి భిన్నంగా అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటానన్నారు. దీర్ఘకాలంగా మగ్గిపోతున్న బెయిలు దరఖాస్తులు, కేసుల బదిలీలు మాత్రం భారీ ఎత్తున ప్రతిరోజూ చేపట్టాలని నిర్ణయించారు. తొలి కొలీజియం సమావేశంలోనే ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేశారు. దీనిపై తెలంగాణ, గుజరాత్ హైకోర్టులలో న్యాయవాదులు నిరసన తెలిపితే పిలిపించి చర్చలు చేసి కొన్ని మార్పులు చేశారు. తాము సిఫార్సు చేసిన పేర్లను కేంద్రం తొక్కిపట్టడంపై సీజేఐ చంద్రచూడ్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. అంతేగాక సుప్రీంకోర్టు వీటి గురించి కేసు విచారణ చేపట్టి కేంద్రానికి నోటీసు ఇచ్చింది. కీలకమైన ఢిల్లీ, ముంబాయి హైకోర్టుల వంటివి కూడా గతం కన్నా తీవ్రమైన తీర్పులివ్వడం కనిపిస్తున్నది. మాజీ సీజేఐపై ఏపీ ముఖ్యమంత్రి జగన్ గతంలో ఆరోపణలతో లేఖ రాయడం కూడా విచారణకు రానుంది. రాజధాని కేసులు, వాటిపై నిర్ణయం తీసుకోవడం గురించి రాజ్యాంగాధికారాలు కూడా ఇప్పుడు సుప్రీం ముందున్నాయి.

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) నియామకంలో కేంద్రం అనుసరిస్తున్న ఏకపక్ష వైఖరిని, లోపభూయిష్టమైన నియామకాలను జస్టిస్ జోసఫ్ నాయకత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ప్రశ్నించిన తీరు ఇటీవలి కాలంలో మనం ఎరుగనిది. రాజ్యాంగం 324వ అధికరణం ప్రకారం సీఈసీ ఆరేండ్ల కాలం గాని, 65 ఏండ్ల వయసు వరకూ గాని పదవిలో కొనసాగవచ్చు. కాని ఏరికోరి కేవలం ఏడాదిలోపు రిటైరయ్యే వారినే నియమించడం ద్వారా సీఈసీలు కీలుబొమ్మల్లా మార్చివేయబడుతున్నారు. వారేదైనా కీలకమైన నిర్ణయం తీసుకొనేలోపే దిగిపోవలసిన స్థితి. తొలి సీఈసీ ఎనిమిదేండ్లు పనిచేశారు. కాని కేంద్రం ఏరికోరి 1950లలో పుట్టిన వారినే ఎంపిక చేస్తున్నదని, వారు తమకు తలూపేలా ఉండాలనుకుంటున్నదనీ సుప్రీం వ్యాఖ్యానించింది. యూపీఏ హయాంలో ఆరుగురు, మోడీ ఏడేండ్ల పాలనలో ఎనిమిది మంది సీఈసీలు మారారని గుర్తు చేసింది. రాజ్యాంగం ఈ నియామక ప్రక్రియపై పూర్తి స్పష్టత నివ్వలేదని, సీఈసీని ఎంపిక చేసే కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా ఉంటే మంచిదని సూచించింది. ప్రజాస్వామ్యం పటిష్టంగా ఉండాలంటే శేషన్ వంటివారు ఎన్నికల అధికారులుగా ఉండటం అవసరమన్నది. ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతపై అనేక సందేహాలు ముసురుకుంటున్న వేళ సుప్రీంకోర్టు ఈ అంశాన్ని చేపట్టడం ఆహ్వానించదగింది. కొలీజియం ఒకటికి రెండుసార్లు చర్చించి న్యాయమూర్తుల పేర్లు సిఫార్సు చేశాక ఏమీ తేల్చకుండా కేంద్రం ఎడతెగని జాప్యం చేయడం సరికాదని ఇటీవల సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మొత్తంపైన గత కొద్ది సంవత్సరాలుగా చూస్తున్న సుప్రీంకోర్టు ధోరణిలో కొంతైనా మార్పు కనిపించడం, స్వతంత్రత అవసరాన్ని నొక్కి చెప్పడం స్వాగతించదగింది. దీనిపై కేంద్రం స్పందనలూ సుప్రీం తదుపరి అడుగులూ జాగ్రత్తగా చూడాల్సి ఉంటుంది. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలపైనా సమాఖ్యతత్వం, లౌకిక తత్వం, భావప్రకటనా స్వేచ్ఛ వంటి వాటిపైనా తీవ్రదాడి చేస్తున్న సమయంలో వాటి రక్షణకు సుప్రీంకోర్టు కీలకపాత్ర వహించాలని ప్రజలు ఆశిస్తున్నారు. కానీ, అప్పుడే అత్యున్నత నాయస్థానంపై కేంద్రం ఒత్తిడి పెరగడం కనిపిస్తూనే ఉంది. మరి సీజేఐ చంద్రచూడ్ హయాంలో సుప్రీంకోర్టు కేంద్రం ఒత్తిడిని దాడులను తట్టుకుని రాజ్యాంగ రక్షణకు తగు వైఖరి తీసుకుంటే దేశానికి ప్రజాస్వామ్యానికి గొప్పమేలు జరుగుతుంది. ❑

# ఎనిమిదేళ్ల మోదీ పాలన..
# జనంపై రణం.. దేశానికి రుణం



ఎం.కోటేశ్వరరావు
సీనియర్ పాత్రికేయులు

**ఒకనాడు ఆర్థిక భరోసా లేదా భద్రతగా భావించి కూడపెట్టుకున్న బంగారాన్ని ఒకసారి తాకట్టు పెట్టిన తరువాత విడిపించుకోవటం పెద్ద సమస్యగా మారుతోంది ఇప్పుడు. ముతూట్ ఫైనాన్స్ వంటి బంగారం తాకట్టు కంపెనీలు గత ఏడాది 21 శాతం లాభాలు సంపాదించాయి. ఈ ఏడాది తాకట్టు రుణాలు 15 శాతం పెరిగే అవకాశాలున్నట్లు అంచనా.**
**ఒక వైపు దేశాన్ని అప్పులపాలు చేయటంతో పాటు అనుసరిస్తున్న విధానాలు జనాలను కూడా అప్పుల ఊబిలో దింపుతున్నాయి.**

మన దేశ క్రమశిక్షణ గురించి పెద్దలు చెప్పిన అంశాలలో అప్పు చేయటం ఎంత చెడ్డ పనో చెప్పనవసరం లేదు. తినటానికి లేకపోతే కడుపులో కాళ్లు ముడుచుకొని పడుకుంటాం గాని అప్పు చేసి పప్పుకూడు తినం అనే మాట ఇప్పటికీ అక్కడక్కడా వినిపిస్తూనే ఉంటుంది. గతంలో అప్పులున్న వారెందరు అని వెతికితే ఇప్పుడు అప్పు లేని వారెవరు అన్నది ప్రశ్న. భారతీయత గురించి లౌడ్ స్పీకర్లతో పని లేకుండానే గొంతెత్తి అరచి మాట్లాడే వారి పాలనలో దేశం అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. కలి యుగ దైవం వెంకటేశ్వరుడే అప్పులు చేయగా లేనిది మనమెంత అని సమర్థించుకొనే అవకాశం కూడా మనకు ఉంది. జనం నమ్ముతున్న దేవుడి వీధుల్లోకి లాగి రాజకీయం చేస్తున్న వారికి ఇదొక లెక్కా ! ఇంతకీ వడ్డీకాసుల వాడు ఎందుకు అప్పు చేసినట్లు ? మన పాలకులు దేనికి చేస్తున్నట్లు ? మాటా మాటా వచ్చి లక్ష్మీదేవి భర్త విష్ణుమూర్తిని వదలి వెళ్లిపోయిందట. దాంతో దిక్కుతోచక ఆ ఊరు ఈ ఊరు తిరుగుతూ విష్ణుమూర్తి తిరుపతి ప్రాంతానికి రాగానే ఎందుకో కాస్త ప్రశాంతత దొరికినట్లు అని పించి అక్కడే ఒక రూము తీసుకొని ఉన్నాడు. అప్పుడు మారు పేరుతో ఆకాశరాజు కూతురు పద్మావతి ప్రేమలో పడ్డాడు. వివాహం చేసుకొనేందుకు డబ్బు లేకపోతే కుబేరుడి దగ్గర భారీ వడ్డీ రేటుతో అప్పు చేశాడు. వడ్డీ చెల్లించటానికి వనరులేని వెంకటేశ్వరుడు తిరుమలను శాశ్వత నివాసంగా మార్చుకున్న ప్పటి నుంచి తన భక్తులు హుండీరూపంలో ఇచ్చే కానుకలను వడ్డీగా చెల్లిస్తున్నాడు. అప్పు తీరటం లేదు ఇదీ కథ. మరి మన పాలకులు ఎందుకు అప్పు చేస్తున్నారు అని అడిగితే అప్పులోనే ఉంది అభివృద్ధి అని టక్కున చెప్పేస్తారు. ఎన్ని కానుకలు వేసినా వెంకటేశ్వరుడి అప్పు ఎలా తీరటం లేదో అలాగే ఎన్ని అప్పులు చేసినా అభివృద్ధి ఎక్కడా కనిపించటం లేదు.

తాజా బడ్జెట్ పత్రాల్లో వెల్లడించిన సమాచారం ప్రకారం 2022 మార్చి నాటికి కేంద్ర ప్రభుత్వ అప్పు రు.1,35,87,893 కోట్లుగానూ 2023 మార్చి ఆఖరుకు అది రు.1,52,17,910 కోట్లకు పెరుగుతుందని ఉంది. అంటే ఏడాది కాలంలో 16 లక్షల 30 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం కొత్తగా అప్పు చేయనుంది. వర్తమాన కరెన్సీ మారకపు విలువ, ఇబిఆర్, కాష్ బాలన్సులను పరిగణనలోకి తీసుకుంటే ఈ మొత్తాలు 139, 155 లక్షల కోట్లుగా ఉంటాయని ప్రభుత్వమే వివరణలో పేర్కొన్నది. నరేంద్రమోడీ సర్కార్ అధికారానికి వచ్చిన ఏడాది అంటే 2014 మార్చి ఆఖరుకు ఉన్న అప్పు రూ.53,11,980 కోట్లు. ఎనిమిదేళ్లలో కొత్త అప్పులు రూ.99,05,930 కోట్లు. బహుశా దీనికి కూడా నెహ్రూ, కాంగ్రెసే కారణమని జనం చెవుల్లో ఎక్కించేందుకు పూనుకోవచ్చు. పోనీ ఇంత చేసినా అభివృద్ధి కరోనాతో నిమిత్తం లేకుండా సాధారణ పరిస్థితి ఉన్నపుడే ఎనిమిది నుంచి నాలుగు శాతానికి తగ్గింది. ఏమిటీ నిర్వాకం అని ఎవరైనా ప్రశ్నిస్తే మీరు దేశ భక్తులేనా, ఇక్కడి తిండి తింటూ ఇక్కడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారా అని దాడి చేస్తారు.

కేంద్రానికి వచ్చే ఆదాయం వంద రూపాయలనుకుంటే దానిలో అప్పుల ద్వారా 35, జీఎస్టీ ద్వారా 16, ఆదాయపన్ను, కార్పొరేట్ పన్ను ద్వారా 15 చొప్పున, ఎక్సయిజ్ పన్ను ఏడు, కస్టమ్స్, పన్నేతర ఆదాయం ఐదేసి చొప్పున, ఇతరంగా రెండు రూపాయలు వస్తోంది. దీన్ని ఖర్చెలా చేస్తున్నారు ? వడ్డీ చెల్లింపులకు 20, రాష్ట్రాలకు పన్నుల వాటాగా 17, కేంద్ర పథకాలకు 15, ఆర్థిక సంఘం, ఇతర బదిలీలకు 10, కేంద్ర ప్రాయోజిత పథకాలకు 9, ఇతర ఖర్చులకు 9, సబ్సిడీలు,

రక్షణకు ఎనిమిది చొప్పున, పెన్షన్లకు నాలుగు వంతున ఖర్చు చేస్తున్నారు. అప్పులు తీసుకురావటాన్ని తప్పు పట్టాల్సిన పనేమీ లేదు గానీ దాని వలన జరుగుతున్న వృద్ధి ఎంత అనేది మాత్రం ప్రశ్నార్ధకమే. పెట్టుబడి ఖర్చును పెంచినట్లు చెబుతున్నారు. రోడ్ల నిర్మాణానికి పెద్దపీట వేశారు. దీని వలన కలిగే మేలు ఏమంటే రోడ్ల నిర్మాణానికి అవసరమైన యంత్రాలు, సిమెంట్, ఉక్కు, ఇతర ముడి సరకులకు గిరాకీ పెరుగుతుంది, ఆ పరిశ్రమలకు పని దొరుకుతుంది. గతంలో రోడ్ల నిర్మాణం అంటే మానవ శ్రమ గణనీయంగా ఉండేది, ఇప్పుడు యంత్రాలు ఆ పని చేస్తు న్నాయి. ఇక ఈ రోడ్ల నిర్మాణానికి చమురు మీద సెస్‌లను విధించి జనాల నుంచే వసూలు చేస్తున్నారు. అదే జనాలు (ద్విచక్ర వాహనాలు మినహా) రోడ్లను వినియోగిస్తే టోలు వసూలు చేస్తున్నారు. వాణిజ్య వాహనాలు చెల్లించే టోల్‌టాక్సు పరోక్షంగా తిరిగి జనం మీదనే రుద్దుతారు.

ఒక వైపు దేశాన్ని అప్పులపాలు చేయటంతోపాటు అనుసరిస్తున్న విధానాలు జనాలను కూడా అప్పుల ఊబిలో దింపుతున్నాయి. కరోనా కాలంలో ప్రభుత్వాలు, జనాలు ఇబ్బందులు, అప్పుల పాలయ్యారు, కుబేరులు మాత్రం మరింతగా పెరిగారు, బలపడ్డారు. ఇదెలా జరిగింది ? వారికి అనుకూలమైన విధానాలే కారణం, ఎవరినైనా ఇతర సహేతుక కారణాలు చెప్పమనండి. అనేకమంది పారిశ్రామికవేత్తలు కరోనా కారణంగా తమ సంస్థలను మూసివేశారు, వాటిని పునరుద్దరించే పేరుతోనో మరొక సాకుతోనే ప్రభుత్వాల నుంచి రాయితీలు పొందారు. పోనీ వాటిని తిరిగి పెట్టుబడిగా పెట్టి ఉపాధి కల్పించేందుకు పూనుకున్నారా అంటే అదెక్కడా కనిపించటం లేదు. కరోనా తొలి, ద్వితీయ తరంగాల్లో అనేక కుటుంబాలు ఆసుపత్రి ఖర్చుల కోసం ఉన్న ఆస్తులు అమ్మి, అప్పుల పాలైనా అనేక కుటుంబాల్లో ఆప్తులు దక్కలేదు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచటం లేదు.

కుటుంబాలు కరోనాతో ఎలా దెబ్బతిన్నాయో, వత్తిడి ఎలా పెరిగిందో వారి బంగారం తాకట్టు ఉదంతాలు వెల్లడిస్తున్నాయి. రిజర్వుబాంకు నివేదిక ప్రకారం 2019 నవంబరు 22 నాటికి బాంకుల్లో బంగారు రుణాల మొత్తం రు.29,514 కోట్లు కాగా 2021 నవంబరు 19 నాటికి 65,630 కోట్లకు పెరిగాయి. ఇది అర్థిక వ్యవస్థ సజావుగా లేదనేందుకు ఒక సూచిక. వారు వ్యక్తులు లేదా చిన్న, సన్నకారు సంస్థల వారు ఎవరైనా కావచ్చు. పత్రికల్లో ఏ రోజు చూసినా బంగారు తాకట్టు సంస్థల వేలం వార్తలు కనిపిస్తాయి. ఒకనాడు ఆర్థిక భరోసా లేదా భద్రతగా భావించి కూడపెట్టుకున్న బంగారాన్ని ఒకసారి తాకట్టు పెట్టిన తరువాత విడిపించుకోవటం పెద్ద సమస్యగా మారుతోంది ఇప్పుడు. ముతూట్ ఫైనాన్స్ వంటి బంగారం తాకట్టు కంపెనీలు గత ఏడాది 21శాతం లాభాలు సంపాదించాయి. ఈ ఏడాది తాకట్టు రుణాలు 15 శాతం పెరిగే అవకాశాలున్నట్లు అంచనా.

గృహ రుణాల్లో వినిమయ వస్తువుల కోసం చేసిన వాటి నుంచి అనేక రకాలు ఉంటాయి. 2020లో జీడీపీలో ఈ అప్పు 12.6 శాతం ఉంటే 2021 మార్చి నాటికి 14.5 శాతానికి పెరిగింది. ఈ కాలంలో జనాలు విలాస వస్తువుల జోలికి పోలేదన్నది అందరికీ తెలిసిందే. 1999లో ఇది కేవలం 2.2 శాతమే ఉంది. ఆ తరువాత జనాలతో అప్పులు చేయించి వస్తువుల కొనుగోలుకు ప్రోత్సహించిన అంశం తెలిసిందే. ఇదే కాలంలో కార్పొరేట్ శక్తులు విద్య, వైద్య రంగాల్లో పెద్ద ఎత్తున విస్తరించటం, ప్రభుత్వం ఈ రంగాలను నిర్లక్ష్యం చేసిన కారణంగా రుణగ్రస్త అంశాల్లో ఇవి కూడా ప్రముఖంగా చోటు చేసుకుంటున్నాయి. 2021 మార్చినాటికి గృహరుణ భారం 393 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు.మన కరెన్సీలో దాదాపు 30లక్షల కోట్ల రూపాయలు.

కరోనా లాక్‌డౌన్లు, మూసివేతలను ఎత్తివేసిన తరువాత అనేక సంస్థలు తిరిగి పాత వారికి అవకాశం ఇచ్చినప్పటికీ అనేక చోట్ల వేతన కోతలు ఉన్నాయి. అందువలన కుటుంబ అవసరాల కోసం తాకట్టు పెట్టిన బంగారాన్ని ఎంత మంది విడిపించుకుం టారన్నది సందేహమే. కరోనాతో నిమిత్తం లేకుండానే గృహస్తుల పొదుపు తగ్గింది. 2014-15లో జిడిపిలో 13 శాతంగా ఉన్నది 2019-20కి 11 శాతానికి, 2020-21 డిసెంబరు త్రైమాస కాలానికి 8.2 శాతానికి పడిపోయింది. అంటే ఉన్న పొదుపును కరోనా ఖర్చు చేయించింది. కేంద్ర ప్రభుత్వ ఎన్ఎస్ఓ సమాచా రం ప్రకారం గ్రామీణ కుటుంబాల సగటు అప్పు 2012-18 సంవత్సరాలలో 84, పట్టణాలలో 42శాతం చొప్పున పెరిగింది. 2021ఐసిఇ 360 సర్వే ప్రకారం 2015-16 నుంచి 2020-21తో పోలిస్తే దేశంలో దిగువన ఉన్న 20 పేద గృహస్తుల ఆదాయం 53 శాతం తగ్గితే ఇదే కాలంలో 20 శాతం ధనికులకు 39 శాతం పెరిగింది. ఈ కాలమంతా నరేంద్రమోడీ అమలు చేసిన విధానాలే ఉన్నాయి.

రైతులపై 2021లో రణం సాగించిన నరేంద్రమోడీ సర్కార్ రానున్న రోజుల్లో కార్మికవర్గాన్ని లక్ష్యంగా చేసుకుంది. లేబర్ కోడ్ పేరుతో ప్రతిపాదించిన అంశాలు ఇప్పుడున్న బేరమాడే శక్తిని, వారి హక్కులను మరింత హరిస్తాయి.యజమానుల దయాదాక్షిణ్యాలకు వదలివేసే బాటలో నడుస్తున్నారు. జనంపై రణం, దేశానికి రుణాన్ని పెంచటం తప్ప నరేంద్రమోడీ ఎనిమిది సంవత్సరాల పాలనలో చేసిందేమిటి ? ❑

# కొత్త స్త్రీలు వస్తున్నారు జాగ్రత్త



-కె.ఎన్.మల్లీశ్వరి
జాతీయ కార్యదర్శి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

**దేశభక్తి ముసుగులో మతాన్ని ఉగ్గు పాలతో రంగరించి బిడ్డలకి పోయడానికి తల్లులు సమాయత్తమవుతున్నారు. బాలల వికాసం అంటే కాషాయ దుస్తులు తొడిగి, తలకి కాషాయపట్టీ పెట్టి ప్రతీ పండగలో పిల్లల చేత కోలాటాలు, డీజేలు ఆడించడం విధిగా మారిపోయింది. ఒకపుడు శాస్త్రీయ దృక్పథాన్ని అందించడానికి తపన పడిన తల్లులు, ఇపుడు పురాణ స్త్రీలను అమ్మాయిలకి ఆదర్శంగా చూపిస్తున్నారు. పాతివ్రత్య నిరూపణ కోసం అగ్నిలో నిలబడి ఉన్న సీత కాలెండర్ లక్షలాది కాపీలు అమ్ముడుపోయి ఇంటి గోడలపై ప్రత్యక్షం కావడం ఆడపిల్లలకి ఎటువంటి సంకేతాన్ని ఇస్తుంది?**

'ఒక సమాజపు ప్రగతిని, ఆ సమాజంలోని మహిళలు సాధించిన ప్రగతితో కొలుస్తాను' అన్నారు అంబేద్కర్. ఏ మార్పుకైనా మహిళలు ఎంత కీలకమో చెప్పే అరుదైన వ్యాఖ్య ఇది. మిగతా అన్ని సమూహాల మాదిరిగానే భారత మహిళల ప్రగతికి కూడా భిన్నత్వం ఉంది. ఆధునిక మహిళ చరిత్ర పునర్లిఖిస్తుందని గురజాడ అంటే, ఆ చరిత్ర స్వేచ్ఛా సమానత్వాలతో అత్యంత ప్రజాస్వామికంగా ఉంటుంది అనుకున్నాము. ఆ వైపు కొన్ని ముందడుగులు పడ్డాయి. అయితే గత యాభై ఏళ్లుగా పాక్షికంగా, గత పదేళ్లుగా వడివడిగా కొన్ని మహిళా సమూహాలు కొత్తచరిత్రని వేగంగా నిర్మిస్తూ పోతున్నాయి. ఆ చరిత్ర ఫాసిస్ట్ భావజాలానికి బలమైన చేర్పుని ఇస్తూ ఉండటం కలవరపరిచే అంశం. 'ఒక దేశపు ఫాసిస్టు భావజాల వ్యాప్తిని, ఆ దేశపు రైట్ వింగ్ మహిళల చైతన్యంతో కొలవాల్సి ఉంటుంది'. ఇట్లా కొలిచినపుడు విభ్రాంతి కలిగించే వాస్తవాలు కనిపిస్తున్నాయి. కూడూ, గూడూ, చదువూ, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళూ-వీటిలో కాసింత స్వేచ్ఛకోసం జీవితమంతా పణంపెట్టి కొందరు స్త్రీలు పోరాటాలు చేస్తున్నారు. మరోవైపు దేశాన్ని హిందూవర్ణంతో నింపేయడానికి సాయుధ, భావజాల, ప్రచార శిక్షణలతో మరికొందరు స్త్రీలు దూసుకుపోతున్నారు.

భారతదేశంలో ఫాసిజం ప్రధానంగా 'హిందూత్వ బ్రాహ్మణీయ భావజాలరూపం'లో ఉందని విశ్లేషకుల అంచనా. 'ఈ దుష్ట ఫాసిస్ట్ రాజ్యం నశించాలి' అంటూ కేవలం అధికార వ్యవస్థలను శత్రువుల్లా చూస్తూ వచ్చిన కాలాన్ని దాటి ముందుకు వచ్చాము. ఇపుడు ఫాసిస్ట్ భావజాలం, రాజ్యంలోనే కాదు, మన ఆఫీసుల్లో, ఎదురింట్లో, మనింట్లో, మనలోపలికి కూడా వచ్చేసింది. మొదటిదశలో రాజ్య వ్యవస్థలు ఎవరినైతే అణచివేస్తాయో, ఆయావర్గాల్లో నుంచే కొందరిని మచ్చిక చేసి, ప్రలోభపెట్టి తమకు అనుగుణంగా మలుచుకోవడం రెండోదశ. పైవర్గాలకి అనధికార బానిసలుగా మారడం, స్వీయవర్గాల మీదనే దాడి చేయడం, ఇదంతా దేశభక్తిగా పరిగణింపబడటం ఒక చట్రం. గుజరాత్ ముస్లిం జాతి హననకాండలో వాఘ్రీస్, చరస్ తెగల ఆదివాసీలు, పట్టణ దళితులు తీవ్రమైన హింసకి, లూటీలకి పాల్పడ్డారు. వారి వల్నరబిలిటీని అక్కడి మతతత్వ శక్తులు గురిచూసి వాడుకున్నాయి. అగ్రవర్ణాల హిందూ మహిళలు, నాయకురాళ్ళు కొందరు దగ్గరుండి, చప్పట్లు కొట్టి మరీ తమ మగవారు చేసే అత్యాచారాలను ప్రోత్సహించారు. తమలో తాము కొట్లాడుకునే బదులు ప్రతి హిందూ యువకుడూ-పలానా మైనార్టీమతంలోని తలొక పురుషుడినీ చంపితే సంతోషిస్తామని మార్గనిర్దేశం చేసారు.

ఉత్తర భారతదేశంలో 'కొత్త మహిళ' ఆవిర్భవించింది. మతతత్వపార్టీలకి, సంస్థలకి అనుబంధంగా మహిళా విభాగాలు విస్తృతంగా ఏర్పడ్డాయి. 'మాత్రీ మండలులు', 'సేవికా సమితులు', 'మహిళా మోర్చాలు' తమ కార్ఖానాల్లో స్త్రీలకి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాయి. స్త్రీలు మృదువుగా, సుకుమారంగా ఉండాలని భావించే పితృస్వామిక సమాజం వారిని మత సంస్థలు నిర్వహించే పారా మిలిటరీ తరహా సాయుధ శిక్షణకి ఎలా ఒప్పుకుంది? స్త్రీలు ఉద్యోగాల కోసమో ఇతర సామాజిక కార్యకలాపాల కోసమో అడుగు బైటపెడితే చాలు అనేక అనుమానాలతో వేధించే కుటుంబం, వారిని ధార్మిక కార్యకలాపాల కోసం రోజుల తరబడి పుణ్యక్షేత్రాలకి ఎలా అనుమతిస్తోంది? పర్పుల్ అంచున్న తెల్లచీరలు కట్టుకుని మతప్రచారికలుగా, అధ్యాపికలుగా అవివాహిత స్త్రీలు ప్రతిగుమ్మం స్వేచ్ఛగా తిరుగుతూ ఎలా ప్రచారం చేయగలుగుతున్నారు? ఎందుకంటే

ఫాసిస్ట్ మతవ్యాప్తి కోసం అధికారవ్యవస్థలు స్త్రీలకి కాస్త కళ్ళాలు వదులు చేస్తాయి. తాము నిర్ణయించిన అంశాలలో స్త్రీలకి చరిత్రని పునర్లిఖించే బాధ్యతని అప్పగిస్తాయి. 'స్త్రీ స్వేచ్ఛ అంటే, తమమీద జరిగే దాడులు, అత్యాచారాల నుంచి విముక్తి పొందడమే తప్ప భార్యలుగా తల్లులుగా తమ సాంప్రదాయక విధులనుంచి విముక్తి పొందడం కాద'ని ఒక మతతత్వపార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలి వ్యాఖ్యని ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి. ఇంతకు ముందు మాత్రం స్త్రీలు అధికారం చెలాయించలేదా అంటే చెంగీజ్ ఖాన్ నవలలో చెప్పినట్లు అధికారం వస్తే గడ్డిపరక కూడా తలెత్తి నిలబడు తుంది. రాజకీయ నాయకులు, పెద్ద వ్యాపారస్తులు, సెలబ్రిటీ కళాకారులు, అగ్రవర్ణాలు, పదవులు హోదాల్లో ఉన్నవారి భార్యలు, తల్లులు, కూతుళ్ళు, అప్పచెల్లెళ్ళు కొందరు తమకి సొం

**'స్త్రీ స్వేచ్ఛ అంటే, తమమీద జరిగే దాడులు, అత్యాచారాల నుంచి విముక్తి పొందడమే తప్ప భార్యలుగా తల్లులుగా తమ సాంప్రదాయక విధులనుంచి విముక్తి పొందడం కాద'ని ఒక మతతత్వపార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలి వ్యాఖ్యని ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి. ఇంతకు ముందు మాత్రం స్త్రీలు అధికారం చెలాయించలేదా అంటే చెంగీజ్ ఖాన్ నవలలో చెప్పినట్లు అధికారం వస్తే గడ్డిపరక కూడా తలెత్తి నిలబడు తుంది.**

తంగా పవర్ లేకపోయినా తమ మగవారి తరపున వారికన్నా ఎక్కువ చలాయించడం వాస్తవం. ప్రాబల్యకులం, ధనికవర్గం, హోదా, అధికారం అంతిమంగా జత కడతాయి. అందులో స్త్రీలు ముఖ్యపాత్ర పోషిస్తారు. అయితే కనీసం మాటవరసకైనా – కులం అనాగరికం అనీ, పేద ఓటర్లే తమ దేవుళ్ళనీ, ఢిల్లీకి రాజైనా అమ్మకి కొడుకేననీ – ఇలా బహిరంగంగా పవర్ ని వ్యతిరేకించడం నైతికవిధిగా ఉండేది. ఇపుడు ఆ భారాన్ని తీసివేస్తూ పైవర్గాల స్త్రీల ఏకీకరణకి మతం అందివచ్చిన సాధనం అయింది. ఈ సాధనం మొదట సాంస్కృతికరంగంలో బలమైన పునాదులు వేసుకుంటోంది. వర్గాల, కులాల, హోదాల వారీగా కొంత మంది స్త్రీలు ఏర్పాటు చేసుకునే కిట్టీ పార్టీల్లో మతసంబంధ కార్యాచరణ ఏదో ఒక మేరకు సాగు తుంది. పట్టణ, ధనిక, మధ్యతరగతి మహిళలు మత కార్య కలాపాలు నిర్వహించడానికి అపార్ట్మెంట్ కల్చర్ చాలా అనువుగా ఉంటుంది. చందాల సేకరణ, ఉత్సవాల నిర్వహణ కమిటీలలో స్త్రీలు చురుకుగా పాల్గొంటున్నారు. దేశభక్తి ముసుగులో మతాన్ని ఉగ్గు పాలతో రంగరించి బిడ్డలకి పోయడానికి తల్లులు సమాయత్తమవుతున్నారు. బాలల వికాసం అంటే కాషాయ దుస్తులు తొడిగి, తలకి కాషాయపట్టీ పెట్టి ప్రతీ పండగలో పిల్లల చేత కోలాటాలు, డీజేలు ఆడించడం విధిగా మారిపోయింది. ఒకపుడు శాస్త్రీయ దృక్పథాన్ని అందించడానికి తపన పడిన తల్లులు, ఇపుడు పురాణ స్త్రీలను అమ్మాయిలకి ఆదర్శంగా చూపిస్తున్నారు. పాతివ్రత్య నిరూపణ కోసం అగ్నిలో నిలబడి ఉన్న సీత కాలెండర్ లక్షలాది కాపీలు అమ్ముడుపోయి ఇంటి గోడలపై ప్రత్యక్షం కావడం ఆడపిల్లలకి ఎటువంటి సంకేతాన్ని ఇస్తుంది? మతం వ్యక్తిగత విశ్వాసంగా ఉన్నంత వరకూ, దానినుంచి ప్రమాదం లేకపోవచ్చు, కానీ రాజకీయ ఆచరణగా ముందుకు వచ్చినపుడు అనేకమతాల భారతదేశంలో లౌకికతత్వం వెనక్కిపోయి మెజార్టీమతం అందరి నెత్తికెక్కి సవారీ చేస్తుంది. ఇంటి వరండా, హాలు వంటివి అందరూ వచ్చి పోవడానికి వీలైన లౌకికస్థలాలు. అక్కడ స్త్రీలు తమ చేతికళా నైపుణ్యాలతో తయారు చేసిన మత ప్రదర్శనా చిహ్నాలు, ఇతర మతస్తులు తమకి ఎంత పరాయివాళ్ళో చెపుతూ ఉంటాయి.

రాజకీయాలకి ఏమీ సంబంధం లేదేమో అనిపించేంతగా ఈ కొత్తమహిళలు తమచుట్టూ కుటుంబాలతో కలిసిపోతారు. పక్కింటి కొత్త కోడలికి వంట నేర్పడమో, ఎదురింటి పెద్దాయనకి అత్యవసర వైద్యసాయమో, ఆందోళన, అభద్రతల్లో ఉన్నవారికి మాటసాయమో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి చేతిసాయమో చేయడం ద్వారా చుట్టుపక్కల అందరికీ ముఖ్యులు అవుతారు. ఆయా సందర్భాల రోజువారీ చర్చల్లో భాగంగా తమ మత భావజాలాన్ని వ్యాప్తిలోకి తెస్తారు. భార్యాభర్తల సమస్యలకి న్యాయసహాయం తీసుకోకుండా ఈ మహిళలే మతసంఘాల ద్వారా పంచాయితీలు పెట్టి సర్దుకుపోవలసిన భారాన్ని స్త్రీల మీద వేస్తారు. ఎన్నికలు, పార్టీ మీటింగుల సమయాల్లో వీరు ప్రచారకర్తలుగా మారి, సాయాలు చేయడంద్వారా తాము పట్టు పెంచుకున్న సర్కిల్స్ ని సమీకరించి రాజకీయ ప్రయోజనాలకి వాడుకుంటారు.

నాలుగు దశాబ్దాల కిందట స్త్రీలు తమ పిల్లల్ని, ఇంటిని చూసుకుంటే చాలన్న దృష్టితో ఉద్యోగాలలో మహిళా రిజర్వేషన్ని మూడు శాతానికి కుదించిన ఘనత ఉత్తర భారతరాష్ట్రాలకి ఉంది. అనుకరణలో ఆరితేరిన దక్షిణ భారతదేశం అక్కడి మత రాజకీయాలనే కాదు, అక్కడి కొత్త మహిళలని కూడా ఆవాహన చేసుకుంటోంది. మత రాజకీయాలు మనకి వద్దు అనుకుంటే ప్రజలకి అయిదేళ్ళకాలం చాలు. ఈ కొత్తమహిళలు సర్వరంగాల్లో తెస్తున్న తిరోగతి వద్దు అనుకుంటే పోవడానికి యాభై ఏళ్ల కాలం కూడా చాలదు. ❑


# ఈనాటికీ తరగని మార్క్స్ ప్రాధాన్యత



- ఎరిక్ హాబ్స్‌బామ్
రచయిత ప్రముఖ అంతర్జాతీయ
ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు

**19వ శతాబ్ది పెట్టుబడి దారీ విధానం, బూర్జువా సమాజం కుప్ప కూలాయి. దీన్నే నేను ' ప్రళయాంతక యుగం' అని పిలిచాను. ఇది 1914-1940ల మధ్య దశ. ఈ సంక్షోభం ఎంత తీవ్రమైనదంటే అనేక మంది అసలు పెట్టుబడిదారీ విధానం మళ్లీ కోలుకుంటుందా అని సందేహంలో పడ్డారు. ఎంత మాత్రం మార్క్సిస్టు కాని జోసెఫ్ షింపీటర్ కూడా 1940లలో ఈ వ్యవస్థ స్థానంలో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ వచ్చేస్తుందని జోస్యం చెప్పలేదా? వాస్తవంలో పెట్టుబడిదారీ విధానం తిరిగి కోలుకున్నది. కాని పాతరూపంలో కాదు.**

2007లో లండన్‌లో యూదుల పుస్తక వారోత్సవం జరుగు తున్నది. అప్పటికి కారల్ మార్క్స్ వర్ధంతి (మార్చి 14) మరి రెండు వారాలుంది. పుస్తక వారోత్సవం జరుగుతున్నది కూడా లండన్‌లో మార్క్స్‌తో బాగా ముడివడిన బ్రిటిష్ మ్యూజియం లైబ్రరీలోని వలయాకారపు పఠన మందిరం సమీపంలో. జాక్స్ అట్టాలీ, నేనూ ఆయనకు జోహార్లర్పించేందుకు అక్కడకు చేరాం. మేమిద్దరం చాలా భిన్నమైన తరహాలకు చెందిన సోషలిస్టులం. అయితే మీరు ఆ తేదీని సందర్భాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే ఇది ఒకటికి రెండు రెట్లు ఊహించని విషయంగా కనిపిస్తుంది. 1883లో మార్క్స్ విఫలజీవిగా మరణించాడని ఎవరూ చెప్పడానికి లేదు. ఎందుకంటే ఆయన రచనలు అప్పటికే జర్మనీపై, మరీ ముఖ్యంగా రష్యాలోని మేధావులపై ప్రభావం చూపడం ప్రారంభ మైంది. ఆయన శిష్యుల నాయకత్వంలో జర్మన్ కార్మికోద్యమాన్ని చేజిక్కించుకునేందుకు అప్పటికే ఒక ఉద్యమం నడుస్తున్నది. అయితే 1883 నాటికి ఆయన జీవిత కాలపు కృషిని చూపించేందుకు చాలా స్వల్పమే ఉంది. ఆయన కొన్ని ప్రతిభావంతమైన కరపత్రాలు రాశారు. అసంపూర్ణ ప్రధాన రచన దాస్ కాపిటల్ మొండెంలా ఉంది. ఆయన జీవితపు చివరి దశాబ్దంలో దానికి సంబంధించిన పని చాలా మందకొడిగా సాగింది. ఒక సందర్శకుడు ఆయనను తన రచనల గురించి ప్రశ్నించినపుడు 'ఏ రచనలు?' అని మార్క్స్ కొంచెం నిష్ఠూరంగా స్పందించాడు.



1848 విప్లవ వైఫల్యం తర్వాత 1864-73 మొదటి ఇంటర్నేషనల్ అనబడే దాని కోసం ఆయన ప్రధానంగా జరిపిన రాజకీయ కృషి ఫలించలేదు. ఆయన తన ప్రవాస జీవితంలో సగానికి పైగా బ్రిటన్‌లోనే గడిపాడు గాని అక్కడి రాజకీయ మేధా జీవితంలో ఎలాటి ప్రముఖ స్థానం పొందలేకపోయాడు. ఇవన్నీ నిజమే. కాని, ఆయన మరణానంతరం సాధించిన విజయాలు ఎంత మహత్తరమైనవి! తన మరణం తర్వాత పాతికేళ్లలోనే యూరోపియన్ కార్మిక వర్గం ఆయన పేరిట రాజకీయ పార్టీలు స్థాపించుకుంది. పేరు మరొకటైనా సరే తాము మార్క్స్ నుంచి ఉత్తేజం పొందినట్లు ప్రకటించుకున్నవి ఉన్నాయి. ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగే దేశాలలో ఈ పార్టీలకు 15 నుంచి 47 శాతం వరకూ ఓట్లు వచ్చాయి. ఇందుకు బ్రిటన్ ఒక్కటే మినహాయింపు. 1918 తర్వాత ఈ పార్టీలలో అనేకం ప్రతిపక్షాలుగా ఉండటమే గాక అధికారంలోకి కూడా వచ్చాయి. ఫాసిజం తర్వాత కూడా వీటిలో అధిక భాగం అలాగే ఉన్నాయి. కాకుంటే తమకు మూల స్ఫూర్తి ఎవరనే

విషయంలో అది వరకు చెప్పిందాన్ని వదులుకున్నాయి. ఆ పార్టీలన్నీ ఇప్పటికీ ఉనికిలో ఉన్నాయి. ఈలోగా మార్క్స్ శిష్యులు తృతీయ ప్రపంచంలోని ప్రజాస్వామ్యేతర దేశాలలో విప్లవ బృందాలను ఏర్పరచారు. మార్క్స్ మరణానంతరం 70 ఏళ్లకు కూడా మానవ జాతిలో మూడో వంతు ఆయన భావాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పే పార్టీల నాయకత్వంలోనే పాలించబడుతున్నాయి. ఆయన ఆకాంక్షలు నిజం చేస్తామని చెబుతున్నవి ఇప్పటికీ 20 శాతం ఉన్నాయి. కాకపోతేకొన్ని స్వల్ప మినహాయింపులున్నా ఆ దేశాల నాయకులు విధానాలను నాటకీయంగా మార్చేసుకున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే 20వ శతాబ్దంపై చెరిగిపోని ప్రధాన ముద్ర వేసిన ఒక ఆలోచనాపరుడు ఎవరైనా ఉన్నారంటే అది ఆయనే. ఇప్పుడు హై గేట్ శ్మశాన వాటికలోకి పదండి. అక్కడ పంధొమ్మిదవ శతాబ్దపు మార్క్స్‌నూ, హెర్బర్ట్ స్పెన్సర్‌నూ సమాధి చేశారు. చాలా విచిత్రంగా అవి దగ్గర దగ్గరగా ఉంటాయి. ఈ ఇద్దరూ బతికివున్న కాలంలోకి వెళ్తే స్పెన్సర్‌ను తన కాలపు అరిస్టాటిల్ అన్నారు. కారల్ మార్క్స్ తన స్నేహితుడి డబ్బులతో హాంప్‌స్టెడ్ పల్లపు ప్రాంతాల్లో బతకాల్సి వచ్చింది. ఈ రోజున స్పెన్సర్ సమాధి ఎక్కడుందో కూడా ఎవరికీ తెలియదు. కాని, జపాన్, ఇండియా వంటి దేశాల నుంచి వయోధికులైన పర్యాటకులు వచ్చి కారల్ మార్క్స్ సమాధిని సందర్శించి వెళుతుంటారు. బ్రిటన్‌లో ప్రవాస జీవితం గడిపి మరణించే ఇరాకీ, ఇరానీ కమ్యూనిస్టులు మరణానంతరం తమ దేహాలను మార్క్స్ సమాధి పక్కనే ఖననం చేయాలని గట్టిగా చెబుతుంటారు.

**1990లలో ప్రపంచీకరణ తర్వాత రూపుదాల్చిన పెట్టుబడిదారీ ప్రపంచం అనేక కీలకమైన విషయాలలో మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన దాన్ని పోలివుంది. 1998లో ఆ చిన్న కరపత్రం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచమంతటా వ్యక్తమైన ప్రతిస్పందన ఈ విషయాన్ని తేటతెల్లం చేసింది. యాదృచ్ఛికంగా ఆ ఏడాది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నాటకీయమైన కుదుపునకు గురైంది.**

సోవియట్ యూనియన్ పతనంతో కమ్యూనిస్టు ప్రభుత్వాలూ, ప్రజా బాహుళ్య కమ్యూనిస్టు పార్టీల శకం అంతరించింది. చైనా, ఇండియా వంటి చోట్ల ఆ పార్టీలు మనుగడ సాగిస్తున్నా పాత లెనినిస్టు తరహా మార్క్సిజాన్ని వదలిపెట్టాయి. అది పతనమైనప్పుడు కారల్ మార్క్స్ మరోసారి నిర్జన ప్రదేశంలో మిగిలిపోయినట్టయింది. కమ్యూనిజం ఒక్కటే ఆయనకు నిజమైన వారసురాలుగా చెప్పబడింది. ఆయన భావాలు దానితోనే అధికాధికంగా గుర్తించబడ్డాయి. 1956లో కృశ్చేవ్ నాయకత్వం స్టాలిన్‌ను తెగనాడిన తర్వాత కూడా అక్కడా ఇక్కడా చోటు సంపాదించుకున్న అసమ్మతివాద మార్క్సిస్టులు లేదా మార్క్సిస్టు లెనినిస్టులు దాదాపుగా మాజీ కమ్యూనిస్టుల నుంచి విడిపోయిన వారే. కాబట్టి ఆయన శతవర్ధంతి తర్వాత మొదటి ఇరవయ్యేళ్ల లోనూ ఆయన దాదాపుగా గత కాలపు వ్యక్తిగా మారి పోయాడు. తన గురించి పెద్దగా పట్టించుకో వలసిన అవసరం లేదనే భావం వచ్చింది. ఈ రోజు రాత్రి జరుగుతున్న ఈ చర్చ మార్క్స్‌ను 'చరిత్ర చెత్తబుట్ట' నుంచి పైకి లేపే ప్రయత్నమని కూడా వ్యాఖ్యానించారు. అయినా సరే ఈ రోజున మార్క్స్ మరోసారి తన ప్రాధాన్యత నిలుపుకోగలిగాడు. 21వ శతాబ్దపు ఆలోచనా పరుడుగా ముందుకొచ్చాడు.

బిబిసి పోలింగులో బ్రిటిష్ రేడియో శ్రోతలు ఆయనను చరిత్రలోనే అతి గొప్ప తత్వవేత్తగా ఎన్నుకున్నారనే వార్తలకు ఏమంత గొప్ప ప్రాధాన్యత ఇవ్వనవసరం లేదని నేననుకుంటాను. కాని మీరు గనక గూగుల్‌లో ఆయన పేరు కొడితే ఆయన మహత్తర మేధావంతుల కోవలో ఉంటాడు. డార్విన్, ఐన్‌స్టీన్ మాత్రమే ఆయనకన్నా ముందుంటారు. కాని మార్క్స్ ఆడం స్మిత్, ఫ్రాయిడ్‌ల కన్నా పైనే ఉంటాడు. నా ఉద్దేశంలో ఇందుకు రెండు కారణాలున్నాయి. మొదటిది సోవియట్ యూనియన్‌లో అధికార మార్క్సిజం ముగిసిపోవడం వల్ల మార్క్స్‌ను లెనినిజంతో కలిపి చూడవలసిన అవసరం లేకుండాపోయింది. లెనినిస్టు ప్రభుత్వాల ఆచరణ విధానంగా చూసే అవకాశమూ లేదు. ప్రపంచం గురించి మార్క్స్ చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకోవడానికి ఇంకా అనేకానేక కారణాలున్నాయనేది బాగా స్పష్టమైపోయింది. మరొక కారణం కూడా ఉంది. బహుశా రెండవ కారణం ఇదే. 1990లలో ప్రపంచీకరణ తర్వాత రూపుదాల్చిన పెట్టుబడిదారీ ప్రపంచం అనేక కీలకమైన విషయాలలో మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన దాన్ని పోలివుంది. 1998లో ఆ చిన్న కరపత్రం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచమంతటా వ్యక్తమైన ప్రతిస్పందన ఈ విషయాన్ని తేటతెల్లం చేసింది. యాదృచ్ఛికంగా ఆ ఏడాది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నాటకీయమైన కుదుపునకు గురైంది. చాలా విచిత్రమేమంటే ఈ సారి మార్క్స్‌ను గురించి కనుగొన్నది సోషలిస్టులు కాదు – క్యాపిటలిస్టులే! ఈ వార్షికోత్సవం జరపడానికి సోషలిస్టులు చాలా నిరుత్సాహంలో మునిగివున్నారు. యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమాన పత్రిక సంపాదకుడు నా వ్యాసం కావాలని అడిగినప్పుడు చాలా ఆశ్చర్యపోయిన సంగతి నాకు

గుర్తుకు వస్తుంది. బహుశా ఆ విమాన ప్రయాణీకులలో నూటికి 80 మంది అమెరికన్లయి ఉంటారు. ఆ పాఠకులకు కమ్యూనిస్టు ప్రణాళిక గురించిన చర్చ ఆసక్తి కలిగిస్తుందని ఆయన భావించి ఉంటాడు. నా వ్యాసంలో ఏదైనా ఉపయోగించుకోవచ్చని భావించాడేమో. ఈ శతాబ్ది ముగింపు సమయంలో ఎప్పుడో ఒక విందులో మార్క్స్ గురించి నేను ఏమనుకుంటున్నానని జార్జిసోరెస్ అడగడం మరింత ఆశ్చర్యపోయేలా చేసింది. మా ఇద్దరి అభిప్రాయాల మధ్య ఎంత తేడా ఉంటుందో నాకు బాగా తెలుసు గనక అస్పష్టమైన సమాధానం ఇచ్చాను.' ఈ మనిషి పెట్టుబడిదారీ విధానం ఎలాటిదో నూట యాభై ఏళ్ల కిందటే కనిపెట్టాడని మనం గమనంలో ఉంచుకోవాలి' అని సోరెస్ అన్నాడు. నిజంగానే ఆయన ఆ పని చేశాడు. ఆ తర్వాత కొద్ది కాలానికే చాలా మంది రచయితలు కనీసం నాకు తెలిసినంతవరకూ వారెవరూ కమ్యూనిస్టులు కాదు – మార్క్సును మరోసారి నిశితంగా చదవడం మొదలుపెట్టారు. జేక్స్ అతాలీ మార్క్స్ జీవితంపైన, రచనలపైన కొత్తగా వెలువరించిన పుస్తకం అలాంటిదే. ఈ ప్రపంచం ఇప్పుడున్న దానికంటే మెరుగ్గా ఉండాలని కోరుకునే వారందరికీ మార్క్స్ చాలానే వదలివెళ్లాడని అట్టాలీ కూడా అభిప్రాయపడ్డాడు. ఈ కోణం నుంచి చూసినా ఈ రోజున మనం మార్క్సును పరిగణనలోకి తీసుకోకతప్పదు.

2008 అక్టోబరులో లండన్ ఫైనాన్షియల్ టైమ్స్ 'కంపిస్తున్న పెట్టుబడిదారీ విధానం' అనే పతాక శీర్షికనిచ్చింది. ప్రజా రంగంలో మార్క్స్ పునరాగమనం గురించి ఇంకా ఏమైనా సందేహాలుంటే దాంతో పటాపంచలై పోయినట్టే. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం 1930ల తర్వాత ఎన్నడూ లేనంత ఘోరమైన విచ్ఛిన్నాన్ని ఎదుర్కొంటుంటే ఆయన దాన్నుంచి నిష్క్రమించ డమనే ప్రసక్తి ఉండదు. మరో వైపున చూస్తే 21వ శతాబ్ది మార్క్స్ 20వ శతాబ్ది నాటి మార్క్సుకన్నా చాలా భిన్నంగా ఉండటం తథ్యం. గత శతాబ్దిలో ప్రజలు మార్క్స్ గురించి ఆలోచించడానికి మూడు వాస్తవాలు ప్రాతిపదిక అయ్యాయి. మొదటిది – విప్లవం ఎజెండాలోకి వచ్చిన దేశాలకు, రాని దేశాలకు మధ్యన ఒక తేడా. స్థూలంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిన ఉత్తర అట్లాంటిక్, పసిఫిక్ ప్రాంతాలు, తక్కినవీ. ఇక రెండవ వాస్తవం మొదటి దాన్నుంచే ఉత్పన్నం అవుతుంది: మార్క్స్ వారసత్వం సహజంగానే సోషల్ డెమొక్రటిక్ సంస్కరణ వాద వారసత్వం గానూ, విప్లవ వారసత్వంగానూ విడిపోయింది. ఈ రెండవ తరహాలో రష్యా విప్లవం అత్యధిక ప్రాబల్యం వహిం చింది. 1917 తర్వాత ఇది మరింత స్పష్టం కావడానికి ఇప్పుడు చెప్పే మూడవ కారణం దారితీసింది: పందొమ్మిదవ శతాబ్ది పెట్టుబడి దారీ విధానం, బూర్జువా సమాజం కుప్ప కూలాయి. దీన్నే నేను 'ప్రళయాంతక యుగం' అని పిలిచాను. ఇది 1914–1940ల మధ్య దశ. ఈ సంక్షోభం ఎంత తీవ్రమైనదంటే అనేక మంది అసలు పెట్టుబడిదారీ విధానం మళ్లీ కోలుకుంటుందా అని సందేహంలో పడ్డారు. ఎంత మాత్రం మార్క్సిస్టు కాని జోసెఫ్ షుంపీటర్ కూడా 1940లలో ఈ వ్యవస్థ స్థానంలో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ వచ్చేస్తుందని జోస్యం చెప్పలేదా? వాస్తవంలో పెట్టుబడిదారీ విధానం తిరిగికోలుకున్నది. కాని పాతరూపంలో కాదు. అదే సమయంలో సోవియట్ యూనియన్‌లో ఒక సోషలిస్టు ప్రత్యామ్నాయం ప్రత్యక్షమై దుర్భేద్యంగా గోచరిం చింది. 1929–1960 మధ్య కాలంలో అలా భావించడం నిర్హేతుకంగా కనిపించలేదు. ఆ ప్రభుత్వాల రాజకీయాలతో ఏకీభవించని అనేకమంది సోషలిస్టేతరులకు కూడా పెట్టుబడి దారీ విధానపు సరుకు అయిపోతున్నదనీ సోవియట్ యూని యన్ అంతకన్నా అధిక ఉత్పత్తి సాధించవచ్చునని అనిపిం చింది. స్పుత్నిక్‌ను ప్రయోగించే సంవత్స రంలో ఇదేమీ అర్థరహి తంగా కనిపించలేదు. 1960 తర్వాత అందులోని అసంబద్ధత బాగా తెలిసిపోయింది. ఈ సంఘటనలు, వాటి పర్యవసానాలు చాలా ప్రభావం చూపించాయి. మార్క్స్ ఎంగెల్సుల మరణానంతర కాలపు సిద్ధాంతం ఆచరణలకు సంబంధించి ఆ ప్రభావం చూడవలసి ఉంటుంది. మార్క్స్ స్వీయాను భవాలు అంచనాల పరిధిని దాటి ఉండే విషయాలవి. 20వ శతాబ్దపు మార్క్సిజంపై మన తీర్పు మార్క్స్ తనుగా ఏమనుకున్నాడనే దానిపై ఆధారపడి ఉండదు. ఆయన రచనలకు మరణానంతర భాష్యాలు ఏమిటనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఒక విషయం మాత్రం మనం ఖచ్చితంగా చెప్పొచ్చు. 1890లలో మొదటి సారి మార్క్సిజం మేధోపరమైన సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. వారు మొదటి తరం మార్క్సిస్టులు. ఆయనతో, అంతకంటే కూడా ఫ్రెడరిక్ ఎంగెల్సుతో వ్యక్తిగత సంబంధం గలవారు. ఇరవయ్యవ శతాబ్దంలో ముందుకు వచ్చిన కొన్ని సమస్యలను గురించి మరీ ముఖ్యంగా రివిజనిజం, సామ్రాజ్యవాదం, జాతీయవాదం వంటి వాటి గురించి చర్చిం చడం మొదలు పెట్టారు. తర్వాతి కాలంలో జరిగిన మార్క్సిస్టు చర్చలో చాలా భాగం ఇరవయ్యవ శతాబ్దికి నిర్దిష్టంగా వర్తించేది. కారల్ మార్క్స్‌లో అది కనిపించదు. ముఖ్యంగా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంటుంది ఎలా ఉండాలి అనే సంవాదం. అది 1914–18 యుద్ధ ఆర్థిక వ్యవస్థల అనుభవం నుంచి, యుద్ధానంతర కాలంలో ముందుకొచ్చిన విప్లవ తరహా లేక విప్లవ సంక్షోభాల నుంచి ప్రధానంగా రూపు దాల్చింది.

ఆ విధంగా చూస్తే సోషలిజం ఒక వ్యవస్థగా పెట్టుబడిదారీ విధానం కన్నా శ్రేష్టమైందనీ, ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని అత్యంత వేగవంతం చేస్తుందని చెప్పుకోవడం మార్క్స్ నుంచి ఎంత

మాత్రం జరిగివుండేది కాదు. యుద్ధాల మధ్యకాలంలో వచ్చిన పెట్టుబడిదారీ సంక్షోభం సోవియట్ యూనియన్ పంచవర్ష ప్రణాళికలను తాకినప్పుడు వచ్చిన అభిప్రాయమది. వాస్తవానికి మార్క్స్ చెప్పింది ఉత్పత్తిని పెంచడంలో పెట్టుబడిదారీ విధాన సామర్థ్యం దాని చివరి అంచులకు చేరుకున్నదని కాదు. పెట్టుబడిదారీ విధానపు గజిబిజి అధిక ఉత్పత్తికి సంబంధించి నిర్ణీత కాలంలో సంక్షోభాలు తీసుకొస్తుందని ఆయన చెప్పాడు. ఇవి కాస్త ముందో వెనకో ఇక పెట్టుబడిదారీ విధానంలో ఆర్థిక వ్యవస్థను నడపలేని స్థితిని తీసుకువస్తాయనీ, అది పరిష్కరించ లేని సామాజిక ఘర్షణలు తలెత్తడానికి కారణమవు తాయని పేర్కొన్నాడు. తర్వాతి దశలో రావలసిన సామాజిక ఉత్పత్తి అనే విధానాన్ని తీసుకురాగల శక్తి స్వతస్సిద్ధంగానే పెట్టుబడిదారీ వ్యవస్థకు ఉండదు. కనుక అది సోషలిస్టు వ్యవస్థగా ఉండటం అనివార్యం. ఇలా చెప్పాడు గనక ఇరవయ్యవ శతాబ్దంలో కారల్ మార్క్స్ గురించిన చర్చలలో, అంచనాలలో సోషలిజం కీలకాంశంగా ఉండటం ఆశ్చర్యకరం కాదు. సోషలిజం గురించి చెప్పింది మార్క్స్ ఒక్కరే కావడం వల్ల కాదు ఇలా జరిగింది. అది నిజం కాదు కూడా. మార్క్స్ వల్ల ఉత్తేజం పొందిన పార్టీలు అలాటి కార్యక్రమాన్ని తమదిగా స్వీకరిం చాయి. కమ్యూనిస్టులైతే తాము సోషలిజాన్ని స్థాపించామని కూడా ప్రకటించారు. 20వ శతాబ్దపు ఈ రూపంలోనైతే సోషలిజం మరణించింది. సోవియట్ యూనియన్‌లోగానీ, ఇతర కేంద్ర ప్రణాళికాయుత ఆర్థిక వ్యవస్థలలో గానీ వర్తింపచేసిన సోషలిజం–సైద్ధాంతికంగా చెప్పాలంటే మార్కెట్ రహిత, ప్రభుత్వ యాజమాన్య నియంత్రిత ఆదేశిత ఆర్థిక వ్యవస్థలు అంతరించాయి. అవి మళ్లీ పునరుద్ధరించబడవు. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలను నిర్మించాలనే సోషల్ డెమోక్రటిక్ ఆకాంక్షలు ఎప్పుడూ భవిష్యత్తుకు సంబంధించినవే. అయితే శు ద్ధ ఆకాంక్షలుగా చూసినా అవి ఈ శతాబ్దాంతానికి వదలి వేయబడ్డాయి. సోషల్ డెమోక్రాట్ల మనసుల్లో ఉన్న లేదా కమ్యూనిస్టు ప్రభుత్వాలు స్థాపించిన సోషలిజం నమూనాలు ఎంత వరకూ మార్క్సు నమూనాలుగా చెప్పొచ్చు? ఇక్కడ ముఖ్యమైన విషయమేమంటే సోషలిజంలో ఆర్థిక వ్యవస్థల గురించి సంస్థలు ఎలా ఉండాలో చెప్పేపని మార్క్స్ ఉద్దేశపూర్వ కంగానే మానుకున్నాడు. ఇక కమ్యూనిస్టు సమాజ రూపు రేఖల గురించి అసలేమీ చెప్పలేదు. అది ఏదో ఒక పథకం ప్రకారం నిర్మించదగిన లేదా ముందుగా నిర్దేశించ దగినది కాదని మాత్రం చెప్పాడు. అది సోషలిస్టు సమాజం నుంచి ఉద్భవి స్తుందని చెప్పి ఊరుకున్నాడు. జర్మన్ సోషల్ డెమోక్రాట్ల గోథా కార్యక్రమ విమర్శన వంటి రచనల్లో పేర్కొన్న ఇలాటి సాధారణ వ్యాఖ్యానాల ద్వారా మార్క్స్ తన వారసులకు నిర్దిష్ట నిర్దేశకత్వం ఇచ్చింది లేదు. ఈ విషయాలపై లోతుగా ఆలోచించే పని పెట్టుకోలేదు. ఎందుకంటే విప్లవం జయప్రదమయ్యేలోగా వీటిని ఆలోచించడం కేవలం పండిత తతంగమో, ఊహాజనిత కసరత్తో అవుతుందని భావించారు. లేబర్ పార్టీ నిబంధనావళి లో చాలా ప్రసిద్ధమైన నాల్గవ అధికరణం ఇక్కడ ఉటంకించవ చ్చు.' ఉత్పత్తి సాధనాలపై సమిష్టి యాజమాన్యం'పై ఇది ఆధార పడి ఉంటుందని మాత్రం చెప్పారు. అంటే దేశంలో పరిశ్రమల ను జాతీయం చేయడం ద్వారా ఈ లక్ష్యం సాధించవచ్చునని సాధారణంగా అర్థం చేసుకున్నారు. కేంద్రీకృత సోషలిస్టు నమూ నాకు సంబంధించిన తొలి సిద్ధాంతం రూపొందించిన వారు సోషలిస్టులు కాక, సోషలిస్టేతరులు కావడం చాలా ఆశ్చర్యకర మైన విషయం. ఇటాలియన్ ఆర్థికవేత్త ఎన్రికో బరోన్ 1908లో దాన్ని రూపొందిచారు. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత ప్రైవే టు పరిశ్రమలను జాతీయం చేయడం అనే ప్రశ్న మొదటిసారి గా రాజకీయ పార్టీల ఎజెండాలోకి వచ్చే వరకూ ఎవరూ దాన్ని గురించి ఆలోచించి వుండలేదు. ఆ సమయంలో సోషలిస్టులు గతం నుంచి ఎలాంటి నిర్దేశకత్వం లేకుండానే తమ ముందుకు వచ్చిన సమస్యలను ఎదుర్కోవలసిన స్థితిలో పడ్డారు.

సామాజిక నిర్వహణలో సాగే ఏ విధమైన ఆర్థిక వ్యవస్థలో

**చరిత్ర సాధారణ గమనంలో ఏదో ఒక చోట ఉండాలని కోరుకునే వారంతా మార్క్సిస్టు వర్గీకరణను లేదా దాని మరో రూపాన్ని ఆశ్రయించవలసిందే. ఎందుకంటే అవి గాక అందుబాటులో ఉన్న ఇతర ప్రత్యామ్నాయాలేవీ అక్కరకు వచ్చేవి కావు. 21వ శతాబ్దంలో ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాలేమిటో మనం జోస్యం చెప్పలేము. వాటిని ఎదుర్కోవడంలో విజయం సాధించే అవకాశం ఉండాలంటే మార్క్స్ లేవనెత్తిన ప్రశ్నలను ముందుకు తీసుకురాకుండా జరగదు.**

నైనా 'ప్రణాళిక' అనేది భాగంగా ఉంటుంది. అయితే మార్క్స్ దాని గురించి నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదు. విప్లవానంతర రష్యా లో దాని అమలు ప్రారంభించినపుడు అది చాలా మెరుగు పర్చాల్సిన స్థితిలో ఉంది. సైద్ధాంతిక సాధనాలైన దృక్పథాల ద్వారా (లియాంటివ్ ఇన్‌పుట్ ఔట్‌పుట్ విశ్లేషణ వంటివి), అలాగే తగు గణాంకాలు అందించడం ద్వారా ఇది జరిగింది. ఈ పరికరాలను తర్వాత సోషలిస్టేతర దేశాలలో విస్తారంగా ఉపయోగించారు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం అదే స్థాయిలో దెబ్బతిన్న యుద్ధ ఆర్థిక వ్యవస్థలను అనుసరించడం ద్వారా ఇది జరిగింది. ముఖ్యంగా జర్మనీని, ప్రత్యేకంగా అక్కడున్న విద్యుత్ పరిశ్రమను అనుసరించారు. జర్మన్ అమెరికన్ విద్యుత్ సంస్థల నిర్వాహణాధికారులలోని రాజకీయ సానుభూతిపరులు లెనిన్‌కు వాటి గురించిన సమాచారం ఇచ్చారు. సోవియట్‌లో ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థకు

ప్రాథమిక నమూనాగా నిలిచింది యుద్ధ ఆర్థిక వ్యవస్థే. అంటే దీని అర్థం అలాటి దానిలో ముందుగానే కొన్ని లక్ష్యాలు నిర్ణయించబడతాయి. కృత్రిమ వేగంతో పారిశ్రామికీకరణ, యుద్ధంలో గెలవడం, అణుబాంబు తయారీ లేదా మనిషిని చంద్రునిపైకి పంపడం వంటి లక్ష్యాలు పెట్టుకుని వాటి సాధన కోసం ప్రణాళికలు వేసి వనరులు కేటాయించడం జరుగుతుంది. దీనివల్ల తాత్కాలికంగా కలిగే నష్టం ఏమైనా కావచ్చు. ఇందులో ప్రత్యేకించి సోషలిస్టు తరహాగా చెప్పదగిందేమీ లేదు. ముందే నిర్ణయించుకున్న లక్ష్యాల సాధన కోసం కాస్త ఎక్కువ తక్కువ ఆధునీకరణతో కృషి చేయవచ్చు. అయితే సోవియట్ ఆర్థిక వ్యవస్థ ఈ దశను దాటి ముందుకు పోయింది లేదు. 1960ల తర్వాత అలాటి ప్రయత్నం జరిగింది గాని అదో విధమైన సంకట పరిస్థితి (క్యాచ్22 స్థితి) మార్కెట్లను నిరంకుశాధికార ఆదేశిత చట్రంలో ఇమిడ్చే పద్ధతి అమలైంది. కనుక సోషల్ డెమోక్రసీ అనేది మార్క్సిజాన్ని భిన్నమైన పద్ధతిలోకి మార్చింది. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్ని వాయిదా వేయడమో లేక సానుకూల పద్ధతిలో చెప్పాలంటే భిన్న తరహాల మిశ్రమ ఆర్థిక వ్యవస్థలను ప్రయోగించడమో జరిగింది. పూర్తిగా సోషలిస్టు తరహా ఆర్థిక వ్యవస్థ నిర్మించాలని కోరుకున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీలకు సంబంధించినంత వరకూ అవి ఒక విధంగా ఆలోచించుకోవలసిన అవసరాన్నిది కల్పించింది. చాలా ఆసక్తికరమైన అలాటి ఆలోచనలు చేసిన వారిని చెప్పుకోవాలంటే మార్క్సిస్టేతర చింతనాపరులైన ఫెబియన్ సిడ్నీ, బియాట్రిస్ వెబ్ వంటి వారు. పెట్టుబడిదారీ విధానం నుంచి సోషలిజానికి క్రమానుగత మార్పును వారు సూచించారు. దీనికోసం వారు తిరుగులేనివైన, పరస్పర సహాయకమైన అనేక సంస్కరణల పరంపర ప్రతిపాదించారు. అందువల్లనే సోషలిజంకు సంబంధించిన యంత్రాంగాల కల్పనపై కొన్ని రాజకీయ ఆలోచనలు చేశారు. అయితే ఇందులో ఆర్థిక సంబంధమైనవేమీ లేవు. ఇక ప్రధాన మార్క్సిస్టు 'రివిజనిస్టు' అయిన ఎడ్వర్డ్ బెర్న్‌స్టీన్ విషయానికి వస్తే ఆయన సంస్కరణవాద ఉద్యమమే సర్వస్వమనీ, అంతిమ లక్ష్యం అనేదానికి వాస్తవికత లేదని ప్రకటించాడు.

వాస్తవానికి మొదటి ప్రపంచయుద్ధం తర్వాత చాలా దేశాలలో ప్రభుత్వాధికారంలోకి వచ్చిన అనేక సోషల్ డెమోక్రటిక్ పార్టీలు రివిజనిస్టు విధానాన్నే చేపట్టాయి. అంటే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను దాని మానానికి దాన్ని వదిలివేసి కార్మికులకు సంబంధించిన ఏవో కొన్ని కోర్కెలు నెరవేర్చడానికే పరిమితమైనారు. ఆంటోనీ క్రాస్‌లాండ్ రాసిన సోషలిజం భవిష్యత్తు (1956) అనే గ్రంథం ఇలాటి ధోరణులకు ప్రామాణిక ఉదాహరణగా చెప్పవచ్చు. 1945 తర్వాత పెట్టుబడిదారీ విధానం దేనికీ లోటు లేని సమాజాన్ని సృష్టించిందని ప్రకటించారు. కనుక ప్రభుత్వరంగ సంస్థలు(జాతీయకరణ తరహాలో గాని లేక మరో విధంగా గాని) అవసరమే లేదన్నారు. జాతీయ సంపద న్యాయంగా పంపిణీ అయ్యేట్టుచూడటమే సోషలిస్టుల బాధ్యత అని ఆయన భావించాడు. ఇది మార్క్స్ నుంచి బాగా దూరమైన భావన. సంప్రదాయ సోషలిజం భావించినట్టుగా మార్కెట్ రహిత సోషలిజం గురించిన ఆలోచనలకు కూడా ఇది చాలా భిన్నం. బహుశా ఈ సంప్రదాయభావననే మార్క్స్ కూడా భాగం పంచుకుని ఉండేవాడు. దీనికి నేను ఇటీవలి మరొక వివాదాన్ని కూడా తోడు చేస్తాను. ఆర్థిక రంగంలో నయా ఉదార వాదులకూ వారి విమర్శకులకూ మధ్య ప్రభుత్వ రంగ సంస్థల పాత్రపై వివాదం నడుస్తున్నది. ఇది నిజానికి మార్క్సిస్టులకే పరిమితమైన చర్చ కాదు, అసలు సూత్రరీత్యా ఇది సోషలిస్టు చర్చ కానే కాదు. 1970ల నుంచి సమాన వాణిజ్యావకాశం అనే సూత్రం దారుణంగా దిగజారిపోయిన ఫలితంగానే ఈ చర్చ ముందుకు వచ్చింది. ఒక ఆర్థిక వాస్తవంగా మారిన ఈ సూత్రం చివరకు లాభార్జనా దాహం గల సంస్థలపై ఎలాంటి నియం త్రణలు లేదా అదుపు లేకుండాపోవడానికి కారణమైంది. మానవ సమాజాన్ని ఏదో స్వయం నియంత్రణ (గలదని చెప్పబడుతున్న), అంతులేని సంపద సృష్టించే మార్కెట్లకు అప్పగించడానికి ఇది దారి తీసింది. సంపదతో పాటు సంక్షేమం కూడా గరిష్టంగా ఉంటుందనే వాదనలు వచ్చాయి. తమ ప్రయోజనాల కోసం సంబంధిత పాత్రధారులు హేతుబద్ధంగా దీన్ని నడిపిస్తారని చెప్పబడుతున్నది. నిజానికి పెట్టుబడిదారీ విధానపు ఏ దశలో కూడా ఏ దేశంలో కూడా ఇలాటిది లేనేలేదు. ఆఖరుకు అమెరికాలో కూడా లేదు. ఇది అర్థం లేని వ్యవహారం. ఆడంస్మిత్‌కు సిద్ధాంత కారులు చెప్పిన విపరీత భాష్యం ఇది. అలాగే బోల్షివిక్కులు ఏ విధంగా మార్క్స్ అంటే నూరు శాతం ప్రభుత్వ ప్రణాళికాయుత ఆదేశిత ఆర్థిక వ్యవస్థ అని చెప్పారో ఇదీ అంతే. ఈ మార్కెట్ ఛాందసం ఆర్థిక వాస్తవం కన్నా అంధవిశ్వాసంగానే ఉంది గనక అదీ విఫలమైంది. ఈ విధంగా కేంద్ర ప్రణాళికాబద్ధ, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థలు అదృశ్యమైపోయాయి. నిరుత్సాహానికి గురైన సోషల్ డెమోక్రాట్ల ఆకాంక్షల నుంచి సమాజాన్ని మౌలికంగా పరివర్తన చేయడమనే లక్ష్యం మటుమాయమైంది. దీనివల్లనే 20వ శతాబ్దపు సోషలిజం వాదనలు చాలా వరకూ నిర్మూలనైపోయాయి. ఇవన్నీ మార్క్సు పేరిట జరిగినా, ఆయన ఉత్తేజం వీటి వెనక ఉన్నా వాటి సారాంశం మాత్రం ఆయనకు కొంచెం దూరంగా ఉంటుంది. అయితే మార్క్స్ మూడు విధాలుగా మహత్తర శక్తిగా మిగిలిపోయాడు: ఒక ఆర్థిక ఆలోచనాపరుడుగా, ఒక చారిత్రిక ఆలోచనాపరుడు, విశ్లేషకుడుగా, సమాజం గురించిన నూతన ఆలోచనా ధోరణికి ఒక వ్యవస్థాపక పితామహుడుగా (దర్క్‌హీం మాక్స్ వెబర్‌లతో పాటు) నిలిచి

పోయాడు. ఒక తత్వవేత్తగా ఆయన కొనసాగుతున్న తీరుపైన, దాని ప్రాధాన్యతపైన అభిప్రాయం వ్యక్తం చేసే అర్హత నాకు లేదు. ఎప్పటికీ సమకాలీన ప్రాధాన్యత కోల్పోని అంశం మార్క్స్ దార్శనికత. మానవ ఆర్థిక వ్యవస్థ చరిత్రలో పెట్టుబడిదారీ విధానం ఒక తాత్కాలిక ఘట్టం మాత్రమేనని ఆయన చెప్పిన మాట యథార్థమైంది. అది ఏ విధంగా ఎప్పటికప్పుడు విస్తరిస్తూ కేంద్రీకరిస్తూ, సంక్షోభాలు సృష్టిస్తూ, తనను తాను మార్పు చేసుకునే ప్రక్రియలపై ఆయన విశ్లేషణ నిలిచేవుంటుంది.

21వ శతాబ్దంలో మార్క్స్ ప్రాధాన్యత ఏమిటి? ఇప్పటి వరకూ సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు జరిగిన ఒకే ఒక ప్రయత్నం సోవియట్ తరహాకు చెందిందే. అది ఇప్పుడు ఎంత మాత్రం ఉనికిలో లేదు. మరో వైపున ప్రపంచీకరణ అనేదాని ప్రగతి అపారంగా అమిత వేగంతో ముందుకు పోతున్నది. మానవుల సంపద సృష్టి సామర్థ్యం చెలరేగి పోతున్నది. జాతి రాజ్యాల ఆర్థిక, సామాజిక అధికార పరిధిని ఇది కుదించివేసింది. ఈ కారణంగా సోషల్ డెమోక్రాట్ల సంప్రదాయ విధానాలు కూడా దెబ్బతిన్నాయి. ఎందుకంటే ఆ పార్టీలు ప్రధానంగా తమ ప్రభుత్వాలపై సంస్కరణల కోసం ఒత్తిడి తేవడం ఆధారంగా పనిచేస్తాయి. మార్కెట్ ఛాందసం బాగా ప్రాబల్యం పొందింది గనక దేశాల మధ్య, ప్రాంతాల మధ్య విపరీతమైన ఆర్థిక వ్యత్యాసాలను సృష్టించింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో పాతకాలపు వినాశకర ప్రళయ పరంపరకు మళ్లీ తెర తీసింది. ఇందులో భాగంగా 1930లలో వచ్చిన ప్రపంచపు అతి పెద్ద సంక్షోభ లక్షణాలు కూడా ఇందులో కనిపిస్తున్నాయి. మన ఉత్పత్తి సామర్థ్యం వల్లనే ఈ పరిస్థితి సాధ్యమైంది. కనీసం అలాటి అవకాశాలు కనిపిస్తున్నాయనైనా చెప్పొచ్చు. మనుషులలో అత్యధికులు అవసరాల పరిధి నుంచి సంపద, చదువు, ఊహాతీతమైన జీవితపు ఎంపిక అవకాశాలు చూస్తున్నారు. ప్రపంచ జనాభాలో చాలా మంది ఇంకా ఈ స్థితిలోకి రావలసే ఉందన్న మాట నిజమే. అయినా ఇరవయ్యవ శతాబ్దిలో అత్యధిక కాలం సోషలిస్టు ఉద్యమాలూ, ప్రభుత్వాలూ అవసరాల పరిధిలోనే ప్రధానంగా పనిచేయవలసి వచ్చింది. పాశ్చాత్య ప్రపంచంలోని సంపన్నదేశాలు 1945 తర్వాతి ఇరవై ఏళ్లలో గాని సంపద్వంతమైన స్థితికి చేరుకోలేదు. ఏమైనా ఇప్పుడు సంపద సమృద్ధి కాలం గనక తగు తిండి, గుడ్డ, గృహం, ఆదాయం, ఉద్యోగం కోసం, ప్రజలను ఈతిబాధల నుంచి కాపాడే సంక్షేమ కార్యక్రమాలు వంటివి అవసరమే గాని అవే సోషలిస్టుల కార్యక్రమంగా సరిపోవు. ఇక మూడో పరిణామం ప్రతికూలమైనది. బ్రహ్మాండమైన ప్రపంచీకరణ ఆర్థిక వ్యవస్థ పర్యావరణాన్ని దెబ్బతీసింది. ఈ హద్దూపద్దూలేని ఆర్థికాభివృద్ధికి పగ్గాలు వేయడం తక్షణావసరంగా ముందుకొస్తున్నది. జీవావరణంపైన మన ఆర్థిక వ్యవస్థ ప్రభావాన్ని అదుపు చేసేందుకోసం ఈ వేగాన్ని నియంత్రించవలసిన అవసరం ఒకవైపు కనిపిస్తుంది. పెట్టుబడిదారీ మార్కెట్ అవసరాల కోసం ఈ పెరుగుదలను గరిష్ట స్థాయికి చేర్చవలసిన అవసరం మరో వైపు కనిపిస్తున్నది. ఈ రెంటి మధ్యనా ఘర్షణ వస్తుంది. ఇది పెట్టుబడిదారీ విధానపు ఆయువు పట్టు. దీన్ని ఏ బాణం కొడుతుందో మనకు ఇంకా తెలియదు. అందువల్ల మనం ఈ రోజున కారల్ మార్క్సును ఎలా చూడాలి? మానవాళిలో ఒక భాగానికి గాక మొత్తం తరపున ఆలోచించిన వ్యక్తిగా చూడొద్దా? తప్పక అలాగే చూడాలి. ఒక తత్వవేత్తగానా? ఒక ఆర్థిక విశ్లేషకుడుగానా? ఒక ఆధునిక సామాజిక శాస్త్ర వ్యవస్థాపక పితామహుడుగా మానవ చరిత్రను అర్థం చేసుకోవడానికి మార్గం చూపిన వ్యక్తిగానా? నిజం. అయితే అట్టాలీ చెప్పినట్టుగా ఆయన ఆలోచనలకు విశ్వజనీన అన్వయం ఉంటుంది. మామూలుగా చెప్పేట్టు అది భిన్న శాఖల మధ్య సంధానం చేయడం కాదు, అన్ని విభాగాల సమాహారంగా పనిచేస్తుంది. 'ఆయనకు ముందు తత్వవేత్తలు మనిషిని మొత్తంగా చూశారు. అయితే ప్రపంచమంటే రాజకీయ, ఆర్థిక, సామాజిక, తాత్విక అంశాలన్నీ కలిగివున్నదని మొదటి సారి కనుగొన్న వ్యక్తి ఆయనే' అని అట్టాలి వివరిస్తారు. ఆయన రాసిన దానిలో చాలా భాగం ఈ కాలానికి వర్తించదన్న మాట ఖచ్చితంగా నిజం. అందులో కొంతభాగం ఇప్పుడు ఆమోదయోగ్యం కాదు కూడా. పైగా ఆయన రచనలు సర్వ సంపూర్ణ రూపం తీసుకోలేదన్న మాట కూడా నిజం. కాని ఆయన పేరిట గల అలోచనలన్నీ కూడా అనంతమైన అభివృద్ధి వైపు సాగిపోతుంటాయి. వ్యవస్థాగతంగా పెంచిన ఛాందసాలను అలా ఉంచి మరెవరూ కూడా దాన్ని ఒక పిడివాదంగా మార్చడం కుదిరేపని కాదు. ఈ పరిస్థితి తప్పక మార్క్సుకే దిగ్భ్రాంతి కలిగించి ఉండేది. అయితే 'సరైన', 'సరైనది కాని' మార్క్సిజం ఉంటుందనే భావనను కూడా మనం తిరస్కరించాలి. ఆయన చెప్పిన విచారణ తరహా పద్ధతి భిన్నమైన ఫలితాలకు భిన్నమైన పద్ధతులకు అవకాశమిస్తుంది. అసలు మార్క్సుకే ఈ పరిస్థితి ఎదురైంది. బ్రిటన్‌లో, నెదర్లాండ్స్‌లో సోషలిజానికి శాంతియుత పరివర్తన జరగవచ్చుని ఆయన అనుకున్నాడు. రష్యాలోనైతే గ్రామీణ సమాజం నుంచి సోషలిజంలోకి పరివర్తన జరగవచ్చని భావించాడు. కనుక ప్లెఖనోవ్, లెనిన్ ఆయన ఆలోచనలకు ఎంత వారసులో కాట్స్కీ, బెర్న్‌స్టీన్ కూడా అంతే ఎక్కువ (లేదా మీకు నచ్చకపోతే అంత తక్కువ) వారసులుగా ఉంటారు. కనుకనే అట్టాలీ నిజమైన మార్క్సుకూ తర్వాత ఆయన ఆలోచనలను సులభతరం చేసిన లేదా వక్రమార్గం పట్టించిన వారి జాబితాలో పేర్కొన్న ఎంగెల్సు, కాట్స్కీ ,లెనిన్ తదితరులకూ మధ్యన పెద్ద తేడా చూపించడం పట్ల నాకు సందేహాలున్నాయి. పెట్టుబడిని మొదటి సారి తీవ్రంగా చదివి పశ్చిమ దేశాల తరహాలో తమ వెనుకబడిన తనం నుంచి

ఆధునీకరణ వైపు వెళ్లవచ్చని రష్యన్లు కోరుకున్నారు. అది వారికి న్యాయం. అదే సమయంలో సాక్షాత్తూ మార్క్స్ రష్యా గ్రామీణ సమాజం నుంచి పెట్టుబడిదారీ విధానానికి నేరుగా వెళ్లిపోవడం సాధ్యమేనేమో అని భావించాడు. అది కూడా అంతే న్యాయం. నిజంగా ఏదైనా ఉందంటే అది సాధారణ మార్క్స్ ఆలోచనా ధోరణిలోనే ఉంది. ప్రపంచమంతా సోషలిజం వచ్చాకే రష్యాలో సోషలిజం నిర్మాణం చేపట్టివుండాల్సిందని ఆ విప్లవంపై విమర్శ చేయడం కుదరదు. మార్క్స్ అలా చెప్పలేదు. ఆయన అలా గట్టిగా నమ్మాడని కూడా అనుకోవడానికి ఆధారాలు లేవు. అది కేవలం ఉజ్జాయింపుగా చెప్పే అనుభవవాదం. రష్యా అప్పటికి చాలా వెనకబడిన దేశం గనక సోషలిస్టు తరహాను పోలిన వ్యంగ్యచిత్రం మాత్రమే అందించగల స్థితి. ప్లెఖనోవ్ అదే హెచ్చరిక చేశాడని చెబుతుంటారు. 1917లో రష్యన్ మార్క్సిస్టులలో అత్యధికులతో సహా మొత్తం మార్క్సిస్టుల ఏకాభిప్రాయం అలాగే ఉండేది. మరో వైపున 1890ల నాటి లిబరల్ మార్క్సిస్టులు అట్టాలీ అభిప్రాయం తీసుకున్నారు. అంటే మార్క్సిస్టులు రష్యాలో ప్రధానంగా చేయవలసింది గొప్ప పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించడమనే వైఖరి వారిది. అది కూడా ఆధారరహితమే. జారిజం హయాంలో ఉదారవాద పెట్టుబడిదారీ రష్యా ఏర్పడ్డం అసంభవం. ఇవన్నీ చెప్పుకున్నప్పటికీ మార్క్స్ విశ్లేషణలో అనేక ప్రధానాంశాలు ఇప్పటికి విలువైనవిగానే ఉంటాయి.

మొట్టమొదటిది పెట్టుబడిదారీ అభివృద్ధి విధానపు అంతర్జాతీయ చలన సూత్రాలకు సంబంధించిన తిరుగులేని విశ్లేషణ. ఈ విధానం తన ఎదురుగా వచ్చే ప్రతిదాన్నీ నాశనం చేస్తుంది. కుటుంబ వ్యవస్థలవంటివి ఏవైతే మానవ చరిత్రలో పెట్టుబడిదారీ విధానం పెరుగుదలకు కారణమైనాయో ఆ వారసత్వాలను కూడా వదలకుండా ధ్వంసం చేస్తుంది. రెండవది : పెట్టుబడిదారీ విధానపు పెరుగుదల క్రమంలో ఏర్పడే యంత్రాంగపు అంతర్గత వైరుధ్యాలు. నిరంతరాయమైన ఉద్రిక్తతలు, తాత్కాలిక పరిష్కారాలు. అభివృద్ధి సంక్షోభానికి మార్పునకూ దారితీయడం. ఇవన్నీ కలిసి ఒక ఆర్థిక కేంద్రీకరణకు దారి తీయడం. అది ఒక ప్రపంచీకరించబడిన ఆర్థిక వ్యవస్థగా మారడం. నిర్విరామ విప్లవంతో నిరంతరం తనను తాను పునరుజ్జీవింపచేసుకునే ఒక సమాజం గురించి మావో కలలు కన్నాడు. పెట్టుబడిదారీ విధానం ఈ పథకాన్ని నిజం చేసింది. షుంపేటర్ (మార్క్స్‌ను అనుసరించి) సృజనాత్మక విధ్వంసం అని పిలిచింది దీన్నే. ఈ క్రమం అంతిమంగా అపారమైన కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ స్థాపనకు దారి తీస్తుందని మార్క్స్ భావించాడు. అలా కావలసిందే. ఈ రోజున ప్రపంచంలో ఏం జరగాలన్నది వెయ్యి మంది లేదా పదివేల మంది ఆదేశం ప్రకారం జరుగుతుందని అట్టాలీ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పింది దీని గురించే. ఇది పెట్టుబడిదారీ విధానం అంతానికి దారి తీస్తుందని మార్క్స్ చెప్పిన మాట. ఈ అంచనా నాకు ఇప్పటికీ సాధ్యమయ్యేదిగా కనిపిస్తుంది. కాకపోతే ఆయన ఊహించినట్టు గాక వేరే విధంగా జరగొచ్చు. మరో వైపున ఆయన చెప్పిన జోస్యం మరొకటి ఉంది. దోపిడీ చేసే వారిని దోచుకోవటం అంటూ విస్తార శ్రామిక వర్గం సోష లిజానికి దారి తీస్తుందని ఆయన రాశారు. అయితే ఈ అంచనా చెప్పింది పెట్టుబడిదారీ విధాన యంత్రాంగంపై విశ్లేషణలో భాగంగా గాక మరో ప్రత్యేక అంచనాతో ఆ మాట చెప్పారు. పారిశ్రామికీకరణ కనీస వేతనాలపై ఆధారపడి కాయకష్టం చేసే కార్మికులను తయారు చేస్తుందనీ అప్పుడు ఇంగ్లాండులో జరుగుతున్న దాన్నిచూసి ఆయన చెప్పి ఉండొచ్చు. మధ్య తరహా ఉత్పత్తికి సంబంధించి నంత వరకూ ఇది వాస్తవమే. కాని దీర్ఘ కాలంలో ఇది సరికాదని మనం ఇప్పుడు చూస్తున్నదాన్ని బట్టి చెప్పవచ్చు. అలాగే 1840ల తర్వాత మార్క్స్ ఎంగెల్సులు కూడా పారిశ్రామికీరణ వల్ల జనాలు దివాళా తీసి తాము కోరుకున్న విప్లవకర వాతావరణం వస్తుందని ఆశించలేదు. కార్మిక వర్గం లో విస్తార భాగాలు ఖచ్చితమైన లెక్కల ప్రకారం మరింత పేదలు కావడం లేదని వారు స్పష్టంగానే చూడగలిగారు. నిజం గానే నికరమైన కార్మిక వర్గం గల జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ మహాసభకు 1900లలో హాజరైన అమెరికన్ పరిశీలకుడు అక్కడ కామ్రేడ్స్ దారిద్ర్యానికి ఒకటి రెండు మెట్లపైనే ఉన్నారని రాశాడు. మరోవైపున ప్రపంచం వివిధ ప్రాంతాల మధ్య, వర్గాల మధ్య ఆర్థిక అసమానత పెరగడం కూడా మార్క్స్ చెప్పిన ప్రకారం దోచుకొనే వాడిని దోచుకోవటం అన్నది అనివార్యమయ్యే పరిస్థితిని నివారించింది. క్లుప్తంగా చెప్పాలంటే ఆయన రచనలలో భవిష్యత్తుకు సంబంధించిన ఆశలు కనిపిస్తాయి గాని దాన్నుంచే అవి జరగవు. మూడవది– అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం పొందిన కీశే సర్ జాన్ హిక్స్ మాటల్లో చెప్పుకోవడం అత్యుత్తమంగా ఉంటుంది.' చరిత్ర సాధారణ గమనంలో ఏదో ఒక చోట ఉండాలని కోరుకునే వారంతా మార్క్సిస్టు వర్గీకరణను లేదా దాని మరో రూపాన్ని ఆశ్రయించవలసిందే. ఎందుకంటే అవి గాక అందుబాటులో ఉన్న ఇతర ప్రత్యామ్నాయాలేవీ నిజంగా అక్కరకు వచ్చేవి కావు' 21వ శతాబ్దంలో ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాలేమిటో మనం జోస్యం చెప్పలేము. కాని వాటిని ఎదుర్కోవడంలో విజయం సాధించే అవకాశం ఉండాలంటే మాత్రం అవి తప్పక మార్క్స్ లేవనెత్తిన ప్రశ్నలను ముందుకు తీసుకురాకుండా జరగదు. ఒక వేళ ఇష్టం లేకపోతే ఆయన రకరకాల శిష్యులు ఇచ్చిన జవాబులను అమోదించకుండా తోసివేయొచ్చునేమో గాని ఆయన ముందుకు తెచ్చిన ప్రశ్నలు మాత్రం నిలిచే ఉంటాయి. ❑

**(సీపీఐ (ఎం) ఏపీ వెబ్‌సైట్ సౌజన్యంతో..)**

# ఆమె విప్లవానికి మనసిచ్చింది



- ఎస్.పుణ్యవతి
ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు

- డిసెంబరు 2న జెన్నీ వాన్ వెస్ట్ పాలేన్ వర్ధంతి. ఈనాడు, ఆనాడు కూడా పెట్టుబడిదారుల గుండెల్లో దడపుట్టించే పేర్లల్లో జెన్నీ మార్క్స్ పేరు ఒకటి. జెన్నీ మార్క్స్‌ను ప్రేమించింది. ఆయన జీవిత సహచరి అయింది. రాజకీయాల్లోను సహచర్యం అందించింది. వారి ప్రేమ మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టు మహారాజుల ప్రేమగాథలు, పుక్కిటి పురాణం లాంటిది కాదు. తాజ్‌మహల్ కట్టించిన షాజహాన్, ముంతాజ్‌ల ప్రేమ లాంటిది అసలే కాదు. 'తాజ్‌మహల్ నిర్మాణంలో రాళ్ళెత్తిన కూలీలెవరోరు' అని ప్రశ్నిస్తాడు శ్రీశ్రీ. ఆ కూలీలను శ్రమ దోపిడీ నుంచి విముక్తులను చేసేందుకు అంకితమైన ప్రేమ జెన్నీ- మార్క్స్‌లది.
- ఈ భూతలంలో కొంత మంది తమ కోసమే, తమ విలాసాల కోసమే బతుకుతారు. మరి కొందరు ప్రజల కోసమే బతుకుతారు. తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, రాజకీయ వేత్తలు, ఎంతో మంది మానవాళికి ఎనలేని మేలు చేసిన వాళ్ళు ఉన్నారు. అంటువంటి తత్వవేత్తల్లో గొప్ప తత్వవేత్త కారల్‌మార్క్స్. మార్క్స్ సిద్ధాంతం శ్రామికులను అధికార పీఠంపై కూర్చోపెట్టింది. అట్టి మార్క్స్‌ను వరించింది జెన్నీ. జెన్నీలేని మార్క్స్ లేడు. మార్క్స్‌లేని మార్క్సిజం లేదు. మార్క్సిజం కానిది కార్మిక వర్గ సిద్ధాంతం కాదు. ఆ సిద్ధాంతం లేకుండా శ్రమదోపిడీ నుంచి కార్మిక వర్గానికి విముక్తి లేదు. ఆ సిద్ధాంతకర్తను, ఆయనతోపాటే ఆయన పడ్డ కష్టాలనూ వరించిన జెన్నీ జీవిత విశేషాలు తెలుసుకోవాలి.
- జెన్నీ పూర్తి పేరు జోహన్న బెర్త జూలీ జెన్నీ వాన్ వేస్ట్ ఫాలేన్. 1814 ఫిబ్రవరి 12న జర్మనీలో పుట్టింది. 1881 డిసెంబర్ 2న తన 67వ యేట లండన్‌లో మరణించింది. జెన్నీ తల్లీదండ్రులు ధనవంతులు. జర్మనీని ప్రష్యా అనే వాళ్ళు. జెన్నీ తండ్రి లుడ్విగ్ వాన్ వేస్ట్ ఫాలేన్ రాజోద్యోగి. జెన్నీ సోదరుడు ఎడ్గార్ కారల్‌మార్క్స్ స్నేహితుడు. మరో సోదరుడు ఫెర్డినాండ్ ప్రష్యారాజుకు అత్యంత సన్నిహితుడు, మంత్రి.
- జెన్నీ, కారల్‌మార్క్స్ ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. చదువుల్లో ఆరితేరినవారు. జెన్నీ గొప్ప అందగత్తె. మార్క్స్ తండ్రి అదే పట్టణంలో ప్రముఖ లాయరు. ఆయన, జెన్నీ తండ్రి లుడ్విగ్ మంచి స్నేహితులు. జెన్నీ మార్క్స్ కన్నా నాలుగైదు సంవత్సరాలు పెద్ద. అయినా వారి భావాలు



వారిని దగ్గర చేశాయి. అదే వారి మధ్య ప్రేమకు దారి తీసింది. వారి ప్రేమ మన సినిమాల్లో మాదిరి రసవత్తర ప్రేమ కథ కాదు. శ్రామికవర్గ విముక్తి కోసం అంకితమైన ప్రేమ. కొంత కాలానికి వివాహం చేసుకున్నారు. కార్ల్, జెన్నీలకు ఏడుగురు సంతానం. నలుగురు పిల్లలు పుట్టిన కొంతకాలానికే చనిపోయారు. ముగ్గురు కుమార్తెలు. జెన్నీ, లారా, ఎలియానార్‌లు. అమ్మ నాన్నలాగా కార్మిక, రాజకీయ ఉద్యమాల్లో చేరి తోటి కార్యకర్తలని వివాహం చేసుకున్నారు.

- ఇప్పుడు మనం చెప్పుకుంటున్న కథ 1810-1890 మధ్యకాలంలోది. ఆనాటి సామాజిక రాజకీయ పరిస్థితులు మనకి అర్థం కాకపోతే జెన్నీ, మార్క్స్‌ల జీవితం కూడా అర్థం కాదు. 1750లో ఫ్రెంచి విప్లవం వచ్చింది. లక్షలాది


శ్రామిక జనం పోరాటం చేసిన ఫలితంగా రాచరికం కుప్ప కూలింది. సామాన్య జనమే తిరగబడి రాజుకు మరణశిక్ష వేశారు. ఆ తిరుగుబాటు మొత్తం ప్రపంచంలో దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తిరగబడాలనే భావాలు రేకెత్తిం చింది. స్వేచ్ఛ, సమానత్వం, నినాదాలు అప్పుడే మొదలై య్యాయి. ఫ్రాన్స్‌కు పక్కనే ఉన్న ప్రష్యా రాచరికంలోనే ఉంది. అయినా రాచరికానికి, నియంతృత్వానికి వ్యతిరేకం గా ప్రజల్లో ఆలోచనలు మొదలయ్యాయి. ఇంగ్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియం వంటి దేశాలల్లో సోషలిస్టు భావాలు ప్రచారంలోకి వచ్చాయి. ప్రారిశ్రామికీకరణతో కార్మిక వర్గం - విప్లవ వర్గం ఆవిర్భవించింది.

- మహా మేధావి మార్క్స్‌పై ఈ కొత్త ఆలోచనల ప్రభావం పడింది. ఒక న్యాయవాది కొడుకు. అధికార దర్పాలను, విలాసవంతమైన జీవితాన్ని కోరుకోలేదు. తన మేధస్సుకు పదును పెట్టాడు. అధ్యయనం పెంచాడు. కార్మికుల పోరాటాలను, నియంతృత్వ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సాగే ప్రతిఘటనలను పరిశీలించాడు. క్రమంగా వాటితో మమేకమై పని చేయడం ప్రారంభించాడు. తన రచనా వ్యాసంగాన్ని ఆయుధంగా మార్చుకొన్నాడు. కార్మికవర్గ విముక్తి తన జీవిత ధ్యేయంగా పెట్టుకున్నాడు.
- పెట్టుదారీ ప్రభుత్వాలు ఆయన పట్ల ద్వేషం పెంచుకున్నా యి. ఆయనను ఎక్కడా నిలవనీయలేదు. సొంత దేశం అయిన జర్మనీ నుంచి తరమివేశారు. పారిస్‌లో తల దాచు కున్నాడు. అక్కడా ఉండనియ్యలేదు. బ్రస్సెల్స్ చేరుకున్నా డు. అక్కడి ప్రభుత్వం కూడా తరిమివేసింది. చివరికి లండన్ నగరంలోని మురికి వాడల్లో, కార్మిక వాడల్లో కాపురం పెట్టాడు.
- ఈ కాలంలో జెన్నీ, మార్క్స్‌ల సంసారం ఎలా సాగిందో ఊహాతీతం. రాచ బిడ్డ జెన్నీ. ఆమె కోరుకుంటే రాజ పుత్రుడే భర్తగా దొరికేవాడు. కానీ ఆమె జీవితాశయం వేరు. మార్క్స్‌ను ప్రేమించింది. మార్క్స్ భావాలను ప్రేమిం చింది. ఎన్ని కష్టాలైనా భరించింది. పేదరికం వారిపై కక్షగట్టింది. స్థిరమైన నివాసంలేక దేశ బహిష్కరణలకు గురయ్యారు. వలస పక్షుల్లాగా ఎన్ని దేశాలు తిరిగారో? కన్నబిడ్డలకు కడుపునిండ తిండిలేక వైద్యం చేయించే స్తోమత లేక నలుగురు బిడ్డలను పోగొట్టుకున్నారు.
- 'పాపం ఆ పసిది మూడు రోజులు మృత్యువుతో పోరాడిం ది. నికృష్టమైన పేదరికం అనుభవిస్తున్నప్పుడు మరణించిం దా బిడ్డ. మా జర్మన్ మిత్రులు సహితం ఆ సమయంలో లేరు. మమ్మల్ని ఆదుకునే స్థితిలో లేరు. దడదడలాడే గుండెతో ప్రక్క శివారులో ఉండే ఒక ఫ్రెంచి ప్రవాసితుని వద్దకు వెళ్ళాను. ఆయన మాకు పరిచయస్తుడు. అత్యంత స్నేహ భావంతోనూ, సానుభూతితోనూ అతను రెండు పౌనులు అందించాడు. దానితో శవపేటిక కొన్నాం. అదిగో అందులో విశ్రాంతి తీసుకుంటున్నది నా బిడ్డ! పుట్టినప్పుడు ఉయ్యాల ఇవ్వలేకపోయాను. తుదకు తుది గూడు కూడా చాలా సేపు సమకూర్చలేకపోయాం" అని మిత్రునికి రాసిన లేఖలో ఈ మాటలు సాధారణ కడగండ్లు, కన్నీరు కాదు. ఇంతకన్న ఏమిచెప్పుకోవాలి! లాక్‌డౌన్ కాలంలో వలస కార్మికుల కష్టాలు చూశాం. జెన్నీ - మార్క్స్ జీవితం అంతకన్నా మెరుగైంది కాదు. పగవాళ్ళకు కూడా వద్దురా బాబు అనిపించే కష్టాలు పడ్డారు. మార్క్స్ కుటుంబానికి ఎంగెల్స్ మైత్రి కొండంత అండ. మార్క్స్ మరణనంతరం కూడా మార్క్స్ కుంటుంబ బాధ్యతలను ఎంగెల్స్ తన భుజాలపై వేసుకున్నాడు.
- 'జయించటానికి ప్రపంచం ఉంది' అంటూ శ్రామిక వర్గానికి కర్తవ్య బోధ చేసిన కమ్యూనిస్టు ప్రణాళిక 1848లో ప్రచురించారు. కార్మిక వర్గానికి అది ఒక దిక్సూచి. అది మొదలు అనేక దేశాల్లో ప్రతిఘటనలు, పోరాటాలు ఎన్నో జరిగాయి. రాచరికాలకు, నియంతృత్వ ప్రభుత్వాలకు, వలసవాద, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకం గా తిరగబడని దేశమంటూ లేదు. మార్క్స్ పుట్టిన దేశం లోనే హిట్లర్ పుట్టాడు. సోవియట్ సైన్యాల చేతుల్లో కుక్క చావు చచ్చాడు. తెలిసిన చరిత్రే కదా! తాత్కాలికంగా విప్ల వోద్యమాలకు ఎదురుదెబ్బలు తగులుతునే ఉంటాయి. మార్క్స్ కాలంలోనూ ఎదురుదెబ్బలు తగిలాయి. విప్లవ శక్తులు ఓడిపోయి, ప్రతిఘాత శక్తులు విజృభించిన ప్రతి సారి మార్క్స్ దేశ బహిష్కారాలకు గురయ్యాడు. అయినా రాజకీయ అర్థశాస్త్రం, పెట్టుబడి గ్రంథరచన, కార్మిక వర్గ పోరాటాలను ఉచ్ఛస్థితికి తిసుకేళ్ళడం వారి జీవితాశయం.
- జెన్నీ మాములు గృహిణి కాదు. ఆమె మార్క్స్‌ని మాత్రమే ప్రేమించలేదు. విప్లవాన్ని ప్రేమించింది. ఆమె బిడ్డలను మాత్రమే సాకలేదు. రాజకీయ కార్యకర్తలను సాకింది. కమ్యూనిస్టులపై నిందా ప్రచారాలు అప్పుడూ ఉన్నాయి. ఇప్పుడూ ఉన్నాయి. కమ్యూనిజం వచ్చేదాక ఉంటాయి. 'వామ్మో వాయ్యో' అంటూ ఈ కాస్త పనికే యాస్ట పడిపోతే, ప్రఖ్యాత రతయిత తెన్నేటి సూరి ఒక పాటలో చెప్పినట్టు "అసలు ఎందుకు మొదలెట్టావోరు' అని ప్రశ్న వేసుకోవాలి. అయితే మొదలెట్టాక చేసేదేముంది. దోపిడీ దౌర్జన్యాలను భరిద్దామా? దేశ రాజధానిలో లక్షలాది మంది రైతులు పోరాడుతున్నారు. దోపిడీ ఎక్కడ ఉంటుందో పోరాటం అక్కడే ఉంటుంది. అడుగు ముందుకు వేద్దాం. దోపిడీని అంతం చేద్దాం. జెన్ని-మార్క్స్-ఎంగెల్స్‌ల త్యాగాలను మరవక వారి కలలను నిజం చేద్దాం. ❑

**(నవతెలంగాణ సౌజన్యంతో..)**

# కొత్త చూపునిచ్చే మార్క్స్ అధ్యయన పద్ధతి

తెలుగు పాఠకులకు అందుబాటులో లేని మార్క్స్ రాత ప్రతులు, చివరి రచనలు చాలా వున్నాయి. వీటిని పరిచయం చేసే వ్యాసాలతో "మార్క్స్-మెగా 2 "ప్రత్యేక సంచికను రూపొం దించారు. 2022 మార్చి 14 మార్క్స్ 139వ వర్ధంతి సంద ర్భంగా ఈ సంచికను ఆవిష్కరించారు. మనకు తెలిసిన మార్క్స్ అంటే తెలుగులో అందుబాటులోవున్న ఆయన రచనలలో కనిపించే మార్క్స్. మనకు తెలియని మార్క్స్ అంటే మనకు తెలు గులో అందుబాటులోకి రాని రాత ప్రతులలో, చివరి రచనలలో కనిపించే మార్క్స్. ఈ రెండింటి మధ్య వైరుధ్యం లేదు. ఆ భావజాలంలో మరిం త విస్తృతి, కొనసాగింపులో అవసరమైన మార్పులు చేర్పులు కనిపిస్తాయి. మార్క్సి జం నిత్య సృజనశీలతను అవి ధ్రువపరు స్తాయి. ఈ సంచికలో మార్క్స్-ఎంగెల్స్‌ల రచనల ప్రచురణకు సంబంధించిన సంక్షిప్త చరిత్రపై వ్యాసాలున్నాయి. మనకు ఇంగ్లీష్‌లో అందుబాటులోవున్న 50 సంపు టాల మార్క్స్-ఎంగెల్స్ సంకలిత రచనలను స్థూలం గా మెగా 1గాను, వీటితో కలిపి గతంలో ప్రచురణకు నోచుకోని రాతప్రతుల ను, ఉత్తరాలను, వ్యాసాలను ఇప్పుడు ప్రచు రిస్తున్న "మార్క్స్-ఎంగెల్స్ సర్వ రచనల" 114 సంపుటాలను మెగా 2 గాను వ్యవహ రించడాన్ని ఈ వ్యాసాలలో వివరించారు. ఈ కొత్త సంపుటాలు ప్రధానంగా జర్మన్ భాషలో వున్నాయి. ఈ అదనపు సమాచారాన్ని అధ్యయనం చేస్తున్న వారు ఇంగ్లీష్‌లో రాసిన వ్యాసాల ఆధారంగా ఈ సంచికను రూపొందించారు. వివిధ స్రవంతులకు చెందిన మార్క్సిస్టు విశ్లేషకులు, రచయితలు రావు కృష్ణారావు, ఆర్వీ రామారావు, హెచ్చార్కె, అశోక్ కుంబ ము, ఇప్ట్యూ ప్రసాద్, కొండూరి వీరయ్య, మందలపర్తి కిషోర్, కొప్పర్తి వెంకటరమణమూర్తి, డాక్టర్ మర్ల సోము, డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు, డి.సోమసుందర్ – ఈ సంచికలోని వ్యాసాలకు రూపునిచ్చారు. ఈ సంచికలో ఐదు భాగాలు వున్నా యి. మొదటి భాగంలో మార్క్స్ – ఎంగెల్స్ సర్వ రచనల ప్రచు రణ సంక్షిప్త చరిత్ర వ్యాసాలున్నాయి రెండవ భాగంలో "పెట్టు బడి" ఫ్రెంచ్ అనువాదంలో మార్క్స్ స్వయంగా చేసిన సవరణల మీద, ఇతర ఆర్థిక రచనలలో వెల్లడించిన అభిప్రాయాల మీద వ్యాసాలూ ఉన్నాయి. మూడవ భాగంలో మానవ సమూహాల చరిత్రపై మార్క్స్ చేసిన పరిశీలనలు, ఆవిష్కరణలపై వ్యాసాలు వున్నాయి. నాలుగవ భాగంలో పర్యావరణం, జీవావరణం, ప్రకృతిలో జీవక్రియపై వ్యాసాలు వున్నాయి. ఐదవ భాగంలో మార్క్స్ వివిధ విజ్ఞాన శాస్త్రాలపై-వ్యవసాయం, గణితశాస్త్రం, ప్రకృతిశాస్త్రం, సాంకేతిక విప్లవాలపై-రాసుకున్న నోట్ బుక్స్‌లో చేసిన ఆవిష్కరణలపై వ్యాసాలున్నాయి. మొదటిది ఈ రాత ప్రతుల ద్వారా మార్క్స్‌లో మనం తెలుసుకోవలసిన అంశాలు చాలా ఉన్నాయని స్పష్టం అవుతుంది. మార్క్స్‌ని ఒక మూసలో




అర్థం చేసుకోకూడదనీ అది నిరంతరం మార్పులకీ, చేర్పులకీ గురికావడం కనిపిస్తుంది. దీనికితోడు సమస్త విజ్ఞాన శాస్త్రాలకు విస్తరించిన మార్క్స్ అధ్య యనాలు, పరిశీలనలు, ఆవిష్కరణలు తెలు స్తాయి. మార్క్స్‌ను ఒక ఆర్థిక నియతి వాది గా, ఏకరూప చారిత్రిక అభివృద్ధి దశల మూస సిద్ధాంతకర్తగా, పర్యావరణ విరోధి గా చూపించే ప్రయత్నాలను ఈ రాత ప్రతులు పూర్వపక్షం చేస్తున్నాయి. అందు వల్ల ఈ రాతప్రతుల అధ్యయనం తప్పని సరి అవుతుంది. రెండవది : మార్క్స్ రచ నలకి, రాత ప్రతులకీ మధ్య వున్న ప్రత్యేకతలను మనం గుర్తించాలి. మార్క్స్ రచనలలో శాస్త్రీయదృక్పథం గల విశ్లేషణ, చారిత్రక నేపథ్యం, గతితార్కిక అన్వ యం కనిపిస్తుంది. మనకొక కొత్త భావ జాల ప్రపంచం గోచరిస్తుంది. భవిష్యత్తును దర్శించే కొత్తచూపు కనిపిస్తుంది. ఇవి మార్క్స్ అధ్యయనాల సారాన్ని వ్యక్తీకరిస్తాయి. మార్క్స్ రాతప్రతులు ఆయన అధ్యయన పద్ధతిని ఆవిష్కరి స్తాయి. మార్క్స్ ఈ కొత్త చూపును సంపాదించుకున్న తీరును అర్థం చేసుకోడానికి ఆయన రాతప్రతులు మనకు దారి చూపి స్తాయి. వర్తమానాన్ని అర్థం చేసుకోడానికి గతాన్ని అధ్యయనం చేసాడు. తన కాలానికి అభివృద్ధి చెందిన ఆర్థిక, రాజకీయ, అన్ని విజ్ఞాన శాస్త్రాలను అధ్యయనం చేశాడు. వాటికి తన గతి తర్క పద్ధతిని జోడించాడు. ఈ తరహా అధ్యయన పద్ధతే ఆయన కు కొత్తచూపునీ, ముందుచూపునీ ఇచ్చింది. మార్క్స్ అధ్యయ నం చేసిన పద్ధతి రాత ప్రతులలో పుష్కలంగా కనిపిస్తుంది. అలాంటి కొత్తచూపును, ముందు చూపును పొందాలన్న ఆసక్తి గలవారంతా రాత ప్రతులను లోతుగా అధ్యయనం చెయ్యాలి. అందుకు ఈ ప్రత్యేక సంచిక ప్రేరణ ఇస్తుందని ఆశిద్దాం. ❑

**– డి.వి.వి.ఎస్ వర్మ**

# సర్వభాషలకు 'జనని' సంస్కృతం కాదు!



**దేవరాజు మహారాజు**
**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవ శాస్త్రవేత్త.**

నాలుగు శ్లోకాలు నేర్చుకుని, గుళ్ళమీద, మతం మీద పట్టు బిగించి రాజుల్ని, చక్రవర్తుల్ని సైతం తమ చెప్పు చేతల్లో ఉంచుకున్నారు. హిందూ మతోద్ధారకులుగా తోచిందేదో చెప్పి, జనాన్ని మూఢ నమ్మకాల్లో ముంచేశారు. వారిని ప్రశ్నించిన వారిని దుష్టులుగా, ధూర్తులుగా చిత్రించారు. ఆ మనువాదుల ప్రభావంలో పడి, ఒక్కోసారి పరాయీకరణ చెంది – సామాన్య ప్రజలు తరతరాలుగా అర్థం లేని ఆచారాలు పాటిస్తూ తమకు తాము సజ్జనులుగా భావించుకున్నారు. అదే పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది. శతాబ్దాలు గడిచినా జనం ఆ బంధనాల్ని తెంపుకుని స్వేచ్ఛగా ఆలోచించలేకపోతున్నారు. జీవ పరిణామం ఎలా జరుగుతూ వచ్చిందో, భాషా పరిణామాలు అలాగే క్రమ క్రమంగా కొనసాగాయి. ఉన్న ఫళంగా ఏదీ ఎక్కడి నుంచి ఊడిపడలేదు. భాషా పరిణామం గురించి మాట్లాడుకోవాలంటే, అంతకుముందు కొన్ని పదాలు స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మాటలు–లిపి–భాష అనే పదాల మధ్య గల వ్యత్యాసం అర్థం చేసుకోవాలి. రాతి యుగంలో సైగలు, ధ్వనులతోనే మనుషుల సంభాషణ సాగింది. క్రమంగా ధ్వనులు మాటలుగా రూపాంతరం చెందుతూ వచ్చాయి. మానవ పరిణామ దశలో మొదట ఒకరి నుండి ఒకరు కొన్ని విషయాలు తెలియజేసు కోవడానికి మాటలు అవసరమయ్యాయి. ఒక దశలో అక్షరాలు లేవు. లిపి లేదు. భాషకు ఒక స్వరూపం లేదు. తర్వాత కాలంలో మాటల్ని అక్షరాల ద్వారా వ్యక్తీకరించడం కోసం అక్షరాలకు రూపకల్పన జరిగింది. దాన్ని 'లిపి' అని అన్నాం. మాటల్లో చెప్పగలిగే దాన్ని అక్షరాల్లో కూడా పొందుపరచగలిగితే దాన్నే 'భాష' అన్నాం. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కొన్ని ఆదివాసీ జాతుల మాటలకు లిపి లేదు. అందుకే అవి భాషలుగా గుర్తించబడలేదు.

ఒక వేయ్యేండ్ల క్రితం సంస్కృతం భారతదేశం వచ్చినప్పుడు దానికి లిపి లేదు. అప్పటికి ఇక్కడ వ్యాప్తిలో ఉన్న దేవనాగరి లిపి (మన హిందీ లిపి)లో దాన్ని రాయడం ప్రారంభించారు. ఆ తర్వాత కాలంలో అన్ని భారతీయ భాషల్లో సంస్కృతాన్ని రాయడం మొదలుపెట్టారు. తనకై తాను ఒక లిపిని అభివృద్ధి చేసుకోని సంస్కృతం అన్ని భాషలకు 'జనని' ఎలా అవుతుంది? అది ఎదగని భాష! మాటలు భాషగా స్థిరపడాలంటే లిపిని రూపొందించుకోవడం అవసరం. లిపి లేని మాటల్ని (సంభాషణల్ని) హిందీలో 'బోలీ' అని అంటారు. ఆ రకంగా సంస్కృతం ఒక బోలీ. అది మన దేశం వచ్చాక ఇక్కడి దేవనాగరి లిపి మీద

**సామాన్య ప్రజలు తరతరాలుగా అర్థం లేని ఆచారాలు పాటిస్తూ తమకు తాము సజ్జనులుగా భావించుకున్నారు. అదే పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది. శతాబ్దాలు గడిచినా జనం ఆ బంధనాల్ని తెంపుకుని స్వేచ్ఛగా ఆలోచించలేకపోతున్నారు. మనువాదులు అలవాటు చేసిన దేవీ దేవతల్ని కొలుస్తూ, వారి పండగలే జరుపుకుంటూ తాము తక్కువేమీ కాదు, అని పొంగిపోతున్నారు. 'తమది కూడా అగ్రవర్ణం వారి స్థాయే' అని అనుకుంటున్నారు. తప్పిస్తే, కులం, గోత్రం, మతం-అందులో శాఖలూ వదిలేసి మనుషుల్లా ప్రవర్తిద్దాం - అని అనుకోవడం లేదు.**

ఆధారపడింది. ఇంతకూ దేవనాగరి లిపి ఎప్పుడు అభివృద్ధి చెందిందీ అంటే చారిత్రక ఆధారాల ప్రకారం దేవనాగరి లిపి తొమ్మిదో శతాబ్దం తర్వాత మాత్రమే కనిపిస్తోంది. ఆ విధంగా సంస్కృత భాషా వికాసం తొమ్మిదో శతాబ్దం తర్వాతనే జరిగిందని చెప్పాలి. అందువల్ల సంస్కృతం ఆది భాష, సర్వ భాషలకు 'జనని' అనేది శుద్ధ అబద్ధం! ఒక తప్పుడు ప్రచారం మాత్రమే.

సంస్కృతం అంటేనే సంస్కరించబడింది అని అర్థం. ముందు ఒక భాష ఉంటేనే, అది సంస్కరించబడితేనే... అప్పుడది సంస్కృతమయ్యింది. పైగా ఈ భాషకు మన దేశంలో ఒక క్షేత్రమంటూ లేదు. తెలుగు, తమిళం, మళయాళం, బెంగాలీ వంటి భాషలకు నిర్దిష్టమైన క్షేత్రాలు ఉన్నాయి. ఇంగ్లీషు, అరబ్బీ, ఫారసీలకు దేశంలో ఒక నిర్దిష్టమైన భూమి అంటూ లేదు. ఆ భాషలు తెలిసిన వారు దేశంలో అక్కడక్కడా ఉండొచ్చు. భాషకు ఒక భూమి ఉన్నప్పుడు, ఆ భూమి మీద పుట్టిపెరిగిన వారికి అది మాతృభాష అవుతుంది. అక్కడి జనమంతా ఆ భాషే మాట్లాడుతారు. ఆర్యులతో పాటు సంస్కృతం బయటి నుండి వచ్చిందే! ఇక్కడ

కొన్ని విషయాలు గమనించుకోవాలి. 1. సంస్కృతం మాట్లాడే ప్రదేశం / రాష్ట్రం భారతదేశంలో ఎక్కడా లేదు. 2. మనువాదులు బలవంతంగా తమ హిందూ దేవీ దేవతల పూజల్లో, వ్రతాల్లో, కర్మకాండల్లో ఉపయోగించడం తప్ప, సంస్కృతం ఎక్కడా నిత్య జీవితంలోని సంభాషణల్లో భాగం కాలేదు. 3. సంస్కృతం ఎప్పుడూ ఎక్కడా ప్రజల భాషగా లేదు. ఒకవర్గం వారికే అది పరిమితమైంది. ఇకపోతే సాధారణ శకానికి ముందు (బిసిఈ) అసలు ఎక్కడా దేశంలో సంస్కృతం లేదు– అనేది రుజువయ్యింది. మనువాదుల అబద్ధపు ప్రచారాలు పక్కన పెట్టి మనం వాస్తవంలోంచి విషయం పరిశీలిద్దాం!

బహుజన చక్రవర్తి అశోకుడి కాలం నాటికి (268–232 బిసిఈ) ఈ దేశంలో ఉన్నది ప్రాకృత భాష. దాని మరొక రూపమే పాలి భాష. ఆ భాషను ధమ్మలిపిలో రాసేవారు. సాధారణ శకానికి ముందు నాటి స్థూపాలు, శిలాఫలకాల మీద అంతటా ప్రాకృతమే ఉంది. ఎక్కడా దేశంలో సంస్కృత శిలాఫలకాలు లభించలేదు. కారణం ఆ భాషే అప్పటికి లేదు కాబట్టి! పైగా సంస్కృతం విస్తృతంగా జనంలోకి వెళ్ళకుండా మనువాదులే అడ్డుకట్ట వేసుకున్నారు. తమ జ్ఞానం ఇతరులకు అందగూడదని, కేవలం తమ వర్ణం వారికి మాత్రమే అందాలని కుత్సిత బుద్ధితో సంస్కృత పదం ఉచ్చరిస్తే వారి నాలుకలు తెగ్గోశారు. అదంతా మళ్ళీ వేరే విషయం. ఇప్పుడు ఆ విషయాలు అందరికీ తెలిసినవే. ఒకప్పుడు అక్షరాస్యులు, విద్యావంతులు, పండితులు అంటే వారు కేవలం అగ్రవర్ణం వారే – బ్రాహ్మణులే – నాలుగు శ్లోకాలు నేర్చుకుని, గుళ్ళమీద, మతం మీద పట్టు బిగించి రాజుల్ని, చక్రవర్తుల్ని సైతం తమ చెప్పుచేతల్లో ఉంచుకున్నారు. హిందూమతోద్ధారకులుగా తోచిందేదో చెప్పి, జనాన్ని మూఢ నమ్మకాల్లో ముంచేశారు. వారిని ప్రశ్నించిన వారిని దుష్టులుగా, ధూర్తులుగా చిత్రించారు. ఆ మనువాదుల ప్రభావంలో పడి, ఒక్కోసారి పరాయీకరణ చెంది – సామాన్య ప్రజలు తరతరాలుగా అర్థం లేని ఆచారాలు పాటిస్తూ తమకు తాము సజ్జనులుగా భావించుకున్నారు. అదే పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది. శతాబ్దాలు గడిచినా జనం ఆ బంధనాల్ని తెంపుకుని స్వేచ్ఛగా ఆలోచించలేకపోతున్నారు. మనువాదులు అలవాటు చేసిన దేవీ దేవతల్ని కొలుస్తూ, వారి పండగలే జరుపుకుంటూ తాము తక్కువేమీ కాదు, అని పొంగిపోతున్నారు. 'తమది కూడా అగ్రవర్ణం వారి స్థాయే' అని అనుకుంటున్నారు. తప్పిస్తే, కులం, గోత్రం, మతం–అందులో శాఖలూ వదిలేసి మనుషుల్లా ప్రవర్తిద్దాం – అని అనుకోవడం లేదు. ఎప్పుడో శతాబ్దాల కింద జరిగిన కుట్రకు బలైపోయామన్న విషయం గ్రహించుకోవడం లేదు. అన్నిటినీ మించి మానవత్వం అనేది ఒకటి ఉందని దాన్ని అందరం కలిపి నిలుపుకోవాల్సి ఉందని అనుకోవడం లేదు. ఎన్నో పెద్ద పెద్ద కుట్రల్లో 'సంస్కృతం అన్ని భాషలకు జనని' అని చెప్పడం కూడా ఓ కుట్రే – ఎందుకంటే ఆ భాషతోనే అగ్రవర్ణాలు తమ ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా నాగరికతలు ఏర్పడుతూ వచ్చాయి. ఒక్కో నాగరికత ఒక్కోరకమైన మాటల్ని, ఒక్కోరకమైన లిపిని, ఒక్కోరకమైన భాషని రూపొందించుకుంటూ వచ్చాయి. మనకు మన దేశంలో సింధూ నాగరికతలో 4,500 ఏండ్ల నాటి లిపి లభ్యమైంది. అయితే దాన్ని ఇప్పటి వరకు ఎవరూ చదవలేక పోయారు. అదే లిపికి దరిదాపులుగా ఉన్న మరికొన్ని లిపులు లభ్యమయ్యాయి. అవే ధమ్మ లిపి, గోండ్ లిపి వంటివి. వాటిని పూర్తిగా అర్థం చేసుకునేవారు లేకపోవడం వల్ల అవి అంతర్జాతీయ భాషల జాబితాలో చేరలేదు. వేల సంవత్సరాల తర్వాత అప్పటి అక్షరాలు, అంకెలు, గుర్తులు తెలుసుకోవడం కష్టం. అక్షరమంటే ఒక రకమైన 'కోడ్'. దాన్ని ఎలా పలకాలి? ఎలా పలికితే ఏ అర్థం వస్తుంది? అనేది తెలియనంత వరకు ఏ లిపి అయినా, ఏ భాష అయినా అర్థం కాదు. తర్వాత వచ్చిన చారిత్రక యుగంలోని లిపులు అధ్యయనం చేయడానికి వీలయ్యింది. సమ్యక్ సంస్కృతికి సంబంధించిన ఆధారాలు అనేకం దొరికాయి. అశోకుడి శిలాశాసనాలు అధికంగా లభించాయి. అవన్నీ ధమ్మలిపిలో ఉన్నాయి. బుద్ధుడి సమకాలికుడైన పసేన్‌జీత్ శిలాశాసనం ఒకటి మధ్య ప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో దొరికింది. అది కూడా ధమ్మలిపిలోనే ఉంది. ఇదే ఇక్కడ చాలా కీలకమైన విషయం. మనువాదులు చెప్పుకుంటున్నట్టు సంస్కృతమే అతి ప్రాచీనమైన భాష అయితే మొదట ఆ భాషలోని శిలాశాసనాలు దొరకాలి కదా? దొరకలేదు. దొరకవు. ఎందుకంటే సంస్కృతానికి లిపే లేదు. లిపిలేని భాషలో ఎవరు మాత్రం ఏం రాస్తారూ?


**సృష్టి ప్రారంభం నుండే సంస్కృతం ఉంది. వేదాలు, పురాణాలు ఆ దేవదేవుడే స్వయంగా మానవులకు అందించాడు - వంటి కట్టు కథల్ని వివేకవంతులు విశ్వసించరు. పరిణామ క్రమం, చారిత్రక ఆధారం, వికాసం ఎలా ఎప్పుడు జరుగుతూ వచ్చాయో పరిశీలించి, పరిశోధించి నిగ్గుతేల్చిన తర్వాత మాత్రమే ఏ విషయాన్నైనా వారు గుర్తిస్తారు. జరిగిన తప్పిదం ఏమిటంటే ధమ్మలిపిలో దొరికిన పాలి శాసనాలు - సంస్కృతం వి అని అబద్ధపు ప్రచారం చేశారు.**


సృష్టి ప్రారంభం నుండే సంస్కృతం ఉంది. వేదాలు, పురాణాలు ఆ దేవదేవుడే స్వయంగా మానవులకు అందించాడు – వంటి కట్టు కథల్ని వివేకవంతులు విశ్వసించరు. పరిణామ క్రమం, చారిత్రక ఆధారం, వికాసం ఎలా ఎప్పుడు జరుగుతూ వచ్చాయో పరిశీలించి, పరిశోధించి నిగ్గుతేల్చిన తర్వాత


మాత్రమే ఏ విషయాన్నైనా వారు గుర్తిస్తారు. జరిగిన తప్పిదం ఏమిటంటే ధమ్మలిపిలో దొరికిన పాలి శాసనాలు – సంస్కృతం వి అని అబద్ధపు ప్రచారం చేశారు. అంతేకాదు ఒక్కోసారి ధమ్మ లిపిని బ్రాహ్మిలిపిగా ప్రకటించారు. ఉదాహరణకు 22వ శతాబ్దంలో లభించిన జూనాఘడ్ శాసనం పాలి లిపిలో ఉంది. దాన్ని గుర్తించలేక అది సంస్కృతమని భ్రమపడ్డారు. అసలైతే అప్పటికి సంస్కృతం భారతదేశానికి రాలేదు. వచ్చాక అది దేవ నాగరి లిపిలో నమోదయ్యింది. చెపితే గిబితే అది దేవనాగరి లిపి అని చెప్పాలి కాని, సంస్కృతం అని అనడం తప్పుకదా? మరొక ముఖ్య విషయమేమంటే ధమ్మలిపిలో సంస్కృతం రాయలేరు. క్రి కృ లాంటి శబ్దాలు దేవనాగరి లిపిలో రాసుకోవాల్సిందే గాని ధమ్మలిపిలో రాయడం అసలే కుదరదు. ఆ శబ్దాలే ఆ లిపిలో ఇమడవు. పదవ శతాబ్దం తర్వాత 'ధమ్మ'ను 'ధర్మ' అని రాయడం ప్రారంభించారు. పేర్లతో సహా అన్నింటినీ సంస్కృతీకరించడం అప్పటి నుండే ఆరంభమైంది. ఉదాహరణకు విక్‌మాదత్(పాలిభాషలో)ను సంస్కృతీకరించి విక్రమాదిత్యగా మార్చారు. చద్ గుపత్(పాలి)ని సముద్ర గుప్తుడుగా మార్చారు. వీరు హిందూ రాజులు కాకపోయినా హిందూ రాజులుగా ప్రచారం చేశారు. 9వ శతాబ్దం నాటి నలందా విశ్వవిద్యాలయం అధికారముద్ర లభించింది. దాని మీద శ్రీ నలందా మహా విహార్ అని ఉంది. విహారాలు, ఆరా మాలు బౌద్ధులకు సంబంధించిన పదాలు. దాని ముందు శ్రీ చెర్చడం హిందూ మనువాదుల దౌర్జన్యం. ఇలాంటి విషయాలన్నీ తెలుసుకోదలచిన వారు సమ్యక్ ప్రకాశన్ వారు ప్రచురించిన 'భ్రమ్‌క పులిందా' చదవాలి. దీని రచయిత రాజీవ్ పటేల్. ఈయన సంజరుకుమార్‌తో కలిసి ఇంగ్లీషు వర్షన్ కూడా ప్రకటించారు.

బ్రాహ్మణార్యుల మతం – వైదిక మతంబీ జాతి–ఆర్యజాతిబీ భాష– సంస్కృతం. మొదట సంస్కృతం ఆరియన్ లేక ఆరియక్ మాండలికానికి సంబంధించిన ఛండా భాష. అది సంస్కరించబడింది. తర్వాత కాలంలో బ్రాహ్మణార్యులు, ద్రావిడ జీవన విధానాల్లోకి తమ పురాతన ఆరియన్ సంస్కృతాన్ని (ఛండా మాండలికాన్ని) జొప్పించారు. అందువల్ల ఆరియన్ మూలాలున్న వైదిక ఛండా భాషగా మాత్రమే సంస్కృతాన్ని గుర్తించాలి! సంస్కృతం లిపి లేని భాషగా చాలా కాలం కొనసాగింది. అది ఈ దేశపు 'నాగరి' లిపిని ఆశ్రయించింది. దానికే దేవ శబ్దాన్ని జోడించి 'దేవనాగరి'గా ప్రచారం చేసుకున్నారు. పనిలో పనిగా సంస్కృతాన్ని "దేవభాష"గా ఉన్నతీకరించుకున్నారు. అది ఎప్పుడూ వ్యవహార భాషగా లేదు. స్తుతి, స్తోత్రాలతో మాత్రమే కొనసాగింది. ఇప్పటికీ అది వాటికే కుంచించుకు పోయి ఉంది. పూర్తిగా ఇది ఇండో–యూరోపియన్ భాష కాదు. బ్రాహ్మణిజం – సంస్కృతం రెండూ పెనవేసుకుపోయి అర్చక, స్తోత్ర, పూజాది మత పరమైన విషయాలకు మాత్రమే పరిమితమైంది. అలౌకిక విషయాల ప్రచారంలో మునిగిపోయింది. దీన్ని మత ఫాసిజంగా (Rightist Religious Fascism)గా గుర్తించాలి! ❑


## స్వీకారం.. కొత్త పుస్తకాలు



# ఫాసిజం..
# మౌలికంగా ఒక భావజాల శక్తి



జి.భార్గవ

ఫాసిజం అన్నది కేవలం ఒక రాజకీయ శక్తి కాదు.
అది మౌలికంగా ఒక భావజాల శక్తి.
ఆ కారణం చేత ఫాసిజాన్ని స్టుపిడ్ పాపులిస్ట్ పొలిటీషియన్స్ ఓడించలేరు.
కేసీయార్, కేజ్రీవాల్‌లాంటి వాళ్ళను అది అప్పడంలాగా నమలగలదు.
దానికి ఐడియాలాజికల్ అఫెన్సివ్ అవసరం అవుతుంది.
మహారాష్ట్ర గడ్డ మీద నిలబడి సావర్కార్ ఒక జాతి ద్రోహి అని, బ్రిటీష్ బూట్లు నాకిన పసరిక పాము అని ప్రకటించడానికి చాలా ఐడియాలాజికల్ గట్స్ కావాలి.

ఙఙఙఙఙఙఙఙఙఙ

మతోన్మాద ఫాసిజం..
మామూలు మనుషులను ఉన్మాదులుగా..
భక్తులను ఉన్మాద హంతకులుగా..
మధ్య తరగతి భద్రజీవులను
హంతకుల భక్తులుగా.. మార్చేయగలదు.

ఙఙఙఙఙఙఙఙఙఙ

సాహిత్యం అంటేనే యథాతథ స్థితిపై తిరుగుబాటు.
సాహిత్యకారుడంటేనే నిజమైన అర్థంలో ఒక క్రిటిక్.
అలాంటిది సాహిత్య విమర్శ మాత్రం
ఉండరాదనడం ఏమిటి ?
నీ సాహిత్యం కేవలం వినోద ప్రధానం అయినప్పుడో.. లేక అది నీ అహంకార దంభ ప్రకటన అయినప్పుడో.. అప్పుడు మాత్రమే నీకు సాహిత్య విమర్శ నచ్చకుండాపోతుంది.
సినిమాలను విమర్శిస్తే వాటి కలెక్షన్లు దెబ్బ తింటాయని విరుచుకుపడే మురికి తెలుగు సినిమా నిర్మాతల వాదమిదే.

ఙఙఙఙఙఙఙఙఙఙ

ఛాందసాన్ని విమర్శించడం సులభం. దాని మూర్ఖత్వం స్పష్టంగా బయటికే కనిపిస్తుంది కాబట్టి. నీకు సమకాలికమైన, నీవు భాగమైన, నీ వ్యక్తిత్వంలో భాగమై పోయిన ప్రగతిశీల ఉద్యమాల్లోని లోపాలను విమర్శకు పెట్టడం కష్టం. ఎందుకంటే.. అది నీపై నీవు, నీ పిడివాదంపై నీవు, నీ ప్రెజుడిస్‌తో నీవు, నీ గర్వంతో నీవు చేసే యుద్ధం. అది కష్టమైన పని.
బెంగాలీ సమాజమంతా జాతీయవాదంతో రగిలిపోతూ, ఒక ఉత్సవంలా విదేశీ వస్త్ర బహిష్కరణ చేస్తున్న సమయంలో..ఆ ఉద్యమంలోని లోపాలనూ,స్వాతిశయాన్నీ విమర్శించడం కొరకు "ఘరే –బాయిరే" రాయగలగడం రవీంద్రుడికి సాధ్యమైంది.
అలాగే వితంతు వివాహం, ఆంటీ – నాచ్ ఉద్యమం ఆర్భాటంగా సాగుతున్న సమయంలో.. వాటిలోని లోపాలపై విమర్శ పెట్టగలిగాడు గురజాడ.
టాగోర్, గురజాడలు చూడలేకపోయిన, రాయలేకపోయిన విషయాలపై చర్చించడం ఎంత అవసరమో..
మనం భాగమైన సమకాలీన ఉద్యమాలలోని లోపాలను ఎత్తి చూపే బౌద్ధిక నిజాయితీని ప్రదర్శించగలగడం
ఇంకా అవసరం. మొదటిది సులభం. రెండవది కష్టం.

ఙఙఙఙఙఙఙఙఙఙ

చార్వాకులంటే.."అప్పు చేసైనా నెయ్యి తాగు" అని బోధించిన స్వసుఖవాదులు కాదు. స్వర్గం లేదు, నరకం లేదు. దేహానికన్నా భిన్నమైన ఆత్మలేదు. మరణం అంటే మూల ఘట కాలు విచ్ఛిన్నమైపోవడం. యజ్ఞ యాగాదులూ, రకరకాల కర్మ కాండలూ బ్రాహ్మణుల బతుకుతెరువు ఉపాయాలు. శ్రాద్ధ కర్మలన్నవి హేతు విరుద్ధమైన నమ్మకాలపై ఆధారపడిన ఆచారా లు. మరణానంతర జీవితం అబద్ధం. పరలోకం భ్రమ. పునర్జన్మ అనే భావన అర్థరహితమైనది. ఉన్నది ఈ జీవితమే. ఈ ఒక్క జీవితమే. దాన్ని హేతుబద్ధమైన జ్ఞానంతో, ఆత్మగౌరవంతో, వివే కంతో గడపడం ఒక్కటే చేయవలసిన పని. అని బోధించిన విప్లవకర భౌతికవాదులు. వైదిక కర్మకాండల బూటకాన్నీ, బ్రాహ్మణమాయలనూ తమ సునిశిత తర్క ఖడ్గంతో తునాతు నకలు చేసిన తాత్వికులు, సంఘ సంస్కర్తలు. వారికి నైతికత లేదు అనడం అంటే.. నైతికతకు అర్థం తెలియక పోవడమే. చార్వాకులది నైతిక సిద్ధాంతం కాదు. భౌతికవాద తాత్విక సిద్ధాంతం. ప్రత్యక్ష ప్రమాణవాద(అనుభవవాద) జ్ఞాన సిద్ధాం తం. అదే వారి ఫోకస్. ఆ సిద్ధాంతాల సహాయంతో వారు వైదిక కర్మకాండలపై, వాటి చుట్టూ అల్లబడిన భావజాలంపై అలాగే.. శ్రమణ ఉద్యమాలు బలంగా ప్రచారం చేసిన సర్వ సంగ పరిత్యాగం, కఠిన బ్రహ్మచర్యం మొదలైన ప్రాక్టీసెస్ పైనా, వాటి చుట్టూ నిర్మితమైన నైతిక దృష్టిపైనా.. ఆ నైతిక దృష్టికి ఆధారంగా నిలిచిన తాత్విక భావనలపైనా.. చాలా తీవ్రమైన విమర్శ చేశారు. వారి నైతిక భావనలను ఆ విమర్శల్లోంచి డిరైవ్ చేసుకోవాల్సి ఉంటుంది. ❑

**(వారే స్వయంగా చెప్పిన మాటలు కాక).**

# గురజాడకు ఒక కొత్త సమస్య వచ్చిపడింది



రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి
(వ్యాసకర్త ప్రజాశక్తి బుక్‌హౌస్
గౌరవ సంపాదకులు)

**గురజాడ ఆధునిక సమాజ స్వాప్నికుడు. ప్రవచనకారులు రకరకాల వ్యాఖ్యానాలతో ప్రచారం చేసే పురాణాలేవీ ఆధునిక సమాజాన్ని కోరుకోవు. అవి మధ్యయుగ సమాజాన్ని వైభవీకరించాయి. అవి ప్రచారం చేసింది రాచరిక, భూస్వామ్య సమాజం. వర్ణాధిక్య పురుషాధిక్య సమాజం. మత సమాజం. గురజాడ కోరుకున్నది ప్రజాస్వామ్య సమాజం. మత రహిత, వర్ణరహిత సమాజం. స్త్రీపురుష సమానత్వ సమాజం. పురాణం పాలకవర్గం వైపు నిలబడుతుంది. అవి చెప్పే కథలు, బోధించే నీతులు ప్రజలను దేవునికీ, రాజుకూ విధేయులుగా మార్చేది.**

గురజాడ భావజాలంతో ఏకీభావం లేనివాళ్ళు ఆయన పేరుతో సంస్థను స్థాపించడం, ఆయన భావజాలంతో ఏకీభావం లేని వాళ్ళకు పురస్కారాలివ్వడం విడ్డూరం. ఒక సాహిత్య సంస్థను పెట్టుకునే హక్కు, ఆ సంస్థ ద్వారా తాము అర్హులని భావించిన వారికి పురస్కారాలిచ్చే హక్కు ఎవరికైనా ఉంటుంది. అయితే ఆ హక్కును ఉపయోగించు కొనేవాళ్ళు ఏ రచయిత పేరుతో తాము సంస్థను పెట్టుకున్నారో, ఆ రచయితను అవమానించే విధంగా కార్యక్రమాలు చేయడం మంచిది కాదు. ఇది ఆ రచయిత భావజాలానికీ, ఆ రచయిత ఉద్యమానికీ ద్రోహం చేయడమే అవుతుంది. ఇది క్షమించరాని తప్పు. ఈ తప్పుకు పాల్పడడం మంచిదికాదు. పైగా ప్రశ్నించిన వాళ్ళ మీద ఎదురుదాడి చేయడం ఇంకా తప్పు. గురజాడ అప్పారావు గారు 1862లో పుట్టి 1915లో మరణించారు. 53 ఏళ్ళు బతికారు. అనేక వ్యాపకాల నడుమ అనారోగ్యంతో సహజీవనం చేస్తూ 1600 పుటలు రచనలు చేశారు. దాదాపు మూడు దశాబ్దాలు రచనా జీవితం గడిపారు. ఆయన సాహిత్యం కొందరికి ఖేదం, కొందరికి మోదం కలిగించింది. ఖేదం పొందినవారు గురజాడ కవే కాదనీ, అకవి అనీ తూలనాడారు. ఆయన కన్యాశుల్కం నాటకం రాయనేలేదనేశారు. ఇంకా కన్యాశుల్కం నాటకమే కాదనేశారు.



నిండు చెరువులో నీళ్ళ లేవు అనడమంటే ఇదే.ఇది గురజాడ వలన ఖేదం పొందినవాళ్ళలో మొదటి తరం వారి లీలలు. రెండో తరం వాళ్ళు గురజాడ సంస్కృతీ విధ్వంసకుడనీ,ఆయన పిరికివాడనీ,ఆయన సాహిత్యంలో దేశభక్తే లేదనీ హీనంగా మాట్లాడారు. అయ్యో పాపం అన్నవాడిని పాపిష్టి వాడా అని తిట్టినట్లు 'దేశమును ప్రేమించుమన్నా' అన్న రచయితను దేశభక్తుడు కాదని నిరసించారు మన సహృదయ శిఖామణులు. సరే వాళ్ళంతా సంప్రదాయవాదులు, గురజాడ ఆధునికత వాళ్ళకు నచ్చలేదు గనుక, వాళ్ళు ఆయనను ఈసడించారు అనుకుందాం.

ప్రజాదృక్పథం గలవాళ్ళు కూడా కొందరు ఆయనను ఆయన కులం దృష్టితోనే చూచి అందులో బిగించే ప్రయత్నం చేశారు. ఆయనేమో బ్రాహ్మణ్యం ఎంత పతనం అయిందో చూపించారు. వర్ణ ధర్మం అధర్మ ధర్మం అని తీర్పునిచ్చిన రచయితను ఆయన కులంలో బిగించడం న్యాయమేనా? రాజుకూ దళిత అమ్మాయికీ ప్రేమ పెళ్ళి జరిపించిన రచయితను ఆయన కులం చట్రంలో బిగించడం ఉచితమేనా? ఆయన సాహిత్యం వల్ల మోదం పొందినవారు గురజాడను అక్కున చేర్చుకున్నారు. ఆయనను తమకు తాత్విక మూల

పురుషునిగా చేసుకున్నారు. గురజాడను శాస్త్రీయంగా విశ్లేషిస్తూ, ప్రజా రచయితగా ప్రచారం చేస్తూ, ఆయన సాహిత్యం వల్ల ఖేదం పొందిన వాళ్ళను పూర్వపక్షం చేస్తున్నారు. ఇది ఒక యుద్ధం. ఈ యుద్ధం దాదాపు నూరేళ్ళుగా సాగుతున్నది. ఈ యుద్ధం ఇలా సాగుతుండగా ఇప్పుడు గురజాడకు మరో సమస్య వచ్చి పడింది. అదేమంటే నీ వేలితో నీ కళ్ళనే పొడుస్తాం అనే వర్గం, ఎగిరే పేల పిండిని కృష్ణార్పణం అనే వర్గం ఒకటి అవతరించింది. గురజాడ భావజాలంతో ఏమీ సయోధ్య లేని వర్గం ఒకటి ఆయన పేరుతో ఒక సంస్థను స్థాపించి, ఆయన భావజాలంతో ఏ కోశానా ఏకీభవించని వాళ్ళకు పురస్కారాలివ్వడం మొదలుపెట్టింది. ఇది ఈ శతాబ్దపు తలకిందులు అద్భుతం. సాధారణంగా మనకు నచ్చని భావ జాలంగల రచయిత మన ఊరివాడైనా, మన కులం వాడైనా, మన మతం వాడైనా, మన ప్రాంతం వాడైనా మనం అతనిని దూరం పెడతాం. దగ్గరికి రానీయం. గురజాడ వ్యతిరేకులు రెండు తరాల వాళ్ళు అలాగే చేశారు. వాళ్ళ ఆలోచనలు తిరోగమనమైనవైనా వాళ్ళు నిజాయితీపరులు. వాళ్ళతో ఏకీభ వించని వాళ్ళు కూడా ఈ విషయాన్ని ఆమోదిస్తారు. గురజాడ పేరుతో ఒక సంస్థ పెట్టాలన్నా, ఆ సంస్థతో గౌరవం పొందాల న్నా గురజాడ రచనా తత్వంతో మనం ఏకీభవించగలగాలి. గురజాడ రచనా తత్వం ఏమిటి? ఆయన సాహిత్యంలో ఆయన ఏయే ప్రతిపాదనలు చేశారు? ఆయన సామాజిక స్వప్నం ఏమిటి? ఆయన విమర్శించిన సామాజికాంశాలు ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాలి. గురజాడ ఆధునిక సమాజ స్వాప్నికుడు. ప్రవచనకారులు రకరకాల వ్యాఖ్యానాలతో ప్రచారం చేసే పురాణాలేవీ ఆధునిక సమాజాన్ని కోరుకోవు. అవి మధ్యయుగ సమాజాన్ని వైభవీకరించాయి. అవి ప్రచారం చేసింది రాచరిక, భూస్వామ్య సమాజం. వర్ణాధిక్య పురుషాధిక్య సమాజం. మత సమాజం. గురజాడ కోరుకున్నది ప్రజాస్వామ్య సమాజం. మత రహిత, వర్ణరహిత సమాజం. స్త్రీపురుష సమానత్వ సమాజం. పురాణం పాలకవర్గం వైపు నిలబడుతుంది. అవి చెప్పే కథలు, బోధించే నీతులు ప్రజలను దేవునికీ, రాజుకూ విధేయులుగా మార్చేది. రాజును చరిత్ర నిర్మాతగా పురాణాలు ప్రచారం చేస్తాయి. గురజాడ మనిషే చరిత్ర నిర్మాత అని చెప్పారు. మనిషి కష్టసుఖాలకు మనిషే కారణమని చెప్పాడు. కొండకోనల్లో దేవుని వెతకడంకన్నా ఎదురుగా కనిపించే మనిషిని నమ్మమంటారు. ఇలాంటి తేడాలు పురాణాలకూ, గుర జాడకు మధ్య ఉన్నాయి. అందువల్ల పురాణ ప్రవచనకారులకూ గురజాడకూ పొందిక కుదరదు.

గురజాడ తొలి దశలోనో, తర్వాత సందర్భానుసారంగానో కొన్ని భావవాద మాటలు ఉపయోగించినా అవి ఆయన చివరి భావజాలానికి ప్రాతినిధ్యం వహించవు. రీవారాణి 1907లో ఊటీ మీద పాటలు రాయ మంటే గురజాడ 'నీలగిరి పాటలు' పేరుతో ఆరు పాటలు రాశారు. కన్యాశుల్కం నాటకంలో సౌజన్యారావు పంతులు మధురవాణికి భగవద్గీతను బహూకరించాడు. పూర్ణమ్మ దుర్గలో కలిసిపోయినట్లు చెప్పారు. అందువల్ల గురజాడ భౌతికవాది కాదు, భక్తుడు, మా వాడే అని చంకలు గుద్దుకోవడం ఆత్మానం దమేగానీ శాస్త్రీయమైన వాదం కాదు. 'మనిషి కవిత రాసిన గురజాడ పురాణ ప్రవచనకారుల పాలిటి సింహం కదా! అందువల్ల గురజాడ బొమ్మను ఉపయోగించుకొని ఆయన భావజాల విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడడం ఏమాత్రం గౌరవనీయమైన పని కాదు. వర్ణ ధర్మాలను ప్రచారం చేసిన పురాణాలకూ, "వర్ణ ధర్మ మధర్మ ధర్మంబే" అన్న గురజాడకూ ఎక్కడ పొత్తు? గురజాడ పేరుతో సంస్థను స్థాపించిన వాళ్ళు గానీ, ఆ సంస్థ ఇచ్చే గౌరవం పొందేవాళ్ళు గానీ విజయనగరం లోని గురజాడ ఇంటి ముందు నిలబడి "వర్ణ ధర్మ మధర్మ ధర్మంబే" అని నినదించగలరా? 'మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అని విజయనగరంలో ఒక ఎత్తైన కోట మీదినుంచి ప్రకటించగలరా? 'మగడు వేల్పన పాత మాటది ప్రాణసఖుడ నేను' అనే మాటను విజయనగరంలోని మహిళలను సమావేశపరిచి ప్రకటించగలరా ? 'వెన్ బుద్ధిజమ్ వజ్ స్టాంప్డ్ అవుట్, ఇండియా కమిటెడ్ రెలిజియస్ సూసైడ్' అనే గురజాడ అభిప్రాయాన్ని విజయనగరం జిల్లాలో ఏదైనా బుద్ధక్షేత్రం ఉంటే అక్కడ కరపత్రంగా పంచిపెట్టగలరా? 'దళితు డు ఎదురైతే ఆలింగనం చేసుకోనివాడు మనిషెలా అవుతాడు?' అన్న ప్రశ్నను ఆధిపత్య కులాల నివాస ప్రాంతాలలో ప్రచారం చేయగలరా ? పౌరకచుక్క ప్రమాదకారి కాదు. 'సంఘ సంస్కరణ ప్రయాణ పతాక', 'దూరపు బంధువు' అనే నిర్వచనాలను జ్యోతిష్కుల ఇళ్ళ ముందు ప్రకటించగలరా? ఊరికే చెలామణి ఉందిగదాని గురజాడ పేరు పెట్టుకొని సంస్థను నెలకొల్పడం, దాని ద్వారా గురజాడ భావజాలానికి భిన్నమైన భావజాలం గల వాళ్ళను గౌరవించడం ఎవరికీ గౌరవం కాదు. గురజాడకు అవమానకరమైన పనులు చేయకండి దయచేసి. ఆ సంస్థకు వేరే పేరు పెట్టుకోండి.

గురజాడ వెన్నెల విహారి కాదు. నిప్పు కణం మీద సంచారి. గురజాడ విదూషకుడు కాదు. విజ్ఞుడు. గురజాడ యథాతథ వాది కాదు. మార్పు వాది. గురజాడ కాలక్షేపం వాది కాదు. కర్కశమైన వాస్తవిక వాది. ఆయన పేరు మీద ఒక సంస్థను పెట్టాలన్నా, ఆ సంస్థ గౌరవం స్వీకరించాలన్నా 'అన్నీ వేదాల్లో వున్నాయష' అనే అధిక్షేపాన్ని ఆమోదించే నిజాయితీ, ధైర్యం కావాలి. ❑

# 'అసత్యమే వారి ఇలవేలుపు'



రామచంద్ర గుహ
చరిత్రకారుడు


**భారతదేశ రాజకీయ పక్షాలను గమనిస్తే మీకు వాటిలో మూడు లక్షణాలు కనిపిస్తాయని' కుసుమబాలె పేర్కొన్నారు. అవి: '(1) ఒక వ్యక్తి నాయకత్వంలోని రాజకీయ పార్టీ(2) కుటుంబ నియంత్రణలో ఉన్న పార్టీ(3) రాజ్యాంగ వ్యతిరేక సంస్థ నేతృత్వంలో ఉన్న పార్టీ.ఈ మూడు లక్షణాలూ ప్రజాస్వామ్యానికి నష్టదాయకమైనవే.' ఆరెస్సెస్ ప్రచారక్ నరేంద్ర మోదీ కేంద్రంలో అధికారానికి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలలో ఏ ఒక్క దానినీ నెరవేర్చలేదు.**

మౌలిక భావుకత, శక్తిమంతమైన శైలి నిండుగా ఉన్న కథానికలు, ఇంకా 'కుసుమబాలె' అనే ఒక నవలిక ద్వారా కన్నడ సాహితీ జగత్తులో దేవనూర మహాదేవ తొలుత ప్రసిద్ధుడయ్యారు. దరిమిలా తన రాజకీయ చిత్తశుద్ధి, నైతిక ధైర్యానికి ఆయన పేరుపొందారు. ప్రభుత్వ ప్రాపకానికి ఎన్నడూ ఆరాటపడలేదు. అన్ని వేళల తాడిత, పీడిత ప్రజల పక్షాన నిలబడడం ద్వారా దేవనూర మహాదేవ అశేష ప్రజల గౌరవాదరాలకు పాత్రుడయ్యారు. భిన్న మతాల మధ్య సామరస్యానికి ఆయన కృషి చేశారు. సమాజంలో అన్ని రంగాలలోనూ బహుళతా వాదం విలసిల్లాలన్న లక్ష్యానికి మహాదేవ నిబద్ధుడు. హలాల్ మాంసం పై నిషేధం విధింప చేయడానికి హిందూత్వ వాదులు ప్రయత్నించినప్పుడు దేవనూర మహాదేవ స్వయంగా మైసూర్ మార్కెట్‌కు వెళ్లి హలాల్ మాంసాన్ని కొనుగోలు చేసి హిందుత్వ శ్రేణులను ధిక్కరించారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై తన దృక్పథాన్ని వివరిస్తూ దేవనూర మహాదేవ ఈ ఏడాది జూలైలో కన్నడంలో ఒక చిన్న పుస్తకాన్ని ప్రచురించారు (ఆర్ఎస్ఎస్ : ఆలా మట్టు అగలా) అది వెలువడిన ఒక వారం రోజులకు 'ది న్యూస్ మైన్యూట్' అనే వెబ్‌సైట్ ఇలా పేర్కొంది: 'ఆరెస్సెస్ భావాలు, సిద్ధాంతాలను నిశితంగా అధ్యయనం చేసిన ఈ చిన్న పుస్తకం ఆలోచనాపరులను విశేషంగా ఆకట్టుకొంటోంది.ఈ పరిణామంపై కలవరపడిన మిత, మతవాదులు ఆ పుస్తకాన్ని, దాని రచయితను అపఖ్యాతి పాలు చేసేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నారు.' పాలక బీజేపీ ఎంపీలు, హిందూత్వ రాజకీయాలను సమర్థించే 'మేధావులు' రచయితపై తీవ్రంగా ధ్వజమెత్తారు. మహాదేవను తిట్టిపోశారు. ఆయన పుస్తకాన్ని తీవ్ర ఖండన మండనలకు గురి చేశారు. అయినప్పటికీ ఆ పుస్తకం ప్రతులు అంతకంతకూ వేల సంఖ్యలో అమ్ముడుపోతున్నాయి. కర్ణాటక నలువైపులా మార్మూల ప్రాంతాలలోనూ ఆరెస్సెస్‌పై మహాదేవ విమర్శలు అసంఖ్యాకుల మాటా మంతీలో భాగమయ్యాయి. హిందూత్వ సిద్ధాంతవేత్తల్లో అగ్రగాములు అయిన ఎమ్ఎస్ గోళ్వల్కర్, విడి సావర్కర్ రచనల నుంచి ఉటంకింపులతో దేవనూర మహాదేవ పుస్తకం ప్రధాన పాఠం ప్రారంభమవుతుంది. కుల వ్యవస్థ, దాని సహజసిద్ధ సామాజిక హెచ్చుతగ్గులను హిందూ మత గ్రంథాలు అనుమతించాయనే వాదనతో వాటిని గోళ్వల్కర్ సమర్థిస్తాడు. కుల, జెండర్ అసమానతలను ఆమోదించిన, భారత రాజ్యాంగానికి ప్రతివాదమైన మనుస్మృతిని ఆరాధించాలని సావర్కర్ విజ్ఞప్తి చేస్తాడు. ముఖ్యంగా మహాదేవ ఎంపిక చేసిన సావర్కర్ ఉటంకింపు ప్రభావశీలమైనది: 'మన హిందూ జాతికి వేదాల తరువాత అత్యంత ఆరాధనీయమైనది మనుస్మృతి. పురాతన కాలం నుంచీ అది మన సంస్కృతి ఆచారాలు, ఆలోచన, ఆచరణకి మూలా ధారంగా ఉన్నది. మన జాతి ఆధ్యాత్మిక అన్వేషణలను శతాబ్దాలుగా ఏకీకృతం చేస్తున్న గ్రంథమది. నేటికీ కోట్లాది హిందువులు తమ నిత్య జీవితాలలో అనుసరిస్తున్న నియమాలు మనుస్మతి నిర్దేశించినవే. మనుస్మృతి హిందూ ధర్మశాస్త్రం. అది ప్రాథమిక ధర్మం'. గోళ్వల్కర్ రచనల నుంచి చేసిన మరో ఉటంకింపు మన దేశ సమాఖ్య విధానం 'విష పూరితమైనదని' విమర్శించింది. సమాఖ్య విధానానికి బదులుగా 'ఒక దేశం, ఒక రాష్ట్రం, ఒక చట్ట సభ, ఒక కార్యనిర్వాహక వర్గం' అనే సూత్రం ప్రాతిపదికన యూనిటరీ(ఏక కేంద్రక) రాజకీయ వ్యవస్థను నెలకొల్పుకోవాలని గోళ్వల్కర్ విజ్ఞప్తి చేశాడు.

ఆరెస్సెస్ శ్రేణుల్లో ఆలోచనలుగా అంగీకృతమవుతున్న విషయాల మొరటుదనాన్ని మహాదేవ మన దృష్టికి తీసుకువచ్చారు. గోళ్వల్కర్ పుస్తకం 'ఏ బంచ్ ఆఫ్ థాట్స్' సంఘ్ బైబిల్‌గా ప్రఖ్యాతి పొందింది. అయితే మహాదేవ ఏమన్నారో చూడండి: 'ఆలోచన' లేదా 'చింతన'గా భావించే దేనికోసమైనా ఆ పుస్తకంలో చూడండి. అందులో మీకు అలాంటిదేమీ కన్పించదు'. అది

కేవలం యాదృచ్ఛిక, ప్రమాదకరమైన విశ్వాసాలను, అవి కూడ గతించిన కాలానికి చెందిన వాటిని ప్రతిపాదిస్తుంది' (ఏ బంచ్ ఆఫ్ థాట్స్‌ను పలుమార్లు చదవిన వాణ్ణి గనుక మహాదేవ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను).




భారత రాజ్యాంగాన్ని సమర్థించే, ఔదలదాలిచే వారి దృష్టి కోణం నుంచి మహాదేవ తన పుస్తకాన్ని రాశారు. ఆరెస్సెస్, బీజేపీ నాయకులు ఆ మౌలిక శాసనాన్ని ఎంతగా ప్రశంసిస్తున్న ప్పటికీ వాస్తవానికి దాని ప్రాథమిక సూత్రాలయిన బహుళతా వాదం, కుల, జెండర్ సమానత్వం, వాక్ స్వాతంత్ర్యం, సమాఖ్య విధానం మొదలైన వాటికి బద్ధ వ్యతిరేకులు. 'భారత రాజ్యాం గానికి ఎంత ఎక్కువగా నష్టం చేస్తే అంత ఎక్కువగా విజయం సాధించినట్టుగా సంఘీయులు సంతృప్తి పొందుతారని' ఆయన వ్యాఖ్యానించారు. మహాదేవ ఇంకా ఇలా అన్నారు: 'రాజ్యాంగా న్ని నాశనం చేసేందుకు ఆరెస్సెస్, దాని అనుబంధ సంస్థలు చెప్పలేని చర్యలకు పాల్పడుతున్నాయి. రాజ్యాంగానికి గట్టి పునా ది, కేంద్రం, రాష్ట్రాలను కలిపి ఉంచుతున్న సమాఖ్య విధానాన్ని ధ్వంసం చేసేందుకు సంఘీయులు ఒక ఎడతెగని యుద్ధాన్ని చేస్తున్నారు'. ఆయన ఇంకా చాలా కఠినంగా వ్యాఖ్యానించారు: '2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ గోళ్వల్కర్‌కు గురు దక్షిణగా సమాఖ్య విధానాన్ని భూస్థాపితం చేస్తోంది'. సంఘీ యులు సత్యాన్ని గౌరవించరు. చారిత్రక రికార్డులను వక్రీకరి స్తారని దేవనూర మహాదేవ విమర్శించారు నకిలీ వార్తలను ప్రచారంలో పెట్టడంలో హిందూత్వ వాదులు ఘనాపాటీలని ఆయన దుయ్యబట్టారు. 'అసత్యం వారి కుటుంబ దేవత' అని మహాదేవ వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం వెలువరిస్తున్న పాఠ్యగ్రం థాలలో ప్రచారం చేస్తున్న పలు అసత్యాలను ఆయన నిశితంగా విశ్లేషించారు. ఆ అసత్యాలు బాలల మనసులను విషపూరితం చేస్తున్నాయని, హిందువులు కాని భారతీయుల పట్ల విద్వేషాన్ని పెంచుతున్నాయని మహాదేవ పేర్కొన్నారు. ఆరెస్సెస్‌యేతర రాజకీయ శక్తులు మన ప్రజాస్వామ్యం పతనమవడానికి ఎం తైనా దోహదం చేస్తున్నాయని మహాదేవ అంగీకరించారు. ఇం దుకు ఆయన్ని అభినందించి తీరాలి. 'భారతదేశ రాజకీయ పక్షా లను గమనిస్తే మీకు వాటిలో మూడు లక్షణాలు కనిపిస్తాయని' ఆయన పేర్కొన్నారు. అవి: '(1) ఒక వ్యక్తి నాయకత్వంలోని రాజకీయ పార్టీ(2) కుటుంబ నియం త్రణలో ఉన్న పార్టీ(3) రాజ్యాంగ వ్యతిరేక సంస్థ నేతృత్వంలో ఉన్న పార్టీ. ఈ మూడు లక్షణాలూ ప్రజాస్వామ్యానికి నష్టదాయ కమైనవే.' ఆరెస్సెస్ ప్రచారక్ నరేంద్ర మోదీ కేంద్రంలో అధికా రానికి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు విదేశాల్లోని బ్యాంకుల్లో ఉన్న భారతీయుల నల్లధనాన్ని వెనక్కి తీసుకురావడం, రైతుల ఆదాయాలను ఐదేళ్లలో రెట్టింపు చేయడం, ఏటా కోటి ఉద్యో గాలు సృష్టించడం గురించి కూడా మహాదేవ ప్రస్తావించాడు. ఈ హామీలలో ఏ ఒక్క దానినీ మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదు. పైగా ఆదాయాల్లో అసమానతలు పెరిగిపోయాయి. సంపదల్లో వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన ప్రధాన లబ్ధిదారులు గౌతమ్ అదానీ, ముఖేశ్ అంబానీ తదితరులు మాత్రమే. (ప్రస్తావిత ఇద్దరు పారిశ్రామికవేత్తలూ యాదృచ్ఛికంగా మోదీ సొంత రాష్ట్రం వారే). ఆరెస్సెస్, బీజేపీ ఆర్థిక సిద్ధాంతాలను విమర్శించడంకంటే వాటి భావజాల విశ్లేషణకే మహాదేవ అధిక ప్రాధాన్యమిచ్చారు. సంఘ్ స్వతస్సిద్ధ నిరంకుశ తత్వాన్ని, కులతత్వాన్ని, దాని మెజారిటీ వాద ధోరణు లను ఆయన నిశితంగా స్పష్టం చేశారు. ఇటీవల ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ ఆహ్వానంపై న్యూఢిల్లీలోని కులీన ముస్లింలు కొందరు ఆయనతో సమావేశమయ్యారు. అనంతరం వారు మార్పులకు సంఘ్ సానుకూలమే అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆ ముస్లిం పెద్దలు తప్పనిసరిగా మహాదేవ పుస్తకాన్ని చదవాలి. అలాగే ఏ మతానికి చెందినప్పటికీ ఆలోచనాపరుడైన ప్రతి భారతీయుడూ ఆ పుస్తకాన్ని చదివితీరాలి. హిందూత్వ సైద్ధాంతిక పుస్తకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. కర్ణాటకలో సంఘ్ కార్యకలా పాలను ఆయన ప్రత్యక్షంగా చూశారు. బ్యూరాక్రసీ, న్యాయ వ్యవస్థ, పోలీసు విభాగాల్లోకి చొరబ డడం ద్వారా, ఇంకా మత పరమైన ప్రదేశాలలో వివాదాలు రెచ్చగొట్టడం ఇత్యాది చర్యల తోనూ తమ ఉనికిని, ప్రాబల్యాన్ని విస్తరించుకునేందుకు ఆరె స్సెస్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్‌లు నిరంతరం చేస్తు న్న ప్రయత్నాల గురించి ఆయనకు బాగా తెలుసు. కర్ణాటకలో సంఘ్ అంతిమ విజయాన్ని సాధిస్తే కన్నడ సమాజ సమున్నత బహుళత్వ, మానవతా సంప్రదాయాలు, ఉత్కృష్ట సాహిత్య, మేధా సంస్కృతి, ప్రజా జీవితంలో వివేచన, సభ్య మర్యాదలు పూర్తిగా మంట గలిసిపోయే సంభావ్యత మహాదేవను ఎంతైనా కలవరపెడు తోంది. కనుకనే భారత గణతంత్ర రాజ్య సమున్నత సంప్రదా యాలను పునరుద్ధరించేందుకు, మిత, మతవాదుల విధ్వంసాల నుంచి రిపబ్లిక్‌ను కాపాడేందుకు ఆరెస్సెస్, బీజేపీలను

**మిగతా 42లో**

# పెదాలు దాటని మాటలు

మాడభూషి శ్రీధర్

**ఏమని చెప్పగలను. మళ్లీ జన్మించినట్టుంది. కొన్ని రోజులైతే ఎక్కడున్నానో, మళ్లీ చెప్పగలనా, వినగలనా, రాయగలనా, అనే అనుమానాల నుంచి ముందుకు నడిస్తున్న నా శ్రీమతి వేద కల్యాణిని ఏమని చెప్పగలను, నా కుమారుడి గురించి, కూతురి గురించి ఏమని చెప్పను. వారు లేక ఏముంది? వేద కల్యాణి, హర్ష, వసుప్రద, చిన్నారి వైష్ణవి, అల్లుడు, నడిపించినారండీ.**



ఈ ఏడాది, ఏప్రిల్ నెల, ఓ సాయంత్రం. హైదరాబాద్లో ఒక సాహిత్య కార్యక్రమం. నా చిన్ననాటి మిత్రుడి తమ్ముడు తన అనుభవాలు వివరించుకున్న, విరచించిన పుస్తకాన్ని గురించి కొన్ని మాటలు చెప్పుకునే అవకాశం. స్వయంగా బతుకు పోరాడిన జీవి అని మిత్రుడి ద్వారా తెలుసుకుని, ఆ పుస్తక ఆవిష్కరణ సభకు వెళ్ళాను. విద్వాంసులు ప్రసంగించారు, నేనూ మాట్లాడాను. కాని.. ఆ తరువాత మాటలు అర్థం కావడం లేదు. భోజన సమయంలో అయోమయంగా ఉంటున్నది. నాకే మయింది అంటున్నాను. మాట్లాడి అలసిపోయారేమో అన్నారు నా శ్రీమతి. నోటికి మాటలు రావడం లేదు. కారులో ఇంటికి ఎలా చేరుకున్నానో తెలియదు. ఆ తరువాత ఏమయింది? ఏమో.. కొన్ని రోజులపాటు నేనెక్కడున్నాను, ఉన్నానా, ఆ జీవితం ఏ విధంగా నడిచింది, నాకు కష్టాలు ఏమైనా వచ్చాయా.. తెలియదు. అమ్మ అనడం తప్ప మరేమీ అనలేను. తనను (శ్రీమతి) కల్యాణి అని అనుకోవడం తప్ప మరేదీ రాదు నాకు. కడుపులో సూదులు పొడిచారని తెలియదు. కాస్సేపు కాళ్లు పడిపోవడం, వంకర అవడం. జీవితంలో నెల రోజులు శూన్యం. కడుపులో గుచ్చినది ఏమిటో, ఏం చేసారో ! హాస్పిటల్, డాక్టర్లు, మందులు తెలియదు. బాగున్నారా.. మిత్రుల పలకరింపులు. వారెవ్వరో తెలియటం లేదు. మార్పు, ఛేంజ్.. చదువుల తల్లి వాగ్దేవి నాకు ఈ రెండు చెప్పింది ముందు. అదొక్కటే మాట. 'మార్పు' అంటే కల్యాణికే అర్థం అవుతుంది. దీపం ఆర్పాలన్నా, దీపాలు వెలిగించాలన్నా అదే మాట. 'లైట్'.. ఆ తరువాత తెలిసింది. లైట్.. అంటే చాలు, తీసేయడం. మళ్లీ అదే అంటే మళ్లీ వేయడం. కల్యాణికి మాత్రం పూర్తిగా తెలుస్తున్నది. తిన్నా, నీళ్లు తాగినా, కడిగినా, వస్త్రాలు ఇచ్చినా, మార్చినా, చేర్చినా, తీర్చినా, తీర్చిదిద్దినా, కళ్లతో చెప్పినా... భార్య అయినా అమ్మయినా తానే. నా అమ్మే ఆమే. అన్నీ తనే, అందరితో మాట్లాడాల్సిందే ఆమెనే. మరి, నవ్వుతూ ఉండడమే కాక మరేమీ లేదు.

'నవనీతం'.. ఇది రెండో మాట. ఈ మాట నాకు ఏమని, తెలుసో, సొంతంగా పుట్టిందో, తెలియదు. నాకు వచ్చిన, తెలిసిన మాట అదే. అన్నం పెట్టినా, అడిగినా అదే అదే పదం. కల్యాణికి ఏడిచే అవకాశం లేదు. హర్ష నన్ను చూసి తట్టుకోలేక పోయేవాడు. 'నాన్నను నిలబెట్టే పనిచేయడం తప్ప నీకు మరేమీ లేదు. నిలబడు. పోరాడు. నాన్న మళ్లీ జ్ఞాపకాలు తెచ్చుకోవాలి. అదే నీ కర్తవ్యం' అని కల్యాణి ధైర్యం ఇచ్చింది. కొడుకు నిలదొక్కుకోవాల్సిందే. హాస్పటల్ కిటికిలో నుంచి చూస్తే, అది ఏమిటో తెలియదు. కిటికి వెనుక 8 అంతస్తులున్నాయని, అది కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) అనే ఒక పెద్ద హాస్పటల్ అని నాకు 3 నెలల వరకు తెలియదు. బంధువులు మిత్రులు అంతా నన్ను పడిపోకుండా గట్టిగా పట్టుకున్నారు.. స్కాన్

*మిత్రులు శ్రీధర్ గారు పంపిన ఈ ప్రకటన చదివి అవాక్కయ్యాను. నాకున్న సమాచారం మేరకు గుండెకు సంబంధించిన సమస్య అని మాత్రమే తెలుసు. మధ్యలో ఒకసారి ఫోను చేశాను. వేదకల్యాణి గారే తీసుకుని శ్రీధర్ గారికి ఇచ్చారు. మరో నెల పడుతుంది పూర్తిగా గాడిలో పడడానికి అన్నారు. ఇంతటి విపత్తు జరిగిందని అప్పటికీ నాకు తెలియదు. అందుకే ఈ ప్రకటన దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రస్తుతం కోలుకున్నారన్న వార్త కొండంత సంతోషాన్ని ఇచ్చింది. వేదకల్యాణి గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు.*
*– డీవీవీయస్ వర్మ*

చేయించడానికి. అసలు స్కాన్ చేయడం సాధ్యమేనా. చాలాసేపు తరువాత చేయగలిగారు. నేను చాలా ఇబ్బందిపడ్డానట. తెలియకపోవడం ఎంతో హాయి కదూ. విచిత్రం. పెదాలు దాటని భాషలు ఉంటాయని తేలింది. కొన్ని వారాల దాకా నాకు చాలా తెలియదు. అంతకుముందు చేసే పూజలు, స్తోత్రాలు ఎక్కడికి పోయాయో. భగవద్గీత అంటే ఏమిటో చెప్పే టీవీ ప్రసంగాలు అర్థం కావడం లేదు. భగవంతుడెవరు? ఓ యాభై పుస్తకాలు రచించానని వారు అంటూ ఉంటే అవునా అంటున్నాను. పెదాలు దాటని అక్షరాలు ఇంకా వెతుక్కుంటున్నాయి. మెదడులో పలికించే సరస్వతి స్వరం వినపడడం లేదు. మెదడు పనిచేయడం మొదలవుతుందా? రెండు నెలలు దాటిన తరువాత కూడా కొన్ని చిన్నఅక్షరాలు కూడా అర్థం కావడం లేదే!

పెద్ద అక్షరాలు ఒకటో రెండో గుర్తొస్తున్నాయి. కాని చదవలేను. చెప్పలేను. తెలిసినా మాట్లాడలేని శక్తి. ఓ నాలుగు నెలల నాటికి మరికొన్ని అక్షరాలు, పలికిన పదాలు. ఓ రోజు పెద్ద డాక్టరు గారు నన్ను చూడడానికి వచ్చినపుడు కల్యాణి నాలుగు విష్ణు సహస్రనామాలు చెప్పి, చెప్పించడం చూసి ఆశ్చర్యపోయారు. 'ఇంకేం.. వస్తుందిలేండి. విష్ణు సహస్రనామాలు చేస్తూ ఉండండి. అదే సరైన నేర్చుకునే ప్రయత్నం' అన్నారు. ఎంత ఆశ్చర్యం. కొన్నిపదాలు సొంతంగా నేనే చెప్పలేను. కాని రికార్డు చెప్పే సహస్రనామాలు కొన్ని చెప్పగలిగితే అదే ఆశ్చర్యం. కొన్ని నెలల దాకా ధ్వనులు వినలేకపోయాను. చిత్రహింస భరించలేను. కాని, హాయిగా సాగే మాయాబజార్, గుండమ్మ కథ, మిస్సమ్మ, విప్రనారాయణ, అప్పుచేసి పప్పు కూడు వంటి సినిమాలు మాత్రమే కాలక్షేపం. స్ట్రోక్ అని తేల్చారు. డాక్టర్‌లు బతికించారు. నాకు కాళ్లు చేతులు అన్ని అంగాలు మేలుగానే ఉన్నాయి. కాని, ఉండవలసిన ఆలోచనలు, పలుకులు, మాటలు, పెదాలు దాటని అక్షరాల వల్ల మౌని కాకతప్పలేదు. గొంతు విప్పి అరిచే వీల్లేదు. రాయడం సాగదు. పాఠాలు, ఉపన్యాసాలు కొన్నాళ్లు మరిచిపోవలసిందే. పత్రికలు చూడలేను, పుస్తకాలు చదవలేను, ఇంకా మరెన్నో పరిమితులు. నన్ను బతికించిన వారెవరంటే, రోజూ నాకు కావలసిన చికిత్స చేసిన వారు వైద్యులు. కాని హాస్య నటులే వైద్యులై నవ్వులు పంచారు. యాక్టర్లే, వారే అసలు డాక్టర్లు. ప్రముఖు లెవరంటే 'డాక్టర్' బ్రహ్మానందం, 'సర్జన్' రాజేంద్రప్రసాద్, న్యూరో ఫిజిషియన్ 'బిత్తిరి సత్తి' వంటి పెద్దలు నా ట్రీట్‌మెంట్ నిపుణులు. యాక్టర్లు, కాదు కాదు డాక్టర్లు నన్ను బతికించారు. అంటే డాక్టర్లు కాదని కాదు. ఆ తరువాత దశలో వారి సాయం చాలా గొప్పది. అమ్మకు ఇతడు తన కన్నకొడుకు అని ఎప్పుడో జ్ఞాపకం పోయింది. ఓ రెండు మూడు నెలల నుంచి అమ్మవలెనే కొడుక్కి ఏమీ తెలియదు. ఇద్దరికి ఒకరి గురించి మరొకరికి తెలియదు.. ఏ బాధా లేదు. కుమారునికి కొన్ని కొన్ని జ్ఞాపకాలు కొంచెంగా వస్తున్నాయని... అమ్మకు ఇంకా జ్ఞాపకం రావడంలేదు.

అక్కడ వార్ధక్యంలో, జ్ఞాపకాలన్నీ కోల్పోయిన అమ్మ. ఇక్కడ ఆ అమ్మ కుమారుని జీవనంలో ఓ నెల, లేదా రెండు నెలలు కాలం ఆగిపోయింది. కాని కల్యాణికి కాలం ఆగిపోలేదు. కష్టమైనా కాదన్నా కాలాన్ని నడిపించక తప్పదు. ఎంత హాయి. తెలియకపోవడం హాయి అనాలా లేక బాధని అందామా? మా నాన్నగారు పరమపదించడానికి ముందు అమ్మకు అన్నీ తెలుసు. అందుకే బాధపడింది ఆ కష్టాలకు. మా నాన్న మధ్య మధ్య అంటూ ఉండేవాడు.. జ్ఞాపకం నాకు శాపమో, వరమో? గుర్తుంచుకోవడం నాకు వరమా. ఒక్కోసారి శాపమే అంటే, మరోసారి కాదనే వారు. నేను ఆలోచించేవాడిని.. వరమా శాపమా? భగవద్గీతలో ఓ దశలో జ్ఞాపకాలు, జ్ఞానం, మరుపు కృష్ణుడు తానే అందరికీ ఇస్తాడు అని చెప్పినట్టు లీలగా గుర్తుంది. ప్రస్తుతం, ఇప్పుడొక చరిత్ర నడుస్తున్నది, కొంత కొంత తెలిసి వస్తున్న విషయాలు. ఇంకా వచ్చిరాని, వచ్చీ వస్తుండి, రాని విషయాలు. అర్థం కాని అక్షరాలు కొన్ని, పదాలు కొన్ని, మాటలు కొన్ని, వచ్చినవి కొన్ని. కాళిదాసు, మహాకవి కన్న ముందు తీవ్ర అమాయకుడు. కొమ్మపైన ఎక్కి దాన్నే నరికే మేధావి. నా మిత్రుడు జి.రాధాకృష్ణ చాలా వ్యంగ్యంతో మాటలు కలిపేవాడు. నేను సెకండ్ హాఫ్లో వచ్చే కాళిదాసునట. అతను మహా అసాధ్యుడు. కాని నేను ఫస్ట్ హాఫ్ కాళిదాసుగా సగంవ త్సరం సాగిపోయింది. సెకండ్ హాఫ్ కాళిదాసు నాలికపై కాళికా దేవి బీజాక్షరాలు రాస్తుంది కదూ. చదవతాను కదూ, చెప్పగలను కదూ? ❑


వేదకల్యాణి చేయూతతో...

# 'అసత్యమే వారి ఇలవేలుపు'

(40వ పేజీ తరువాయి)


వ్యతిరేకించే వారందరూ సమైక్యమవ్వాలని, సమష్టి కార్యాచరణకు పూనుకోవాలని మహాదేవ విజ్ఞప్తి చేశారు. ఆయన ఇలా రాశారు: 'ఇప్పటికైనా ప్రగతిశీల బృందాలు, సంస్థలు, పార్టీలు వేటికవే ఉండడం కాకుండా సమైక్యమై ఒక నదిలా ముందుకు సాగాలి. ఇది సాధ్యం కావాలంటే ముందు తమ స్వీయ ఆధిక్యతా ధోరణులు, అహాలను విడనాడాలి. ఒక లక్ష్య సాధనకు అనేకానేక మార్గాలు ఉంటాయనే సత్యాన్ని వినయపూర్వకంగా అంగీకరించాలి. నాయకత్వ వివాదాలకు స్వస్తి చెప్పాలి. తామే నాయకత్వం వహించాలన్న వైఖరిని విడనాడాలి. సమాఖ్య విధానాన్ని, భారత రాజ్యాంగాన్ని, భారతీయ నాగరికతలోని వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు సమైక్యమవ్వాలి. పౌరులు, సమాజిక సముదాయాలు పాల్గొని, సకల అంతరాలను అధిగమించే సహనశీల సంస్కృతిని పెంపొందించే భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకునేం దుకు కలసికట్టుగా కృషి చేయాలి'. ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**




ఎంత భయమో..!

గుండెల్లో మిస్సవదు..!








అందుకే ఇచ్చారా.. !


కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 1 - Issue No : 3 December 2022

## కొత్త పుస్తకాలు స్వీకారం




**if undeliverd please return to:**

**B.Ramesh Chandra Babu**

**34-15-1,**
**Doddipatal Vaari Thota Veedhi,**
**Tanuku - 534 211**
**West Godavari, Ap**
**Phone No : 93971 14495**

Printed Matter - Book Post

To :

**Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.**